www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 202 | శుక్రవారం | 11 జనవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



దిశతిరిగిన శీతగాలి



రాష్ట్రంలో మళ్లీ చలి తీవ్రత ఏజెన్సీలో మరింత గజగజ రెండు రోజుల్లోనే 4డిగ్రీలు పతనం **3**

అయోధ్య బెంచ్ నుంచి తప్పుకున్న న్యాయమూర్తి



విచారణ 29కి వాయిదా కొత్త ధర్మాసనం ఏర్పాటు చేస్తామన్న సుప్రీం కోర్టు **16**

ఆడవాళ్లంటే అలుసా..?



నిర్మలాసీతారామన్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై రాహుల్‌కు మహిళా కమిషన్ నోటీసు **16**

హిందీ తప్పనిసరి



8వ తరగతి వరకు అన్ని పాఠశాలల్లో విధిగా ఉండాలని కమిటీ సిఫారసు **16**

అగ్రవర్ణ కోటాపై పిటిషన్



సుప్రీం కోర్టులో దాఖలు **16**

సీనియారిటీ తేలిన తర్వాతే పోలీసుల విభజన

ఎపి వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కేంద్ర డిఒపిటికి లేఖ **3**

అలోక్ ఫైర్డ్



సిబిఐ డైరెక్టర్ పదవి నుంచి అలోక్‌వర్మకు ఉద్వాసన, అగ్నిమాపక శాఖకు బదిలీ

- ఎం నాగేశ్వరరావుకు డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు
- ఢిల్లీ పోలీసు ఆధీనంలో సిబిఐ కార్యాలయం
- ప్రధాని సారథ్యంలో ముగ్గురు సభ్యుల హై పవర్డ్ కమిటీ భేటీ తరువాత కేంద్రం కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ: సిబిఐ డైరెక్టర్‌గా ఉన్న అలోక్ వర్మను ఆ పదవినుంచి తొలగించాలని ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల హై పవర్డ్ కమిటీ నిర్ణయించింది. వారం రోజుల్లోగా కొత్త సిబిఐ డైరెక్టర్ నియామకాన్ని చేపడతారు. ప్రధాని కార్యాలయంలో గురువారం దాదాపు రెండుగంటల పాటు కమిటీ సమావేశం జరిపిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. అలోక్ తొలగింపునకు మోడీ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిక్రీ మొగ్గు చూపగా, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే మాత్రం వ్యతిరేకించారు. అవినీతి ఆరోపణలు, విధి నిర్వహణలో అలసత్వం కారణంగా ఆయనను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కాగా అలోక్ వర్మను అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్‌గా బదిలీ చేశారు. అలాగే గతంలోఅదనపు డైరెక్టర్‌గా నియమించిన ఆర్ నాగేశ్వర రావును తిరిగి అదే పదవిలో నియమించారు. తదుపరి ఆదేశాలు జారీ చేసేంతవరకు ఆయన అదే పదవిలో కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. సిబిఐ డైరెక్టర్‌గా అలోక్‌ను కొనసాగిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత విధుల్లో చేరిన 24 గంటలకే ఆయనను తొలగిస్తూ మోడీ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. కాగా సిబిఐ చరిత్రలో ఒక సిబిఐ డైరెక్టర్‌ను పదవీ కాలం పూర్తికాక ముందే తప్పించడం ఇదే మొదటి సారి కావడం విశేషం. కమిటీ నిర్ణయం నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా సిబిఐ ప్రధాన కార్యాలయం చుట్టూ భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. అలోక్‌వర్మకు పూర్తిస్థాయి అధికారాలు ఇవ్వాలా వద్దా అనే విషయాన్ని నిర్ణయించేందుకు అత్యున్నత స్థాయి కమిటీ బుధవారం సమావేశం అయింది. ఈ కమిటీలో ప్రధాని మోడీతో పాటు లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష



గురువారం రాత్రి ఢిల్లీలోని సిబిఐ కార్యాలయం వద్ద భద్రత



నాగేశ్వర్‌రావు(ఫైల్)

తరువాయి 6లో



గిన్నెస్ వైపు కాళేశ్వరం

- ఈ నెలాఖరులో భారీ స్థాయిలో కాంక్రీటు పనులు
- గిన్నెస్, లిమ్కా రికార్డులకు ఎక్కించాలని ఎల్అండ్‌టి దరఖాస్తు

మన తెలంగాణ/హైదరాబాద్

సిమెంటు కాంక్రీట్ పనుల్లో ఇప్పటికే ప్రపంచ రికార్డు నెలకొల్పిన కాళేశ్వరం ప్రాజెక్టు ఈ నెలాఖరులో మరో భారీ రికార్డును సొంతం చేసుకోబోతోంది. గిన్నెస్ రికార్డుతో పాటు లిమ్కా రికార్డును సాధించేలా ఇప్పటికే ఆ రెండు సంస్థలకు ఎల్ అండ్ టి సంస్థ దరఖాస్తు చేసుకుంది. ఈ నెల 24వ తేదీ నుంచి 25వ తేదీ వరకు 24 గంటల వ్యవధిలో 24 వేల ఘనపు మీటర్ల మేర సిమెంటు కాంక్రీటు పనులను మేడిగడ్డ ప్రాజెక్టు దగ్గర చేపట్టేలా ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో 7,212 ఘనపు మీటర్ల కాంక్రీటు పనులతో రికార్డును సృష్టించిన కాళేశ్వరం గత నెల 23న 24 గంటల వ్యవధిలో 16,722 ఘనపు మీటర్ల కాంక్రీట్ పనులను పూర్తిచేసి మరో రికార్డును సృష్టించింది. ఈసారి వాటిని అధిగమించే తీరులో రికార్డు స్థాయి ప్రయత్నాలు మొదలయ్యాయి. "తేదీని ఇంకా ఖరారు చేయలేదు. ఈ నెల 24న పనులు మొదలుపెట్టాలా లేక 25వ తేదీనా అనేదానిపై నిర్ణయం ఇంకా జరగలేదు. 24

తరువాయి 6లో

కొలువుల కసరత్తు

కొత్త నోటిఫికేషన్ల జారీకి వీలుగా ఉద్యోగుల లెక్కలు తీస్తున్న ప్రభుత్వ విభాగాలు | మంజూరైన పోస్టులు, ప్రస్తుతమున్న ఉద్యోగుల సంఖ్యపై ఆరా

మన తెలంగాణ /హైదరాబాద్

ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయాలనుకుంటున్నందున ఇప్పుడు ఏయే శాఖలో, విభాగంలో ఎంత మంది ఉద్యోగులు ఉన్నారు, ఎన్ని ఖాళీగా ఉన్నాయో తేల్చే పనిలో పడింది. అన్ని శాఖల, విభాగాల అధిపతులకు ఇటీవల లేఖలు రాసిన ప్రభుత్వం పూర్తి వివరాలను ఆర్థిక విభాగానికి ఇవ్వాలని స్పష్టం చేసింది. ఇందుకోసం కొన్ని నమూనాలను కూడా జతచేసింది. ప్రతీ శాఖ, విభాగంలో మంజూరైన పోస్టులు, ప్రస్తుతం పనిచేస్తున్నవారి సంఖ్య, ఖాళీ పోస్టుల సంఖ్య, ఇతర విభాగాల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చినవారి వివరాలు, ఔట్‌సోర్సింగ్/కాంట్రాక్టు తదితరాల కింద పనిచేస్తున్నవారు, వారికి చెల్లిస్తున్న వేతనం, వారిని నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు, వారికి ఇస్తున్న జీతం ఏ ఖాతాలోంచి వెళ్తోంది, డైలీవేజ్ కార్మికులు ఎంత మంది ఉన్నారు, పార్ట్‌టైమ్/ఫుల్‌టైమ్ సిబ్బంది ఎంత మంది ఉన్నారు. ఇలా అన్ని వివరాలను ఆర్థిక శాఖకు పంపాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ఈ లెక్క తేలిన తర్వాతనే ఏయే శాఖల్లో ఎన్ని ఖాళీ పోస్టులు ఉన్నాయో, ఎన్నింటిని ఎలా



భర్తీ చేయాలో ప్రభుత్వం ఒక స్పష్టతకు రాగలుగుతుంది. ఆ తర్వాతనే ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లను ఇవ్వడానికి వీలవుతుందని, అందువల్లనే ఈ ప్రక్రియను ప్రారంభించినట్లు ఆర్థికశాఖలోని అధికారి ఒకరు వివరించారు. కొన్ని విభాగాల్లో మంజూరైన సంఖ్యకంటే పనిచేస్తున్నావారి సంఖ్య ఎక్కువగా ఉందని, ఇది ఎందువల్ల జరిగిందో తేలాలంటే ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నవారి వివరాలు, వారి నియామకానికి ఎప్పుడు ఉత్తర్వులు జారీ అయ్యాయి, ఎంత కాలం నుంచి పని చేస్తున్నారు, వారికి ఇస్తున్న వేతనాలను ఏ ప్రాతిపదికన ఇస్తున్నారు, ఆ విధంగా ప్రతీ ఏటా ఎంత ఖర్చవుతోంది తదితరాలన్నింటిపై స్పష్టత వస్తుందని ఆ అధికారి పేర్కొన్నారు. దీనికి తోడు పదోన్నతుల విషయంలోనూ అనేక సమస్యలు ఉన్నాయని, కొన్నింటిపై న్యాయస్థానాల్లో విచారణ పెండింగ్‌లో కూడా ఉందని, కొత్త జోనల్ వ్యవస్థ అమలులోకి వచ్చిన తర్వాత బదిలీలు, పదోన్నతుల విషయంలో నిబంధనల ప్రకారం వ్యవహరించాల్సి ఉన్నందున ఇప్పుడు పని చేస్తున్నవారి వివరాలు తెలియకుండా ఆ దిశగా ఎలాంటి నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదని వివరించారు. సమైక్య రాష్ట్రంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయడానికి 1999లో అప్పటి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని, 175 పోస్టులకు మెరిట్ జాబితా కూడా సిద్ధమైందని, ఆ తర్వాత పదోన్నతుల ద్వారా కొన్ని పోస్టుల్ని భర్తీ చేయడంతో మెరిట్ జాబితాలో ఉన్నవారికి

తరువాయి 6లో



రూ. 20 నుంచి 40 లక్షలకు

చిన్న వ్యాపారులకు పెరిగిన జిఎస్‌టి వర్తింపు పరిమితి **11**

బహ్రెయిన్‌లో నిజామాబాద్ యువకుడి ఆత్మహత్య

2

కుంచెపోటు



చలా పాడా... కోటా బిల్లు మీద తన హావభావాలు మీడియాకు కనబడకుండా..!

వృద్ధ దంపతులకు కెటిఆర్ అభినందన

మన తెలంగాణ/హైదరాబాద్: మానవసేవయే మాధవ సేవగా భావించి నిర్మించిన వృద్ధాశ్రమాన్ని ప్రభుత్వానికి ఇచ్చేందుకు ముందుకు వచ్చిన వృద్ధ దంపతులు మేరెడ్డి సత్యనారాయణ రెడ్డి, జానకమ్మలను టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అభినందించారు. ఆశ్రమాన్ని ప్రభుత్వరంగంలోని ర్వహించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. టిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను వృద్ధ దంపతులు సత్యనారాయణ రెడ్డి జానకమ్మలు కలిసి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పెద్దకొండూరు గ్రామంలో నిర్మించిన మేరెడ్డి సత్యనారాయణరెడ్డి, జానకమ్మ వానప్రస్థాశ్రమాన్ని




తరువాయి 6లో

అమోఘంగా ఆర్‌ఆర్‌ఆర్

125 గ్రామాలు, 12 పట్టణాలకు ప్రగతి

- ఔటర్ రింగ్‌రోడ్డుకు దీటుగా ఆర్‌ఆర్‌ఆర్
- కంది, షాద్‌నగర్‌లో నాలుగు వరసల రహదారి నిర్మాణం
- రీజినల్ రింగ్‌రోడ్డుకు 70 కి.మీలు రాష్ట్ర ప్రభుత్వం.. 268కి.మీలు కేంద్ర ప్రభుత్వ నిధులు
- అంచనా వ్యయం రూ.12 వేల కోట్లు



మన తెలంగాణ/హైదరాబాద్

మహానగరాన్ని ఆనుకొని ఉన్న 12 పట్టణాలే లక్ష్యంగా ఆర్‌ఆర్‌ఆర్ (రీజనల్ రింగ్‌రోడ్డు, 338 కిలోమీటర్ల మేర) రూపుదిద్దుకుంటోంది. హైదరాబాద్ సహా సమీపంలో ఉన్న పట్టణాల అభివృద్ధి దిశగా తెలంగాణ ప్రభుత్వం పక్కా ప్రణాళికను రూపొందించింది. హైదరాబాద్ చుట్టూ 50 నుంచి 100 కి.మీ దూర పరిధిలో ఉన్న పట్టణాలు, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ఈ ప్రణాళిక రూపుదిద్దుకున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. ఆరు నెలలుగా కొనసాగుతున్న ఈ ప్రక్రియ ఎన్నికల కారణంగా

తరువాయి 6లో

ఎస్తోనియాలో నాణ్యమైన విద్య

తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేయడం సంతోషం

ఎస్తోనియా రాయబారి రిహో క్రువ్



మనతెలంగాణ/హైదరాబాద్ : ఎస్తోనియా దేశంలో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని ఆ దేశ రాయబారి రిహో క్రువ్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఐటిని అద్భుతంగా ప్రోత్సహిస్తుందని, అందుకే ఈ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలనుకుంటున్నామని అన్నారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ టి.పాపిరెడ్డి, విద్యాశాఖ స్పెషల్ సిఎస్ అజయ్ మిశ్రా, వైస్ ఛైర్మన్లు ఆర్.లింబాద్రి, వి.వెంకటరమణలతో గురువారం ఎస్టోనియా రాయబారి రిహో క్రువ్ సమావేశమమై చర్చించారు. ఈ సందర్భంగా రిహో క్రువ్ మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఛైర్మన్ టి.పాపిరెడ్డి మాట్లాడుతూ, కేవలం 13 లక్షల జనాభా కలిగిన ఎస్టోనియా దేశానికి సైబర్ టెక్నాలజి, ఇ–కామర్స్, టెలికమ్యూనికేషన్ రంగాలలో ప్రపంచ దేశాలలో గుర్తింపు ఉందని పేర్కొన్నారు. ఆ దేశంలో మొత్తం ఏడు యూనివర్సిటీలు ఉంటే అందులో ప్రపంచంలోని టాప్ 100 వర్సిటీలలో ఒక వర్సిటీ ఉందని చెప్పారు. ఎస్తోనియా దేశంలో తక్కువ ఫీజుకే నాణ్యమైన విద్యను అభ్యసించే అవకాశం ఉందని తెలిపారు. ఆ దేశంలో 95 మంది మన దేశ విద్యార్థులు విద్యనభ్యసిస్తుంటే అందులో 90 మంది అక్కడి ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌తో ఉచితంగా చదువుకుంటున్నారని తెలిపారు. ఈస్టోనియా మిగతా దేశాల మాదిరిగానే విద్యార్థులు వారానికి 20 గంటల పాటు పనిచేస్తూ చదువును కొనసాగించే అవకాశం ఉందని అన్నారు. స్టూడెంట్ విసాపై వెళ్లిన విద్యార్థులు వారి చదువు పూర్తయిన తర్వాత మరో తొమ్మిది నెలలపాటు ఆ దేశంలో ఉండవచ్చని వెల్లడించారు.

పంచాయతీ ఎన్నికలకు కాంగ్రెస్ నేతలు దూరం

- విదేశీ పర్యటనలో పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్
- ముఖం చాటేసిన వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి
- గెలిచిన ఎంఎల్‌ఎలదీ అదే బాట
- కిందిస్థాయి నాయకుల్లో తీవ్ర నైరాశ్యం



మన తెలంగాణ/హైదరాబాద్ : పంచాయతీ ఎన్నికలకు కాంగ్రెస్ నేతలు దూరంగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ముఖ్య నాయకుల్లో చాలామంది ఓడిపోవడంతో స్థానిక ఎన్నికలపై అంతగా దృష్టి సారించలేదు. మొదటి విడతగా ఈ నెల 21వ తేదీన 4,479 పంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నప్పటికీ ఇప్పటివరకు కాంగ్రెస్ నేతలు పల్లెల్లోకి తొంగిచూడలేదు. క్షేత్రస్థాయిలోని పార్టీ వర్గాల్లో ఇది విస్మయం కలిగించింది. స్థానిక నాయకత్వాన్ని బలోపేతం చేసుకునేందుకు పంచాయతీ ఎన్నికలను ఒక ఆయుధంగా తీసుకుని ముందుకు పోవాల్సిన తరుణంలోనూ కాంగ్రెస్ నేతలు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఏఐసిసి ఆదేశాలకు మేరకు గాంధీభవన్‌లో మూడు రోజుల పాటు అసెంబ్లీ ఎన్నికల ఓటమిపై సమీక్షా సమావేశాలను నిర్వహించారే తప్ప పంచాయతీ ఎన్నికలపై నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికను తయారు చేయలేకపోయారు. ఫలితంగా మొదటి విడతగా జరగుతున్న పంచాయతీల్లో ఎంతమందిని కాంగ్రెస్ పార్టీ బలపరిచిందో నాయకుల దగ్గరే సమాచారం లేదు. పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యక్తిగత పర్యటనలో భాగంగా విదేశాల్లో ఉండగా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి చాలా రోజులుగా గాంధీభవన్ మెట్లు కూడా ఎక్క లేదు. గెలిచిన అభ్యర్థులు కూడా పంచాయతీ ఎన్నికలపై పెద్దగా ఆసక్తి చూపడంలేదు. సంక్రాంతి పండుగ తర్వాత కొద్దిమంది కాంగ్రెస్ శాసనసభ్యులు టిఆర్‌ఎస్ గూటికి వెళ్ళనున్నారన్న ప్రచారం జరుగుతోంది. పార్టీ నాయకులు పంచాయతీ ఎన్నికలపై ఆసక్తి చూపని కారణంగా క్షేత్ర స్థాయిలోని పార్టీ నేతలు కూడా ఎన్నికల బరిలో నిలిచేందుకు వెనకంజ వేస్తున్నారు. ఈ పరిణామాలతో కాంగ్రెస్ నేతలంతా దాదాపుగా పంచాయతీ ఎన్నికలకు దూరంగా ఉన్నట్లుగానే కనిపిస్తున్నారు. పార్టీ రాష్ట్ర నేతలు వ్యవహరిస్తున్న తీరుపై కిందిస్థాయి నాయకులు అసంతృప్తి, ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికలపై పిసిసి పూర్తి స్థాయిలో దృష్టి సారించి ఉంటే బాగుండేదని హనుమంతరావులాంటి సీనియర్ నాయకులు ఇటీవల వ్యాఖ్యానించడం విశేషం. మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ల పర్వం పూర్తయిన నేపథ్యంలో రెండవ, మూడవ విడతల్లో జరిగే ఎన్నికలపై దృష్టి సారిస్తే మంచిదన్న అభిప్రాయం క్షేత్రస్థాయి నాయకుల్లో వ్యక్తమవుతోంది.

भाकृ अनुप-भारतीय तिलहन अनुसंधान संस्थान
ICAR-Indian Institute of Oilseeds Research
Rajendranagar, Hyderabad-500 030, Telangana State, India
Tel.: 040-24598208, Website: http://www.icar-iior.org.in
ISO 9001:2008 Certified Institute
F.No.6(12)/2018-19/St **TENDER NOTICE** Dated: 11.01.2019
Bids are invited from the interested bidders under two bid system for **Supply of Scientific Equipments [Viscometer (01 No) and electrophoresis Unit (03 No's)]**, at ICAR-IIOR. For more details visit: http://www.icar-iior.org.in or https://eprocure.gov.in/eprocure/app.
DIRECTOR

హీరాగోల్డ్ బాధితులకు బెదిరింపులు

- సాక్ష్యం చెబితే కాల్చి చంపుతామని హెచ్చరికలు
- నిందితుడు ఉత్తరప్రదేశ్ వాసిగా గుర్తింపు
- రంగంలోకి దిగిన పోలీసు బృందాలు





మన తెలంగాణ/హైదరాబాద్ : హీరాగోల్డ్‌లో డిపాజిట్లు చేసి మోసపోయిన బాధితులకు వీడియోల రూపంలో కిరాయి హంతకులు బెదిరింపులకు గురిచేస్తున్నారు. ఈక్రమంలో అహ్మద్‌ఖాన్ అనే బాధితుడు తనకు రక్షణ కల్పించాలంటూ గురువారం హుమాయూన్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదును పరిశీలించిన పోలీసులు నిందితున్ని పట్టుకునేందుకు ఆరు బృందాలను ఉత్తర ప్రదేశ్‌కు తరలించారు. హీరాగోల్డ్ అధినేత నౌహీరా షేక్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం చెబితే హైదరాబాద్ వచ్చి దారుణంగా చంపేస్తానని గన్ చూపుతూ ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సబీర్ బాబుఖాన్ అనే వ్యక్తి బాధితులను వీడియోల ద్వారా బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈక్రమంలో బెదిరింపులకు పాల్పడిన నిందితుడు ఉత్తర ప్రదేశ్ వాసిగా, కిరాయిహంతకునిగా పోలీసులు గుర్తించారు. బాధితులను తీవ్రంగా బెదిరించిన కిరాయి హంతకున్ని పట్టుకునేందుకు నగర సిసిఎస్, హుమాయూన్ నగర్ పోలీసులు రంగంలోకి దిగారు. నౌహీరాపై ఫిర్యాదు చేసినా, ఆ కేసులో సాక్ష్యం చెప్పినా దారుణంగా చంపేస్తామని బెదిరింపులకు పాల్పడటంతో బాధితులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురై పోలీసులను ఆశ్రయించారు. దాదాపు 20 మంది బాధితులకు సోషల్ మీడియాలో రివాల్వర్‌తో వీడియో కాల్స్ చేస్తూ బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు వివరిస్తున్నారు. సదరు బాధితులు పోలీసులను ఆశ్రయించి వీడియో ఫుటేజీలను అందజేశారు. దీంతో బెదిరింపులకు పాల్పడుతున్న వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు హుటాహుటిన ఉత్తరప్రదేశ్‌కు బయలుదేరి వెళ్ళాయి. ఇటీవల కాలంలోనే హీరా గోల్డ్ కేసులో ఉగ్రవాదులు పెట్టుబడులు పెట్టినట్లు సిసిఎస్ పోలీసులు వెల్లడించిన విషయం విదితమే. ఈ సమాచారం మేరకు సిడిఐ అధికారులు, ఎన్‌ఐఎ అధికారులు రంగంలోకి దిగి దర్యాప్తు చేపడుతున్నారు. ఈక్రమంలో నౌహీరా షేక్ సంస్థలో ఉగ్రవాదుల పెట్టుబడులపై దర్యాప్తు చేపట్టేందుకు మూడు రోజుల పాటు కస్టడీ కోరుతూ సిబిసిఐడి అధికారుల కోర్టును అభ్యర్థిస్తూ పిటిషన్ దాఖలు చేశారు. ఈక్రమంలో నౌహీరాను మూడు రోజుల పాటు పోలీసు కస్టడికి అనుమతిస్తూ ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలావుండగా దేశ వ్యాప్తంగా హీరాగోల్డ్ సంస్థ వసూలు చేసిన దాదాపు 950 కోట్ల నిధులలో ఉగ్రవాదులకు సంబంధించిన మొత్తాలు ఉన్నట్లు హైదరాబాద్ నగర సిసిఎస్ పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసింది. ముఖ్యంగా హీరాగోల్డ్ సంస్థలు దేశంలోని 16 రాష్ట్రాలతోపాటు అరబ్ దేశాలలోనూ డిపాజిట్లు సేకరించారు. ఇందులో ఉగ్రవాదులు సైతం హీరాగోల్డ్‌లో పెట్టుబడులు పెట్టి ఇతర దేశాలలో వాటిని రాబట్టుకున్నట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. షేక్ నౌహీరాభేగం పై దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కేరళ, బెంగళూర్‌లతో పాటు మరో 12 ప్రాంతాలలో హీరాగోల్డ్ అధినేతపై కేసులు నమోదయ్యాయి. మొత్తం 16 కంపెనీల పేరుతో భారీ మోసం జరిగిందని గుర్తించిన పోలీసులు 160 బ్యాంకుల్లోని ఖాతాలలో లావాదేవీలను ఇప్పటికే సీజ్ చేశారు. దీంతో ఆ సంస్థలో భారీగా పెట్టుబడులు పెట్టిన ఉగ్రవాదులు, కిరాయి హంతకులు బాధితులను బెదిరింపులకు గురిచేస్తున్నారని పోలీసు అధికారులు అనుమానిస్తున్నారు. నౌహీరా కేసులో ఉగ్రవాదుల పెట్టుబడులపై ఎన్‌ఐఎ సైతం తనదైన శైలిలో దర్యాప్తు చేపడుతోంది.



కొత్తగా నారాయణపేట జిల్లాను ఏర్పాటు చేసినందుకుగాను సిఎం కెసిఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఎంఎల్‌ఎలు రాజేందర్‌రెడ్డి, చిట్టెం రాంమోహన్‌రెడ్డి

నేటి నుంచి ఉస్మానియా ప్రభుత్వ దంతవైద్య కళాశాల వజ్రోత్సవాలు

మన తెలంగాణ/ హైదరాబాద్: ఉస్మానియా ప్రభుత్వ దంతవైద్య కళాశాల వజ్రోత్సవాలు శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరుగనున్నాయి. వైద్య కళాశాల ఏర్పాటై 60 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కళాశాల పూర్వ విద్యార్థి సంఘం పూనుకుంది. ఉస్మానియా ప్రభుత్వ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ చైర్మన్ నారాయణ పిలుపునిచ్చారు. హైదరాబాద్ సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్‌ల్లో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వైద్య విద్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రమేష్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొనే డైమండ్ జూబ్లీ ఉత్సవాలు కళాశాల ఆవరణలో ఎదయం 11 గంటలకు ప్రారంభమవుతాయని, వాటిని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పంతం నెగ్గిన ప్రేమపక్షులు

ఆసుపత్రిలోనే నిఖా చేసిన పెద్దలు

మూడ్రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం



మన తెలంగాణ/వికారాబాద్ జిల్లా ప్రతినిధి : ఇద్దరిదీ ఒకే మతం. వాళ్లిద్దరూ బంధువులే. మనసులు కలిశాయి. ఇద్దరూ గాఢంగా ప్రేమించుకున్నారు. పెళ్లికీ సిద్ధపడ్డారు. కానీ.. పెద్దాళ్లు పెళ్లికి అంగీకరించలేదు. గత్యంతరం లేక తనువు చాలించాలనుకున్నారు. పురుగుల మందు తాగారు. చావుబతుకుల మధ్య ఉన్న వారిరువురినీ ఆసుప్రతికి తరలించారు. మూడు రోజుల తర్వాత వారు కోలుకున్నారు. ఇంకేం పెద్దలే దిగివచ్చారు. వారి నిఖా చేశారు. ఆసుప్రతి ఆవరణలోనే పెళ్లి జరిపించారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ధారూరు మండలం కుక్కింద గ్రామానికి చెందిన మహ్మద్ నవాజ్ కారు మెకానిక్‌గా పని చేస్తున్నాడు. వికారాబాద్ మండలం అత్తెలికి చెందిన రేష్మాబేగంతో ప్రేమాయణం సాగిస్తున్నాడు. వారిరువురూ బంధువులు కావడంతో కొన్ని నెలలుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లికీ సిద్ధపడ్డారు. ఇంటర్ వరకు చదివిన రేష్మాను నవాజ్‌కు ఇచ్చేందుకు పెద్దలు నిరాకరించారు. నవాజ్ కుటుంబీకులు కూడా నిరాకరించినట్లు తెలిసింది. తాము చస్తేగానీ పెద్దలు దిగిరారని భావించిన ఈ జంట మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగారు. ఇది తెలుసుకున్న పెద్దలు వారిని వికారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గురువారం కోలుకున్న వారిరువురికీ పెళ్లి జరిపించాలని పెద్దలు నిశ్చయించారు. పెద్దమనుషులు అదే ఆసుపత్రి వద్ద నిఖా చేశారు. దాంతో కథ సుఖాంతమైంది.

అడవుల్లో కార్చిచ్చు నివారణకు చర్యలు

సాంకేతికను జోడించేందుకు ఎన్‌ఆర్‌ఎస్‌సితో ఒప్పందం



మన తెలంగాణ / హైదరాబాద్ : అగ్ని ప్రమాదాల నివారణకు అటవీశాఖ పకడ్బందీ చర్యలకు శ్రీకారం చుట్టింది. ప్రతీ ఏటా వేసవి కాలానికి ముందు తీసుకుంటున్న చర్యలతో పాటు ఈసారి ఉపగ్రహ పరిజ్ఞానాన్ని కూడా వినియోగించుకోవాలనుకుంటోంది. ఇందుకోసం నేషనల్ రిమోట్ సెన్సింగ్ కేంద్రంలో ఒక అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఆ శాఖ నుంచి ఎప్పటికప్పుడు ఉపగ్రహ ఛాయాచిత్రాలను తీసుకుంటూ అటవీ పరిరక్షణపై దృష్టి సారించనుంది. అడవిలో ఏదేని పరిస్థితుల్లో అగ్నిప్రమాదం జరిగితే ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా వెంటనే సమాచారం అందుకుని అక్షాంశ రేఖాంశాల వివరాల ఆధారంగా అటవీశాఖ సిబ్బందిని వీలైనంత తొందరగా ఆ ప్రాంతానికి తరలించి మంటలు వ్యాప్తి చెందకుండా చూడడానికి వీలవుతుంది. ఒకవేళ అగ్నిప్రమాదమే సంభవిస్తే రోడ్డు దగ్గరి నుంచి అప్పటికప్పుడు మంటలను ఆర్పడానికి సామాగ్రిని తరలించడానికి బదులుగా ప్రమాదానికి ఆస్కారం ఉన్న ప్రాంతాలపై ముందుగానే ఒక అంచనాకు వచ్చి దానికి సమీపంలోనే ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ లాంటి ఉపకరణాలను సిద్ధంగా ఉంచే ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. సిబ్బందిని కూడా వేసవికాలం ముగిసేంత వరకు అప్రమత్తంగా ఉండాల్సిందిగా ఆదేశాలు జారీ చేయడంతో పాటు ప్రజలను వీలైనంత ఎక్కువ సంఖ్యలో అటవీ పరిరక్షణ ప్రక్రియలో భాగస్వాములను చేయాలని నిర్ణయించింది. ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తుండడంతో ఒక్క అగ్ని ప్రమాదం కూడా సంభవించకుండా చూడాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాదిని కూడా అగ్ని ప్రమాదాల నివారణ సంవత్సరంగా పాటించాలని నిర్ణయించింది. ప్రమాద నివారణ చర్యలు, అటవీ ప్రాం తానికి సమీపంలోని ఉండే ప్రజలను చైతన్యవంతం చేయ డం, అడవిపై ఆధారపడి జీవించే వారి చర్యలను గమనించడం, ప్రమాదాల నివారణలో వారిని భాగస్వాములను చేయడం, అడవిలోకి వెళ్తున్నవారిపై నిఘా వేయడం, మం టలను ఆర్పే యంత్ర సామాగ్రి వాడకం తదితర అంశాలపై దూలపల్లి అటవీ ఆకాడమిలో ఇటీవల ఆ శాఖ సిబ్బందికి 2 రోజుల పాటు శిక్షణ పూర్తయింది. ప్రమాదాల నివారణకు ముందుస్తు జాగ్రత్తలే మందు అని వివరించారు.



బహ్రెయిన్‌లో నిజామాబాద్ యువకుడి ఆత్మహత్య



గణేష్ (ఫైల్)

మనతెలంగాణ/ఇందల్వాయి: కుటుంబానికి వెన్నుదనున్నగా ఉంటాడన్న ఆశతో లక్షలాది రూపాయలు అప్పు చేసి కొడుకును దేశం కాని దేశానికి పంపిన ఆ తండ్రికి చివరికి శోకం మిగిలింది. వివరాల్లోకి వెళ్తే నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం, నల్లవెల్లి పరిధిలోని కెకె తాండకు చెందిన బాదవత్ గణేష్ (26) ఉపాధి కోసం బహ్రెయిన్ దేశానికి వెళ్లాడు. కాగా గురువారం గణేష్ తాను నివాసం ఉండే గదిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య, ఏడాదిన్నర వయసుగల కుమార్తె ఉన్నారు. భార్య మంజుల నిండు గర్బిణీ. ఎంపి కవిత స్పందించి తన కుమారుడి మృతదేహం స్వస్థలానికి చేరాలా చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి దేవిసింగ్ వేడుకుంటున్నారు.

త్వరలో సెట్ల కన్వీనర్ల నియామకం

ఐసెట్, లాసెట్, పిజిఇసెట్, ఎడ్‌సెట్‌లకు కొత్త కన్వీనర్లు

మనతెలంగాణ/హైదరాబాద్ : 2019–20 విద్యాసంవత్సరానికి నిర్వహించనున్న వివిధ ఉమ్మడి ప్రవేశ పరీక్ష(సెట్)ల కన్వీనర్లను త్వరలో ప్రకటించనున్నారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌తో పాటు ప్రవేశ పరీక్షలు నిర్వహించే యూనివర్సిటీలను వెల్లడించారు. సెట్ల కన్వీనర్ పోస్టులకు ఆయా వర్సిటీలు ముగ్గురు సీనియర్ ప్రొఫెసర్లతో కూడిన జాబితాను ఉన్నత విద్యామండలికి పంపించాలి. ఆ ముగ్గురు మెరుగైన ప్రొఫెసర్‌ను ఉన్నత విద్యామండలి సంబంధిత ప్రవేశ పరీక్ష కన్వీనర్‌ను ఎంపిక చేస్తుంది. యూనివర్సిటీలకు ప్రొఫెసర్ల జాబితా పంపించాల్సిందిగా ఉన్నత విద్యామండలి లేఖలు రాసింది. వర్సిటీలు జాబితా పంపించిన వెంటనే కన్వీనర్లను ఎంపిక చేసి ప్రకటించనున్నారు.

మౌలిక సదుపాయాలను పూర్తి చేయాలి: రైల్వే ఛైర్మన్

మన తెలంగాణ / హైదరాబాద్ : రైల్వేలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన ప్రాజెక్టులను నిర్దేశిత లక్ష్యంలోగా పూర్తి చేయాలని రైల్వే బోర్డు ఛైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధానంగా నూతన రైలు మార్గం నిర్మాణాలు, గేజ్ మార్పిడిలు, డబ్లింగ్ పనులకు సంబంధించిన పురోగతిపై ప్రధానమంత్రి కార్యాలయంతో పాటు రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ నిత్యం పర్యవేక్షణ జరుగుతున్నారని తెలిపారు. దీనికి సంబంధించి ఛైర్మన్ అన్ని జోన్ల జనరల్ మేనేజర్లు, ఆర్‌విఎస్ఎల్, కోర్ సంస్థల అధికారులతో ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నూతన రైలు మార్గాలు, గేజ్ మార్పిడి, డబ్లింగ్ ట్రిప్లింగ్, విద్యుదీకరణ, బైపాస్ లైన్లతో పాటు యార్డుల ఆధునీకరణ పనులను ఈ ఏడాదిలో పూర్తి చేయాలన్నారు.

కెనరా బ్యాంక్
ఆర్ & ఎల్ సెక్షన్, 2వ అంతస్తు, సర్కిల్ ఆఫీస్ బిల్డింగ్, హైదరాబాద్

ఇ-వేలము ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూల్ 8(6) క్రింద ఇ-వేలము ద్వారా స్థిరాస్తుల అమ్మకపు నోటీసు
ఈ నోటీసు ద్వారా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క నిబంధనల క్రింద స్వాధీనం చేసుకొనిన ఈ క్రింద వివరించబడిన స్థిరాస్తులను నియమనిబంధనలను అనుసరించి ఇ-వేలము ద్వారా అమ్మబడును. ఇ-వేలము వెబ్‌సైట్: **https://canarabank.auctiontiger.net** ద్వారా సర్వీస్ ప్రొవైడర్ మెస్సర్స్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్‌చే ఇ-వేలము ఏర్పాటు చేయబడినది.

ఇ-వేలము తేది మరియు సమయము: 15.02.2019న ఉ. 11.30 గం॥లకు (అమ్మకం పూర్తగు వరకు ప్రతి 5 నిమిషములకు ఒకసారి అపరిమితపొడిగింపుతో). ధరావత్తు సొమ్ము జమచేయుటకు ఆఖరి తేది: 14.02.2019న సా. 5.00 గం॥లకు. టెండరు పత్రముల స్వీకరణకు ఆఖరు తేది/సమయం: 14.02.2019న సా. 5.00 గం.లకు, ఆస్తి తనిఖీ తేదీలు: 11.02.2019 & 12.02.2019న ఉ. 11.00 గం॥ల నుండి మ. 3.00 గం॥ల వరకు.

క్ర. సం.	ఋణగ్రహీత/హామీదారు పేరు	మొత్తం ఋణములు	ఆస్తుల వివరములు	రిజర్వు ధర లక్షలలో	ధరావత్తు (ఇఎండి) రూ.
1	**మల్కాజ్‌గిరి బ్రాంచ్, సికింద్రాబాద్** శ్రీ కాట వెంకటేశ్వర్లు, ఫ్లాట్ నం. 203, ఇ.నం. 6-139/a, ప్లాట్ నం. 22, ఓల్డ్ మల్కాజ్‌గిరి యొక్క గ్రామకంఠంలోని సాయిలీలరెసిడెన్సీ, జిహెచ్‌యంసి క్రింద, మల్కాజ్‌గిరి సర్కిల్ & మండలం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా-500047 (ఋణగ్రహీత) శ్రీ మంకలి శ్రీనివాస్, ఇ.నెం.3-89, యుపి నగర్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్-500047.(హామీదారు)	రూ. 4,47,191.00 (రూపాయలు నాలుగు లక్షల నలభై ఏడు వేల నూట తొంభై ఒకటి మాత్రమే) + తేది: 25.12.2018 నుండి లెక్కించని వడ్డీ మరియు బ్యాంకు ఛార్జీలు అదనము	మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, మల్కాజ్‌గిరి సర్కిల్ & మండలం, జిహెచ్‌యంసి క్రింద, ఓల్డ్ మల్కాజ్‌గిరి యొక్క గ్రామకంఠంలోని ప్లాట్ నెం.22లో ఇ.నెం.6-139(ఓల్డ్ నెం.4-67/38)లో 254 చ॥గులకు గాను 20 చ॥గుల అవిభాజ్య వాటాగల భూమిలో 460 చ॥అ॥ల ప్లింత్ ఏరియాలో కామన్ మరియు జనరల్ పార్కింగ్ ఏరియాలు కలుపుకొని, హైదరాబాద్-500047, ఓల్డ్ మల్కాజ్‌గిరి, సాయిలీల రెసిడెన్సీలోని రెండవ అంతస్తులో రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం.203 యావదాస్తి కాట వెంకటేశ్వర్లు పేరున కలిగియున్నది. సరిహద్దులు: ఉత్తరం: కారిడార్, దక్షిణం: ఖాళీ ప్రదేశం, తూర్పు: ఖాళీ ప్రదేశం, పడమర: ఫ్లాట్ నెం.202	రూ. 6,90,000/-	రూ. 69,000/- బిడ్డు గుణింపు రూ. 10,000/-

క్ర.సం. 1 కొరకు రిజర్వు ధరలోని 10% ధరావత్తు సొమ్ముగా డిపాజిట్ చేయుటకు అధీకృత అధికారి, కెనరా బ్యాంక్, మల్కాజ్‌గిరి బ్రాంచ్, హైదరాబాద్ వారి పేరున డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా లేదా RTGS/NEFT/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా కెనరా బ్యాంక్, మల్కాజ్‌గిరి బ్రాంచ్, హైదరాబాద్. ఖాతా నం. 1089295000001, IFSC కోడ్: CNRB0001089కు తేది: 13 ఫిబ్రవరి 2019న సా. 5.00 గంటలలోగా జరిపి చేయవలెను. (2) ధరావత్తు సొమ్ము చెల్లించిన తర్వాత బిడ్డర్లు, క్రింద తెలిపిన పత్రములు/వివరముల యొక్క కాపీని తేది: 13 ఫిబ్రవరి 2019న సా. 5.00 గంటలలోగా కెనరా బ్యాంక్, మల్కాజ్‌గిరి బ్రాంచ్, హైదరాబాద్ వారికి స్వయంగాగాని లేదా ఇ-మెయిల్ ద్వారా గాని దాఖలు చేయవలెను. (3) తదుపరి వివరముల కొరకు శ్రీమతి రేఖ రాజేంద్రన్, సీనియర్ మేనేజర్, కెనరా బ్యాంక్, మల్కాజ్‌గిరి బ్రాంచ్, హైదరాబాద్ (ఫోన్ నం. 040-27053121/మొబైల్: 7382932213), ఇ-మెయిల్ ఐడి: cb1089@canarabank.com లేదా సర్వీస్ ప్రొవైడర్ మెస్సర్స్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఎబిసి ప్రొక్యూర్), బి-704/705, వాల్‌స్ట్రీట్-2, ఓరియంట్ క్లబ్ ఎదురుగా, గుజరాత్ కాలేజ్ దగ్గర, ఎల్లిస్ బ్రిడ్జ్, అహ్మదాబాద్-380006, గుజరాత్, ఇ-మెయిల్: telangana@auctiontiger.net, ap@auctiontiger.net and support@auctiontiger.net. సంప్రదించవలసిన నం. 079-40230844/813/814/816/817/818/820/821/822/823/ మొబైల్: 8341410158.

అమ్మకము యొక్క వివరణాత్మక నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వారి వెబ్‌సైట్ (www.canarabank.com)లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" అనుసంధానం చేస్తూ రెఫర్ చేయదమైనది.

ప్రదేశం: హైదరాబాద్, తేది: 07.01.2019, సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్



హితాన్ని కాంక్షిస్తూ
ఆదేశించేది శాసనం

చినజీయర్ స్వామీజీ

మనతెలంగాణ, సిటీబ్యూరో : భూమి మీద ఉన్న సకల చరాచర జీవరాశికి కారణం 'వేదం' అని రుషులు తెలిపారని, వాటిలో నుంచే వీటిని తయారు చేశారని రుషులు, ఆల్వార్‌ల వారు వెల్లడించారని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు చిన జీయర్ స్వామీజి చెప్పారు. నగరంలోని నందగిరిహిల్స్‌లో మైహోం గ్రూపుల అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు నివాస ప్రాంగణంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం 26వ రోజు తన ప్రవచనాలను ఆయన వినిపించారు. ఏది మన హితాన్ని కాంక్షించి మనకు ఆదేశిస్తారో దానిని 'శాసనము' అంటారని, మనకు అందించే శాసనములను అందించే వాఙ్మయంను 'శాస్త్రం' అని అంటారని శాస్త్రానికి ముందు ఉప పదాన్ని చేర్చి మనం పిలుస్తామని ఆయన వెల్లడించారు. శాస్త్రం అంటే శాసించునది, హితమును శాసించునది, ఏది ఆదేశించేటటువంటి హక్కు కలిగి ఉంటుందో దానిని సవ్యంగా చేయకపోతే అందుకు శిక్ష విధించే హక్కు కూడా శాస్త్రం కలిగి ఉంటుందని ఆయన వివరించారు. రాజనీతి... దండనీతితో కలిసి ఉంటేనే పని చేస్తుందని, దండనీతి లేకపోతే రాజనీతి ఉత్త దండగ అని వీటిని వేదాలు తెలిపాయని ఆయన తెలిపారు. వేదాలు 1131 బ్రాంచెస్ ఉండేవి, ఈవేళ 10 బ్రాంచెస్‌లు మాత్రమే ఉన్నాయని, వేద వాఙ్మయం అంతా మనకు లభించకపోయినా, అందులో తత్వ సారాన్ని గ్రహించిన మహనీయులు వేద అర్థాన్ని రెండు రకాలుగా రచించి ఇచ్చారని, ఒకటి.. వేద అర్థాన్ని నిర్ధారించే కొన్ని విషయాలను అందించారని అవి 'అంగములు' అని అంటారని, ఇవి ఆరు రకములని శిక్ష, వ్యాకరణం, చందస్సు, నిరుక్తం, జ్యోతిష్యం, కల్పం. వేదంలు చెప్పిన విషయాలు ఇలానే ఉంటాయని వివరిస్తాయని, వేదముల వ్యవస్థకు రక్షణ కల్పిస్తాయని, వేదంలోని కనిపించకుండా ఉన్నటువంటి వాటిని తెలియజేయడానికి మరికొన్ని గ్రంథాలు వచ్చాయని వీటిని 'ఉప బృహ్మణములు' అని అంటారని, ఇవి ఉన్నవాటిని పెంచి చూపిస్తాయని ఆయన విశదీకరించారు. వేదాల్లో ఉన్నటువంటి సాధారణంగా మనకు తెలియని అంశాలను పెంచి చూపించడానికి వచ్చిన గ్రంథాలు 'ధర్మశాస్త్రం' అని అంటారని, ఈ ధర్మశాస్త్రాలను రుషులు రాశారని, ధర్మశాస్త్రాలు రుషుల పేర్లతో ఉన్నాయని, యాగ్నవల్క్యస్మృతి, పరాశరాస్మృతి, వ్యాస స్మృతి, దక్షస్మృతి అనే పేర్లతో ధర్మశాస్త్రాలు మనకు అందుబాటులో ఉన్నాయని జీయర్ స్వామీజి వెల్లడించారు. వేదాల్లోని శాసనాలను స్పష్టంగా మనం తెలుసుకునేందుకు ఉద్ధరించి చూపే గ్రంథాలను ధర్మశాస్త్రం అంటారని, వీటిని ఆయా కాలనీల్లో అనుసరించినవారున్నారని, మానవజాతి చరిత్రను,



మానవునికి ముందున్న విషయాలను కూడా అందించిన వారిని 'మహర్షులు' అంటారని ఆయన తెలిపారు. మహర్షులు చరిత్రను చరిత్రగానే అందించారని వారందించిన గ్రంథాలే 'ఇతిహాసం'లు అని, ఇతి హాసమంటే ఇలా గతంలో జరిగెను అని అర్థమని జీయర్ స్వామీజి తెలిపారు. చరిత్రకు సాక్ష్యాలను చూపించలేమని, పక్షపాతంతో ఆయా కాలం లో రచించుకున్న గ్రంథాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని, కానీ, గతంలో ఇలాంటి సంస్కృతి లేదని, వ్యాసుడు తన జన్మ మత్స్య కన్యకే పుట్టానని చెప్పుకున్నాడని, నేను బ్రాహ్మణుడని చెప్పుకునే ప్రయత్నం చేయలేదని, ఏది జరిగిందో అదే యదార్థంగా అందించారని ఆయన తెలిపారు. మనకు ఇతిహాసాలు రెండు గ్రంథాలని, ఒకటి దగ్గరగా ఉండేది, రెండవది దూరంగా ఉండేదని, దగ్గరగా ఉండేది 'భారతం', దూరంగా ఉండేది 'రామాయణం' అని ఇవి ఇతిహాసాలని జీయర్‌స్వామీజి తెలిపారు.

ఆర్గానిక్ ఫుడ్స్‌తో ఆరోగ్యం

సేంద్రీయ వ్యవసాయానికి పెరుగుతున్న డిమాండ్ : ఎంపి సంతోష్



మనతెలంగాణ/హైదరాబాద్: సేంద్రియ ఎరువులతో పండించిన పంటలు ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని టిఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌రావు ఉద్ఘాటించారు. గురువారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీ ఏ బ్లాక్‌లో నూతంగా ఏర్పాటుచేసిన మేరాకిసాన్ ఆర్గానిక్ సెంటర్‌ను రాజ్యసభ సభ్యుడు సంతోష్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపులోని ఆర్గానిక్ ఫుడ్స్‌ను పరిశీలించి ప్రస్తుత ఆధునిక సమాజంలో ఆర్గానిక్ ఆహార పదార్థాలకు అధిక ప్రాధాన్యత పెరిగిందని చెప్పారు. ఈ ఆహారాల్లో ఆరోగ్య పరిరక్షణ ఉండటంతో డిమాండ్ పెరిగిందన్నారు. సేంద్రీయ ఎరువుల ఆహార ఉత్పత్తుల్లో రసాయనాలు ఉండకపోవడంతో నేటి కాలంలో అధికంగా వినియోగిస్తున్నారని చెప్పారు. రసాయన ఎరువులు లేని పూర్వకాలంలో సేంద్రీయ ఎరువుల తో పంటలు ఏవిధంగా పండించేవారో ఆదే పద్ధతుల్లో తిరిగి పండించి మార్కెట్‌లోకి తీసుకువస్తున్న మేరా కిసాన్ ఆర్గానిక్ సంస్థను ఆయన ప్రసంసించారు. ఈ సందర్భంగా కిసాన్ ఆర్గానిక్ ఫుడ్స్ నిర్వాహకులు సంతోష్ రావుతో మాట్లాడుతూ ఆర్గానిక్ ఆకుకూరలు, కూరగాయలు, బియ్యం, జొన్నలు, తైదలతో పాటు అనేక ఆహార ఉత్పత్తులు అందు బాటులో ఉన్నాయని తెలిపారు. కొండాపూర్‌లో రెండవ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసినట్లు వారు చెప్పారు. ప్రారంభోత్సవంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం టిఆర్‌ఎస్ ఇన్‌ఛార్జి పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, శాసనసభ్యుడు అరికపూడి గాంధీ పాల్గొన్నారు. అలాగే మేరా ఆర్గానిక్స్ నిర్వాహకులు నీలగిరి,శీతల్ కుమార్, విజయ్, జగదీశ్, ఫిరోజ్, అశోక్ వర్మ, టిఆర్‌ఎస్ యూత్ నాయకులు అఖిల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

కెటిఆర్‌కు కుల సంఘాల శుభాకాంక్షలు

మనతెలంగాణ/హైదరాబాద్: టిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఎంబిసి సంఘం జాతీయ నాయకుడు కె.సి. కాలప్ప నేతృత్వంలోని ప్రతినిధి బృందం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావును గౌరవ పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వినతి పత్రం సమర్పించి ఎంబిసిల సమస్యలను కెటిఆర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కెటిఆర్‌ను కలిసిన నాయకుల్లో ఎంబిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున్, ఉపాధ్యక్షులు చంద్రమోహన్, ప్రేమ్‌లాల్, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకుడు శీనివాస్, గాండ్ల సంఘం ప్రధానకార్యదర్శి లక్ష్మ ణ్, ఎంఎల్‌ఎ శ్రనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు. అలాగే నకాషీ చిత్రకళ వర్ణచిత్రాన్ని కుల సంఘాల నాయకులు కెటిఆర్‌కు బహుకరించారు.

ప్రధాని, హోం మంత్రితో గవర్నర్ భేటీ

రెండు రాష్ట్రాల తాజా పరిణామాలపై వివరణ



మనతెలంగాణ/న్యూఢిల్లీ,హైదరాబాద్: ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోడీతో గురువారం ఉదయం భేటీ అయిన గవర్నర్ నరసింహన్, మధ్యాహ్నం కేంద్ర హోం మంత్రితో సమావేశమయ్యారు. రెండు రాష్ట్రాల్లోని తాజా పరిస్థితులపై ఇద్దరికీ వివరించారు. ప్రతీ నెలా ఢిల్లీకి వచ్చి రెండు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై నివేదిక ఇవ్వడం ఆనవాయితీ అని గతంలోనే గవర్నర్ నరసింహన్ వ్యాఖ్యానించగా తాజా పర్యటన వివరాలను మాత్రం మీడియాకు వివరించలేదు. త్వరలో జరగనున్న తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు, కొత్త హైకోర్టు ఏర్పాటైన తర్వాత పనిచేస్తున్న తీరు తదితరాలతో పాటు పరిపాలనకు సంబంధించిన అంశాలను ప్రధానికి, హోం మంత్రికి వివరించినట్లు తెలిసింది. హోం మంత్రితో అరగంటకు పైగా సమావేశమైన గవర్నర్ రాష్ట్రంలోని శాంతిభద్రతల అంశాలతో పాటు పోలీసు శాఖకు సంబంధించిన అంశాలపై కూడా చర్చించినట్లు తెలిసింది. బుధవారం సాయంత్రం ఢిల్లీ వెళ్ళిన గవర్నర్ గురువారం సాయంత్రానికి తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు.

జూ.కళాశాలలకు సంక్రాంతి సెలవులు

మనతెలంగాణ/హైదరాబాద్ : జూనియర్ కళాశాలలకు ఈ నెల 14,15 తేదీలలో రెండు రోజులపాటు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. ఈ నెల 16న తిరిగి కళాశాలలు పునఃప్రారంభం కానున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ.అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్యాలు సెలవు రోజుల్లో ఎలాంటి తరగతులు నిర్వహించవద్దని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన కళాశాలలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీనియారిటీ తేలాకే విభజన

ఎపీ వైఖరిపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ కేంద్ర డిఒపిటికి లేఖ



మన తెలంగాణ/ హైదరాబాద్ : పోలీసు ఇన్‌స్పెక్టర్లు, డిఎస్‌పిలు, అదనపు ఎస్‌పిలు, ఎస్‌పి (నాన్ కేడర్)లను రాష్ట్రాల మధ్య విభజించే ప్రక్రియకు ఆంధ్రప్రదేశ్ విఘాతం కలిగిస్తోందని, విభజన చట్టంలోని నిబంధనలను తుంగలో తొక్కి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందని, కేంద్ర హోంశాఖ పరిధిలోని డివోపిటి (సిబ్బంది శిక్షణ వ్యవహారాల విభాగం)కు తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. రెండు రాష్ట్రాల మధ్య పైన పేర్కొన్న ఉద్యోగుల విభజనకు సంబంధించి కేంద్ర హోం మంత్రిత్వశాఖ కొన్ని సూచనలు చేసిందని, ఆ ప్రకారం రెండు రాష్ట్రాల ప్రతినిధులతో ఉప కమిటీ ఏర్పడిందని, ఈ కమిటీ తీసుకున్న నిర్ణయానికి భిన్నంగా ఏపీ ప్రభుత్వం ఇటీవల జీవోలు జారీ చేసి విభజన ప్రక్రియకు ఆటంకాలు కలిగిస్తోందని తెలంగాణ ఎస్‌ఆర్ (స్టేట్ రీ ఆర్గనైజేషన్) విభాగం బుధవారం రాసిన లేఖలో పేర్కొంది. హోంశాఖలో రెండు రాష్ట్రాల్లోని కేడర్ స్ట్రెంత్‌ను నిర్ణయించడం, పనిచేస్తున్న అధికారుల సీనియారిటీ జాబితాను తయారు చేయడం, ఉద్యోగుల నుంచి ఆప్షన్లను తీసుకోవడం తదితరాలన్నీ అయిన తర్వాత మాత్రమే విభజన జరగాలని 2017 అక్టోబరు 4వ తేదీన మంగళగిరిలోని ఏపి డిజిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో నిర్ణయం జరిగిందని గుర్తు చేసింది. రెండు రాష్ట్రాలకు ఒక ఉమ్మడి జాబితా రూపొందడం, ఒకే స్థాయిలో ఉన్న ఉద్యోగుల పదోన్నతి, నిర్దిష్ట కటాఫ్ డేట్ తదితరాలన్నింటిపై ఆ సమావేశంలో చర్చ జరిగిందని, ఆ రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనికి సమ్మతించిందని, కానీ ఇటీవల ఆ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు భిన్నంగా ఉన్నాయని ఆరోపించింది. ఏ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా అది మరో రాష్ట్రానికి సంబంధించిన సీనియారిటీ అధికారుల జాబితాకు విఘాతం కలిగించేందిగా ఉండరాదని పేర్కొనింది. ఏపీ ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం తెలంగాణ ప్రయోజనాలకు ఆటంకంగా ఉంటుందని, ఎవరైనా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే అది చెల్లుబాటు కాదని, జోక్యం చేసుకుని తెలంగాణకు న్యాయం జరిగే విధంగా, సబ్ కమిటీలో తీసుకున్న ఉమ్మడి నిర్ణయానికి కట్టుబడి ఉండే విధంగా వ్యవహరించాల్సిందిగా సూచించాలని డివోపిటి సంయుక్త కార్యదర్శికి విజ్ఞప్తి చేసింది.

ఫిషరీస్ హబ్‌గా హైదరాబాద్

చేపల పరిశ్రమకు ఏడున్నర వేల కోట్లు



మన తెలంగాణ / హైదరాబాద్ : మత్స్యకారుల అభివృద్ధికి ఉచిత చేప పిల్లల పంపిణీ, సమీకృత మత్స్య అభివృద్ధి పథకాలను చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం హైద రాబాద్ నగరాన్ని చేపల హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తోందని రాష్ట్ర పశు సంవర్థక ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా వ్యాఖ్యానించారు. ఇప్పటికే వినూత్న తరహాలో మంచి నీటి రొయ్యల పెంపకాన్ని కూడా చేపట్టామని, ఊహించినదానికంటే ఎక్కువగా ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాణి కుముదిని నగరంలో గురువారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందీప్‌కుమార్ సుల్తానియా పై విధంగా వ్యాఖ్యానించారు. మత్స్యకారుల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రతీ ఏటా చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని, చాలా మంది మత్స్యకారులకు లబ్ధి చేకూరుతోందని వివరించారు. జాతీయ ఫిషరీస్ బోర్డు చీఫ్ ఇడి రాణి కుముదిని మాట్లాడుతూ, చేపల పరిశ్రమలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ. 7500 కోట్లను కేటాయించిందని, ఈ నిధిని సద్వినియోగం చేసుకోవడంతో పాటు మత్స్యకారుల అభివృద్ధి కోసం నిర్దిష్ట మార్గదర్శకాలను జారీ చేసిందని గుర్తు చేశారు. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు నగరంలో నిర్వహించనున్న 'ఆక్వా ఎక్స్‌పో 2019' కార్యక్రమం గురించి వివరించారు. మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, తెలంగాణ మత్స్య శాఖ సహకారంతో నెక్లెస్ రోడ్డులో ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు 'ఫిష్ ఫెస్ట్' కార్క్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా ఆక్వా కల్చర్ కార్యక్రమాలు సాగుతున్నాయని చాటి చెప్పేందుకే 'సిఫా' (సొసైటీ ఫర్ ఇండియన్ ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్) ఈ కార్యక్రమాన్ని చేపట్టినందుకు రాణి కుముదిని ఆ సంస్థ ప్రతినిధులను అభినందించారు. ఈనెల 31నుంచి జరిగే ఎక్స్‌పోలో తొలి రోజున చేప పిల్లల పెంపకం, రెండో రోజున చేపలకు అవసరమైన ఆహారం, మూడవ రోజు నాణ్యమైన చేప పిల్లల ఉత్పత్తిపై కార్యక్రమాలు ఉంటాయని సిఫా అధ్యక్షుడు రామచంద్రరాజు తెలిపారు.



ఊపిరితిత్తులు జర భద్రం



చలికాలంలో తగ్గుతున్న గాలి నాణ్యత • ఊపిరితిత్తుల్లోకి కాలుష్య ఉద్గారాలు
- **రాత్రి పూట తిరిగేవారు, మార్నింగ్ వాక్ చేసే వారికి సమస్యలు**
- **పరిశ్రమలు ఉన్న చోట నివసించే వారికి తీవ్ర ఇబ్బందులు**

మనతెలంగాణ/హైదరాబాద్ : రోజురోజుకు పెరుగుతున్న వాయు కాలుష్యానికి చలికాలం తోడవ్వదంతో గాలి నాణ్యత మరింత క్షీణిస్తోంది. వర్షాకాలంలో వర్షం నీటితో ఉద్గారాలు నేలకు చేరతాయి. వేసవికాలంలో అయితే ఉద్గారాలు పైకి చేరుతాయి. చలికాలంలో వాతావరణం స్తబ్ధుగా ఉండడం వలన గాలి ఎటూ వెళ్లదు దీనివలన కాలుష్య ఉద్గారాలు ఎక్కడివి అక్కడే ఉంటాయి. దీంతో పీల్చే గాలిలోంచి కాలుష్య ఉద్గారాలు నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళతాయి. పరిశ్రమలు, వాహనాల కాలుష్యంతో పాటు భవన నిర్మాణం జరిపేటప్పుడు వచ్చే కాలుష్యం వలన కూడా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాయుకాలుష్యంలో అత్యంత ప్రమాదకరమైనవి పిఎం 2.5 ఉద్గారాలు. ఇవి క్యూబిక్ మీటర్ గాలిలో 40 మైక్రోగ్రాముల కు మించొద్దు. కానీ హైదరాబాద్‌లో నిర్ధేశిత పరిమితి కంటే చాలా ఎక్కువ. 60 మైక్రోగ్రాములను మించి నమోదవుతున్నాయని పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు. జిల్లాల కేంద్రంలోనూ గతంలో కంటే వాయు కాలుష్యం పెరుగుతుందని వాహనాల్లో వాడే పెట్రోల్, డీజిల్ కల్తీ కావడం వలన కూడా గాలిలో కాలుష్యం ఎక్కువగా విడుదల అవుతుందని పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు. దీంతో పాటు ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలు కాలుష్య ఉద్గారాలను విడుదల చేస్తాయని, వీటి వలన దుమ్ము, దూళి, వాయు కాలుష్యానికి కారణమవుతున్నాయని పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు. వేసవితో పోలిస్తే చలికాలంలో ముఖ్యంగా రాత్రివేళల్లో వాయుకాలుష్యం ఎక్కువగా ఉంటుందని, చలికాలంలో మార్నింగ్ వాక్ చేసే వారు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు పేర్కొంటున్నారు.

కాలుష్యాన్ని పెంచుతున్న ఉద్గారాలు

ప్రమాదకర సూక్ష్మ, అతిసూక్ష్మ ధూళికణాలు, సల్ఫర్ దయాక్సైడ్, అమ్మోనియా తదితర 40 రకాల ఉద్గారాలు కాలుష్యాన్ని పెంచుతున్నాయి. అయితే వీటిలో సూక్ష్మ, ధూళి కణాలు పార్టిక్యులెట్ మ్యాటర్ (పిఎం) 10, అతిసూక్ష్మ ధూళికణాలు పిఎం 2.5 అత్యంత ప్రమాదకరమైనవి. కంటికి కనిపించకుండా నేరుగా ఊపిరితిత్తుల్లోకి చేరి అవి ఆరోగ్యానికి హానికరం చేస్తాయి. ఈ ప్రమాదకరమైన సూక్ష్మ, అతి సూక్ష్మ దూళికణాలు నిర్ధేశిత పరిమితుల కంటే ఎక్కువగా విడుదలవుతుండడంతో చలి ఎక్కువగా ఉండి పరిశ్రమలు ఉన్న చోట నివసించే ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. డిసెంబర్‌తో పోలిస్తే జనవరిలో చలి అధికంగా ఉందని అధికారులు పేర్కొంటున్నారు. చలి తీవ్రత వలన హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో పలు చోట్ల కాలుష్య తీవ్రత మరితం పెరుగుతుందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలా దేశాల్లో గాలి వేగం ఎక్కువగా ఉంటుంది. దీని వలన కాలుష్య ఉద్గారాలు ఒకే చోట ఉండకుండా వేగంగా కదిలిపోతుంటాయి. ఆ దేశాలతో పోలిస్తే ప్రకృతిపరంగా మన దేశంలో ప్రతికూల పరిస్థితులు ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఇక్కడ గాలి వేగం తక్కువగా ఉండడం వలన కాలుష్య ఉద్గారాలు అక్కడే ఉండడం వలన చలికాలంలో ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నాణ్యత 0 నుంచి 50 లోపు ఉంటే అది స్వచ్ఛమైనది

పిసిబి లెక్కల ప్రకారం గాలి నాణ్యత 0 నుంచి 50 లోపు ఉంటే అది స్వచ్ఛమైన గాలిగా పేర్కొంటారు. 51 నుంచి 100 వరకు అయితే దానిని ఫర్వాలేదని, కొంత కాలుష్యం ఉన్నట్టుగా పేర్కొంటారు. 101 నుంచి 150 వరకు చూస్తే ఆరోగ్యం పరంగా సున్నితంగా ఉండేవారికి ఇబ్బందులు వస్తాయని, 151 నుంచి 200 వరకు గాలి నాణ్యత ఉంటే ఈ గాలిని పీల్చే వారికి ఇబ్బందులు వస్తాయని పిసిబీ గణాంకాలు చెబుతున్నాయి. 201 నుంచి 300 వరకు అక్కడ అత్యవసర పరిస్థితిగా పిసిబీ అధికారులు గుర్తిస్తారు. ఇక్కడి గాలిని పీల్చడం మంచిది కాదని ప్రభుత్వానికి నివేదిక ఇస్తారు. 301 నుంచి ఆ పైన అత్యంత ప్రమాదకరమని తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని పిసిబి గణాంకాలు వెల్లడిస్తున్నాయి.



వరంగల్, కొత్తూరు, కరీంనగర్, రామగుండం వంటి చోట్ల వాయుకాలుష్య తీవ్రత ఇలా ఉంది. పిఎం 2.5 అతిసూక్ష్మ ధూళికణాలు

నగరం	2016	2017	2018
హైదరాబాద్	45	52	64
వరంగల్	..	37	43
కరీంనగర్	...	43	49
నిజామాబాద్	32	29	30
ఆదిలాబాద్	33	31	37



పిఎం 10 సూక్ష్మ ధూళికణాలు

పిఎం 10 నిర్ధేశిత పరిమితి క్యూబిక్‌మీటర్ గాలిలో 60 మైక్రోగ్రాములు మించొద్దు. నవంబర్ నాటికే సగటు 114 మైక్రోగ్రాములుగా ఉంది. వరంగల్, కొత్తూరు వంటి చోట్ల వందకు పైగానే నమోదవుతున్నాయని పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు. ప్రాంతాల వారీగా చూస్తే పటాన్‌చెరులో 2010లో 74 ఉండగా, 2015 నాటికి అది 85కు చేరింది.

నగరం	2016	2017	2018
హైదరాబాద్	93	101	114
వరంగల్	67	67	100
కరీంనగర్	52	74	97
నిజామాబాద్	63	61	66
ఆదిలాబాద్	65	65	72

దిశ తిరిగిన శీతగాలి

- తెలంగాణ వైపు ఉత్తరగాడ్పులు
- రెండురోజుల్లో తగ్గిన ఉష్ణోగ్రతలు
- ఏజెన్సీ ప్రాంతాల్లో మరింత తక్కువగా...

మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగింది. ఈశాన్య గాలుల ప్రభావం తగ్గడం ఉత్తరాది శీతలగాలులు తిరిగి తెలంగాణ వైపు దిశను మార్చుకోవడంతో రాష్ట్రంలో చలి తీవ్రత మళ్లీ పెరిగింది. ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతుండడం వలన చలి తీవ్రత ఎక్కువగా ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. రెండుజుల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే నాలుగు డిగ్రీల వరకు తగ్గడం విశేషంగా అధికారులు పేర్కొంటున్నారు. దీంతోపాటు ఏజెన్సీ ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత తక్కువగా నమోదవుతున్నాయని అధికారులు తెలిపారు.

కొన్ని ప్రాంతాల్లో చలిగాలులు

రాగల మూడు రోజులు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆదిలాబాద్, కొముంభీం, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల, మెదక్ మరియు సంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో చలిగాలులు వీచే అవకాశ ముందని అధికారులు తెలిపారు. కోస్తా ఆంధ్రా, రాయలసీమలో రాగల మూడు రోజులు పొడి వాతావరణం నెలకొందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

మోడీ తిప్పిన మలుపు

సంపాదకీయం

ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం చెప్పనలవికాని సాహసానికి పాల్పడింది. సామాజిక న్యాయం లక్ష్యంగా రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్ల ఫ్రేం లోకి ఆర్థిక పేదల కోటాను చేర్చడానికి సిద్ధపడి రాజ్యాంగ మౌలికతనే మార్చే పనికి సమకట్టినట్టయింది. సామాజికంగా తరతరాలుగా అణచివేతకు, దోపిడీకి గురైన ఇతర వెనుకబడిన తరగతుల కోసం రాజ్యాంగంలోని సర్వసమానత్వ సూత్రాలకు సవరణ తెచ్చి సానుకూల వివక్ష మార్గాన్ని కల్పించిన సంగతి తెలిసిందే. ఆ విధంగా రిజర్వేషన్లను సామాజిక న్యాయం కోసమే ఉద్దేశించడం జరిగింది. అగ్రవర్ణాలలోని పేదలకు రిజర్వేషన్ల చట్టం తేవడం ద్వారా దానికి భిన్నమైన మార్గాన్ని మోడీ ప్రభుత్వం తొక్కిందని చెప్పకతప్పదు. ఇది సమాజంలోని ద్వేష వాతావరణాన్ని తొలగించడానికి ఉపయోగపడుతుందని అంగీకరించవలసి ఉంది.

అగ్రవర్ణాలలోని పేదలకు 10 శాతం కోటా కల్పిస్తూ ప్రవేశపెట్టిన బిల్లుకు రాజ్యసభ ఆమోదాన్ని కూడా సాధించడం ద్వారా కేంద్రంలోని ఎన్‌డిఎ పాలకులు రాజకీయంగా అసాధారణమైన పాచికను ప్రయోగించి సఫలీకృతులయ్యారు. వాస్తవానికి రాజ్యసభలో గణనీయమైన బలమున్న కాంగ్రెస్, తదితర ప్రతిపక్షాలు గట్టిగా అడ్డుకొని ఉంటే ఈ బిల్లు శాసన రూపం పొందేవైపు ముందడుగు వేయలేకపోయేది. అగ్రవర్ణ ఓటర్ల ఆగ్రహానికి గురి కాగలమనే భయంతోనే ప్రతిపక్షాలు బిల్లుకు సై అన్నాయని అనుకోవలసి ఉంది. అయినా సాహసించి ఈ బిల్లును తీసుకువచ్చిన భారతీయ జనతా పార్టీ వైపే అగ్రవర్ణ ఓటర్లు మొగ్గుతారుగాని తమ వైపు కాదనే సంగతి ప్రతిపక్షాలకు తెలియనిది కాదు. అయితే బిల్లును వ్యతిరేకిస్తే అగ్రవర్ణాలు ఆగ్రహించగలవనే భయోత్పాతమే వారు అనుకూలంగా ఓటు వేయక తప్పని పరిస్థితి సృష్టించింది. అంతేగాక ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ స్వతహాగా అగ్రవర్ణాల ప్రయోజనాలను పనికట్టుకొని వ్యతిరేకించేది కాకపోవడం, ఆ పార్టీలో ఆధిపత్యం ఆ వర్గాలదే కావడం కూడా ఈ బిల్లు నిరాటంకంగా ఆమోదం పొందడానికి కారణమయింది. ఏమైనప్పటికీ చిరకాలంగా రిజర్వేషన్ల పరంగా పై కులాలలో పేరుకుపోయి ఉన్న అసంతృప్తిని తొలగించడంలో ఈ శాసనం ఎంతగానో ఉపయోగపడుతుంది.

రిజర్వేషన్లకు సుప్రీంకోర్టు విధించిన 50 శాతం హద్దు దీనితో చెరిగిపోనుండడం కూడా ఒక విశిష్టమైన మలుపుగా దేశ చరిత్రలో నిలిచిపోతుంది. ఇప్పటికే తమిళనాడులోగల 69 శాతం కోటా సహా రాజ్యాంగం 9వ షెడ్యూల్ రక్షణ కవచంలోని, భద్రపేటికలో గల పలు అంశాలను బయటకు లాగి న్యాయ సమీక్షకు గురి చేసే అధికారం తనకున్నదని సుప్రీం కోర్టు ప్రకటించుకున్నది. ఈ కొత్త కోటా నేపథ్యంలో అది ఆ ఆలోచనను విరమించుకోవలసి రావచ్చు. ఎలాగూ 50 శాతం ఇనుపగోడ కూలిపోయింది కాబట్టి 60 శాతానికి మించి మరింతగా పెంచి తమకు అదనపు కోటా కల్పించాలనే డిమాండ్ ఒబిసిల నుంచి, వారిలోని ఎంబిసిల నుంచి పుట్టుకొచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. తమిళనాడు తరహా కోటా దేశమంతటా అమల్లోకి తేవాలంటూ ఒత్తిడి పెరగవచ్చు. ఆ రాష్ట్రంలో బిసిలకు 20 శాతం, అత్యంత వెనుకబడిన ఎంబిసి కులాలకు 30 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. దేశమంతటా ఒకే తరహా రిజర్వేషన్లు ఉండాలని, లేకపోతే ఆయా రాష్ట్రాల్లోగల జనాభా దామాషా ప్రకారం కల్పించుకునే స్వాతంత్ర్యం వాటికివ్వాలని తెలంగాణ రాష్ట్ర సమితి కోరుతున్నది.

అగ్రవర్ణ కోటా శాసనాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో వ్యాజ్యాల దాఖలు ఇప్పటికే ప్రారంభమయింది. వాటి పరిశీలనకు అత్యున్నత న్యాయస్థానం మరో రాజ్యాంగ ధర్మాసనాన్ని నియమించవలసి రావచ్చు. కోటా పొందడానికి సాలీనా 8 లక్షల రూపాయల వరకు రాబడి, 5 ఎకరాల లోపు భూమి, ఇల్లు కలిగి ఉండడాన్ని పరిమితిగా కొత్త చట్టం విధిస్తున్నది. ఇది నిజమైన పేదలను ఉద్దేశించి కాదని 95 శాతం పై కులాలవారంతా ఈ అర్హత పరిధిలోకి వస్తారని మధ్య తరగతి ఓటు మీద దృష్టితోనే ఈ బిల్లును తెచ్చారనే విమర్శ ఇప్పటికే వచ్చింది. అలాగే ఏడాదికి రెండున్నర లక్షల రూపాయలకు మించిన రాబడి గల వారి నుంచి ఆదాయపు పన్ను వసూలు చేస్తున్నప్పుడు 8 లక్షల వరకు తెచ్చుకుంటున్న వారిని రిజర్వేషన్లకు అర్హులను చేయడం సమంజసం కాదనే అభిప్రాయం వినవచ్చింది. అంతిమంగా సుప్రీంకోర్టు ఎటువంటి తీర్పు ఇస్తుందనేది కీలకం. ఈ కోటాను కూడా సామాజిక న్యాయ పరిధిలోనిదిగా చూస్తుందా అనే దాని కోసం వేచిచూడాలి.

స్వచ్ఛ భారత్ తెచ్చిన మార్పు!

2011 జనాభా లెక్కల ప్రకారం 32 శాతం గ్రామీణ ప్రజలకు టాయిలెట్ సదుపాయం ఉంది. టాయిలెట్ సదుపాయం ఉన్న చాలా కుటుంబాలు వాటిని వాడడం లేదని కూడా పలు అధ్యయనాలు తేల్చాయి. నరేంద్రమోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్వచ్ఛ భారత్ కార్యక్రమం వల్ల చాలా వరకు పరిస్థితి మారింది. అన్నింటికన్నా ముందుగా చెప్పుకోవలసింది అత్యున్నత అధికార పీఠాలు ఈ సమస్యను సమస్యగా గుర్తించి, పరిష్కారం సాధనపై దృష్టి పెట్టడం చెప్పుకోదగ్గ మార్పు. స్వయంగా ప్రధాన మంత్రి ఈ విషయమై మాట్లాడడం వల్ల శ్రద్ధ పెరిగింది.

చెప్పుకోవలసిన మరో ముఖ్యవిషయమేమంటే, స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా ప్రజల అలవాట్లను మార్చే ప్రయత్నం ప్రభుత్వం చేపట్టింది. గ్రామీణ పారిశుద్ధ్యానికి సంబంధించి ప్రజల అలవాట్లలో మార్పు తీసుకురాదలచిన అతిపెద్ద ఉద్యమంగా దీన్ని చెప్పుకోవచ్చు.




మూడవ ముఖ్యమైన విష యం, బహిరంగ మలవిసర్జనను నివారించాలన్న సంకల్పం బలపడింది. ప్రజలు టాయిలెట్లను ఉపయోగిస్తున్నారా లేదా, బహిరంగ మలవిసర్జన ఎంత శాతం ఉంది వగైరా లెక్కలను పరిశీలించడం ద్వారా ఈ సమస్య పరిష్కారానికి ప్రయత్నాలు జరిగాయి. ఇంతకు ముందు కేవలం ఎన్ని టాయిలెట్లు కట్టారన్న లెక్క మాత్రమే తీసుకునేవారు. ఇప్పుడు సమస్యను చూసే దృష్టికోణం కూడా మారింది. ఇప్పుడు బహిరంగ మలవిసర్జన లేని గ్రామాలెన్ని ఉన్నాయన్న లెక్క తీయడం ప్రారంభించారు. టాయిలెట్లు ఎన్ని కట్టారన్నది ఎంత ముఖ్యమో. ఈ అలవాటును ఎంతవరకు మాన్పించారన్నది కూడా అంతే ముఖ్యం.

నాల్గవ అతిముఖ్యమైన విషయం పారిశుద్ధ్యం పట్ల అవగాహన చైతన్యం పెంచడానికి గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యానికి పెద్దపీట వేసి బడ్జెటును భారీగా కేటాయించడం. అవసరమైన మానవ వనరులను సేకరించి ఈ కార్యక్రమాన్ని ముందుకు నడిపించడం. జిల్లాల్లోను, గ్రామాల్లోను ఐదు లక్షల మంది స్వచ్ఛగ్రాహీ కార్యకర్తలను నియమించారు. ఈ స్వచ్ఛగ్రాహీ కార్యకర్తలకు తగిన శిక్షణ లేదన్నది వేరే విషయం. 2014లో ప్రధాన మంత్రి చేసిన ప్రకటన ప్రకారం 2019 నాటికి బహిరంగ మలవిసర్జన లేకుండా చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

కాని ఈ దిశగా సాధిస్తున్న అభివృద్ధి చాలా నెమ్మదిగా ఉంది. టాయిలెట్ల నిర్మాణం చాలా వేగంగా జరుగుతుందన్నది నిజమే. అక్టోబర్ 2014 నుంచి అక్టోబర్ 2017 మధ్య కాలంలో 45 లక్షల టాయిలెట్లను డిసెంబర్ 2018 నాటికి 91 లక్షల టాయిలెట్లను నిర్మించారు. మంత్రిత్వశాఖ వెబ్ సైట్ పరిశీలిస్తే ఈ సంఖ్య పెరుగుతూ కనిపిస్తుంది.

దేశంలో 6 లక్షల 50 వేల గ్రామాలున్నాయి. అక్టోబర్ 2017 నాటికి 2 లక్షల 43 వేల గ్రామాలు బహిరంగ మలవిసర్జన లేనివిగా ప్రకటించబడ్డాయి. అలాగే 677 జిల్లాల్లో 201 జిల్లాలు ఈ సమస్య లేని జిల్లాలుగా గుర్తింపు పొందాయి. ఐదు రాష్ట్రాలు ఈ సమస్యను తుడిచేసిన రాష్ట్రాలుగా గుర్తింపు పొందాయి. ఆ తర్వాత డిసెంబర్ 2018 నాటికి 5,39,000 గ్రామాలు, 580 జిల్లాలు, 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో బహిరంగ మలవిసర్జన అనేది లేనే లేదన్నారు. టాయిలెట్ల నిర్మాణం అనూహ్యమైన వేగంతో కొనసాగింది.



కాని ఈ లెక్కలన్నీ నిజమేనా అనే సందేహం తలెత్తింది. ధృవీకరించుకోడానికి ప్రభుత్వం ఇచ్చే లెక్కలు తప్ప మరో మార్గం ఏదీ లేదు. అయితే ఫలితాలు చూపించాలనే ఒత్తిడి ఉన్నప్పుడు, మంత్రిత్వ శాఖ ఇచ్చే లెక్కలు పూర్తిగా రైటని చెప్పడం కష్టం. ఈ లెక్కలు సరయినవేనని చెప్పే విశ్వసించదగ్గ సర్వే ఏదీ మన ముందు లేదు. జనాభా లెక్కలు 2011 లో చూపించిన లెక్కలను నమ్మవచ్చు. ఎందుకంటే భారీ స్థాయిలో జరిగిన జనాభా లెక్కల సేకరణ అది. ఈ లెక్కల ప్రకారం 32 శాతం గ్రామీణ కుటుంబాలకు మాత్రమే టాయిలెట్ సదుపాయం ఉంది. కాని యుపిఎ ప్రభుత్వం అప్పట్లో 72 శాతం కుటుంబాలకు టాయిలెట్ సదుపాయం ఉందని చెప్పేది. కాబట్టి ప్రభుత్వం ఇచ్చే లెక్కలపై పూర్తిగా ఆధారపడలేం. 2012లో ప్రభుత్వం సర్వే నిర్వహించింది. ఆ సర్వే తర్వాత కేవలం 36 శాతం కుటుంబాలకు మాత్రమే టాయిలెట్ సదుపాయం ఉందని తేలింది.


ఇప్పుడు నాలుగు సంవత్సరాల కాలంలో 96 శాతం గ్రామీణ పారిశుద్ధ్యాన్ని సాధించామని మోడీ ప్రభుత్వం చెబుతోంది. 2012 సర్వే ఎన్ని కుటుంబాలకు టాయిలెట్ సదుపాయం ఉందన్న విషయంపై నిర్వహించారు. బహిరంగ మలవిసర్జన గురించిన సర్వే కాదు. 2012లో టాయిలెట్ల కోసం సబ్సిడీ తీసుకున్న వారికి 2014 తర్వాత మళ్లీ ఇవ్వలేదు. దాదాపు 90 లక్షల కుటుంబాలు ఈ విధంగా ఈ కార్యక్రమంలో సబ్సిడీ పొందలేదు. ఎందుకంటే వారికి అంతకు ముందే సబ్సిడీ లభించింది. నిజంగానే అప్పట్లో వారు టాయిలెట్లు కట్టుకున్నారా? అనే ప్రశ్నకు సమాధానం లేదు

మరో ముఖ్యమైన విషయమేమంటే, దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న కుటుంబాలకు టాయిలెట్ కట్టుకునే సబ్సిడీ అప్పుడు ఇవ్వలేదు. ఇప్పుడు ఇవ్వడం లేదు. బిపిఎల్ కుటుంబాలన్నింటికీ టాయిలెట్ సౌకర్యం కల్పించారని అనుకున్నా, దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న చాలా కుటుంబాలకు టాయిలెట్ లేకపోవచ్చు. నిజం చెప్పాలంటే బిపిఎల్ కుటుంబాల కన్నా దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న కుటుంబాల సంఖ్య ఎక్కువ. వీటిలో ఎన్ని కుటుంబాల్లో టాయిలెట్లున్నాయి? 2012లో జరిపిన టాయిలెట్లున్న కుటుంబాల సర్వే ఆధారంగా ఇప్పుడు ఎన్ని కుటుంబాలకు ఈ సదుపాయం కల్పించారో చెబుతున్నారు.

రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ కంపాషనేట్ ఎకానమీ– 2018 అధ్యయనం ప్రకారం ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో 42 నుంచి 57 శాతం ప్రజలు బహిరంగ మలవిసర్జనకే అలవాటు పడి ఉన్నారు. ఈ రాష్ట్రాల్లో బహిరంగ మలవిసర్జన లేనే లేదని ప్రభుత్వం చెబుతున్న మాటలకు ఈ రిపోర్టుకు పొంతనే లేదు. టాయిలెట్ సదుపాయం ఉన్న కుటుంబాల్లో కూడా కనీసం 40 శాతం కుటుంబాల్లో ఎవరో ఒకరు టాయిలెట్ వాడడానికి బదులు బహిర్భూమికే వెళుతున్నారు. కాని మంచి వార్త ఏమంటే, ఈ నాలుగు రాష్ట్రాల్లో 2014లో బహిరంగ మలవిసర్జన 70 శాతం ఉండగా, 2018 నాటికి 44 శాతానికి తగ్గిపోయిందని ఆ నివేదిక తెలుపుతోంది. ప్రకటిస్తున్న స్థాయిలో స్వచ్ఛ భారత్ మిషన్ విజయాలు సాధించి ఉండకపోవచ్చు. కాని చెప్పుకోదగ్గ మార్పు తీసుకొచ్చింది. ఈ మార్పును కొనసాగించాలి. కేవలం ఫలితాలు చూపించే ఆరాటానికి బదులు నిరంతర ప్రయత్నంతో స్వచ్ఛ భారత్ సాధించే దిశగా అడుగులు వేయవచ్చు.

** సంతోష్ మెహ్రోత్రా (ది వైర్)*

కొలువుల్లో సమానావకాశాలు



బి.ఎస్.రాములు
8331966987

రాజ్యాంగం మొదటి సవరణ ద్వారా 15వ ఆర్టికల్‌కు (4) క్లాజు అదనంగా చేర్చబడింది. అలా విద్యారంగంలో రిజర్వేషన్లకు రక్షణ కల్పించడం జరిగింది. మండల్ కమిషన్ సిఫారసులను అనుసరించి న్యాయస్థానాల తీర్పుల తదనంతరం కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో వెనుకబడిన తరగతుల వారికి 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ, 2007లో కేంద్ర ప్రభుత్వం యాక్ట్ నెం. 5/2007ను తెచ్చింది. ఆ చట్టంలోని సెక్షన్ 3లో వెనుకబడిన తరగతులను సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పౌరులుగా కేంద్ర ప్రభుత్వం చేత గుర్తించబడినవారు అని పేర్కొనడం జరిగింది. రిజర్వేషన్ల కోటాను 69 శాతానికి పెంచుతూ తమిళనాడు ప్రభుత్వం ఒక చట్టాన్ని తెచ్చింది. ఆ చట్టం పేరు తమిళనాడు వెనుకబడిన తరగతుల, షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల (విద్యాసంస్థల్లో, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు) చట్టం 1993.

బిసి, ఎస్‌సి, ఎస్‌టిల కోసం ప్రత్యేక కేంద్ర, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లు

బిసి, ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేసినప్పుడే ఆయా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ ఉద్యోగాల్లో 50 శాతం మేరకు గల రిజర్వేషన్లు సమర్థంతంగా అమలు జరుగుతాయి.

1. ఆర్టికల్ 16 ద్వారా పబ్లిక్ ఎంప్లాయిమెంట్ అవకాశాల్లో సమాన అవకాశాలను కల్పిస్తుంది.

1) Thers shall be equality of opportunity for all citizens in matters relating to employment or appointment to any office under the State.

2) No citizen shall, on grounds only of religion, race, sex, descent, place of birth, residence or any of them, be ineligible for, or discriminated against in respect of, any employment or office under the State.

1. రాజ్యాంగంలోని అన్ని ప్రభుత్వోద్యోగాల్లో ప్రభుత్వోద్యోగ వసతుల్లో పౌరులందరికీ ఈ సమానావకాశాలు ఉండాలి.

2. మత, జాతి, కుల, లింగ, జన్మస్థానాలలో అన్నింటిని గాని లేక ఏ ఒక్కదాని కారణంగా, ప్రభుత్వోద్యోగ అర్హతలలోనూ, ప్రభుత్వోద్యోగాలలో చేర్చుకొనుటలోనూ పౌరుల మధ్య వివక్షత చూపరాదు.

3. అయినా జన్మస్థానాన్ని బట్టి రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వోద్యోగాలలోని స్థానిక సంస్థల్లోని, స్వాధికార సంస్థలలోని ఉద్యోగాలను స్థానికులకు కేటాయించే విధంగా చట్టాలు చేసే అధికారం పార్లమెంటుకున్నది. ఈ కేటాయింపు ఏదైనా ఒక తరగతికి లేక కొన్ని తరగతుల ఉద్యోగాలకు పరిమితమయి ఉండాలి. ఈ కేటాయింపు ఉద్యోగుల నియామకం కంటే ముందు నిర్ణయించబడినవై ఉండాలి.

ఆర్టికల్ 16(4) ప్రాధాన్యత

4. అయినప్పటికీ, వెనుకబడిన తరగతుల వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో, అవకాశాలలో ప్రత్యేక కేటాయింపులను ఏర్పరచే అధికారం రాజ్యానికి ఉంది. వెనుకబడిన తరగతుల వారు ప్రభుత్వ ఉద్యోగాల్లో తగినంత మంది లేనట్లు రాజ్యం అభిప్రాయ పడినపుడు మాత్రమే తదుచితమైన కేటాయింపులను చేయవచ్చు.

4ఎ. అయినప్పటికీ, షెడ్యూల్డ్ తెగలు, షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారికి ప్రభుత్వోద్యోగాల్లో ప్రమోషన్‌లలో కూడా ప్రత్యేక కేటాయింపులు ఏర్పరచే అధికారం రాజ్యానికి ఉంది. ఉన్నత పదవులలో వారికి సీనియారిటీ ప్రసాదించు అధికారము కూడా రాజ్యానికి ఉంది. షెడ్యూల్డ్ తెగలు, షెడ్యూల్డ్ కులాల వారు తగినంత మంది ప్రభుత్వోద్యోగాల్లో లేనట్లు రాజ్యం అభిప్రాయపడినచో తదుచితమైన పదోన్నతులకు అనువైన కేటాయింపులను చేయవచ్చు.

> *అగ్రవర్ణ పేదలకు 124 రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా బిసి, ఎస్‌సి, ఎస్‌టి కాకుండా మిగిలిన ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 15.6, 16.6 క్లాజులను చేర్చి రిజర్వేషన్లను కల్పించడం జరిగింది. అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు జనరల్ కాటగిరీలో 10 శాతం కేటాయించారు. మిగతా సామాజిక వర్గాలకు ఇవి అడ్డంకి కాదు. అగ్రవర్ణ పేదలు రిజర్వేషన్ల పరిధిలోకి రావడం వల్ల మిగతా వారికి ఈర్ష్య, కోపం, చిన్నచూపు, పూర్తిగా తగ్గిపోతాయి. రిజర్వేషన్ల వారికి కూడా తెలిసి వస్తుంది. జనరల్ కేటగిరీ వాళ్లకు అమలు జరపడం ద్వారా ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధిని కొనసాగిస్తారు.*

4బి. పైన ఉదహరించిన 4, 4(ఎ) లను అనుసరించి ప్రత్యేకంగా కేటాయించిన స్థానాలు ఏ సంవత్సరంలోనైనా భర్తీ కానిచో వాటిని తదుపరి సంవత్సరాల్లో భర్తీ చేయవచ్చు. అట్టి స్థానాల్లో ఏ సంవత్సరము లోనైనా భర్తీ చేయవలసిన స్థానాలు కలిపి రిజర్వేషన్ అయ్యే స్థానాలు 50 శాతానికి మించితే ఆ విధంగా పరిగణించడానికి వీలులేదు.

5. అయినప్పటికీ, మతపరమైన సంస్థల నిర్వహణ కోసం నియమితమయ్యే ఉద్యోగులూ యాజమాన్య హోదాలో ఉండే వారందరూ అదే మతానికి చెందిన వారై ఉండవలెననడానికి అభ్యంతరము ఉండరాదు. (ఈ ఆర్టికల్, లేదా 19వ ఆర్టికల్‌లోని క్లాజు (1) లోని సబ్ క్లాస్ (జి) లో ఏమి పేర్కొనబడినప్పటికీ, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పౌరుల అభ్యున్నతి కోసం వారు (for the advancement of any socially and educationally backward classes of citizens) లేక షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల వారి అభ్యున్నతి కోసం ప్రయివేటు విద్యా సంస్థలతో సహా అన్ని విద్యా సంస్థలలో వారి ప్రవేశానికి సంబంధించి చట్ట పూర్వకంగా ప్రత్యేకమైన నిబంధనలను ప్రభుత్వం జారీ చేయవచ్చు. (సదరు విద్యా సంస్థ ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం పొందుతున్నా, పొందకపోయినా, ఈ నియమం వర్తిస్తుంది). అయితే, 30వ అధికరణంలో ఉదహరింపబడిన అల్ప సంఖ్యాకుల విద్యా సంస్థలకు ఈ క్లాజు వర్తించదు. (ఈ క్లాజు 93వ రాజ్యాంగ సవరణ ద్వారా 2005 లో అదనంగా చేర్చబడింది).

ఇలాగే అగ్రవర్ణ పేదలకు 124 రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా బిసి, ఎస్‌సి, ఎస్‌టి కాకుండా మిగిలిన ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 15.6, 16.6 క్లాజులను చేర్చి రిజర్వేషన్లను కల్పించడం జరిగింది. అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు జనరల్ కాటగిరీలో 10 శాతం కేటాయించారు. మిగతా సామాజిక వర్గాలకు ఇవి అడ్డంకి కాదు. అగ్రవర్ణ పేదలు రిజర్వేషన్ల పరిధిలోకి రావడం వల్ల మిగతా వారికి ఈర్ష్య, కోపం, చిన్నచూపు, పూర్తిగా తగ్గిపోతాయి. రిజర్వేషన్ల వారికి కూడా తెలిసి వస్తుంది. జనరల్ కేటగిరీ వాళ్లకు అమలు జరపడం ద్వారా ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధిని కొనసాగిస్తారు. సంపద పెంచడంలో, జీవన ప్రమాణాలు పెంచడంలో ఈ రిజర్వేషన్లు ఎంతో సహకరిస్తాయి. సమాజంలో సాంఘిక పరివర్తనకు సహృదయతకు మార్గం ఇస్తుంది. అగ్రకుల రిజర్వేషన్లు ఎవరికి వ్యతిరేకం కాదు. కులం సర్టిఫికేట్ జత చేయకుండా ఏ కులం వారైనా ఏ మతం వారైనా ఈ రిజర్వేషన్లు పొందే అవకాశం ఉంటుంది అని మర్చిపోరాదు. ముస్లింలకు ఈ 10 శాతం రిజర్వేషన్లలో సాధించుకునే అవకాశం ఏర్పడుతుంది.

చట్ట సభలలోవలె ఉద్యోగ రంగంలో, న్యాయ వ్యవస్థలో ప్రాదేశిక నియోజక వర్గాల వారీగా అమలు జరిగినప్పుడే పూర్తి స్థాయి ప్రజాస్వామ్యం.. ఇబిసి రిజర్వేషన్లు అన్ని కులాలకు, అన్ని మతాలకు వర్తిస్తాయి. కులం సర్టిఫికేట్‌లేని వారికి, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ అనే తేడా లేకుండా అందరికీ నూతన అవకాశాలు పెరుగుతాయి. బిసిలందరికీ ఇబిసి రిజర్వేషన్లు ద్వారా క్రిమిలేయర్ పరిమితిలో అవకాశాలు పెరుగుతాయి. జనాభా ప్రాతిపదికపై బిసి రిజర్వేషన్లు పెంచాల్సి ఉన్నది. బిసి (ఇ) గ్రూపునకు పెంచిన రిజర్వేషన్లను కూడా కేంద్రం ఆమోదించడం ద్వారా సామాజిక సామరస్యం వెల్లి విరుస్తుంది. ఇవి అందరికి వర్తిస్తాయి. దీంతో అగ్రకుల రిజర్వేషన్ ఉద్యమాలు సృష్టించే సంఘర్షణలకు ఒక ముగింపు లభిస్తుందని ఆశిద్దాం. నేను 25 శాతంకు ఇబిసి క్రిమిలేయర్ పెట్టాలన్నారు.

ప్రస్తుతం 10 శాతం పెట్టారు. ఇంకా 15 శాతం కూడా క్రిమిలేయర్ పరిధిలోకి తెస్తేనే గ్రామీణ, పట్టణ పేదలకు న్యాయం జరుగుతుంది. వీరు వందల వేల కోట్ల సంపన్నులతో జనరల్ కేటగిరీలో పోటీ పడలేక దశాబ్దాలుగా వెనుకబడిపోతున్నారు. ఇది అమలైతే కొంత స్వాంతన లభిస్తుంది. తద్వారా రిజర్వేషన్‌లను వ్యతిరేకించే ప్రస్తుత దశ నుంచి రిజర్వేషన్‌లను సమర్థించే దిశగా ఎదుగుతారు. అలాగే చట్ట సభలలో, న్యాయ వ్యవస్థలో బిసిలకు, మహిళలకు రిజర్వేషన్‌లు.. అవసరం. చట్ట సభలలోవలె ఉద్యోగ రంగంలో, న్యాయ వ్యవస్థలో ప్రాదేశిక నియోజక వర్గాల వారీగా అమలు జరిగినప్పుడే పూర్తి స్థాయి ప్రజాస్వామ్యం.

బాల్యాన్ని బహుమతిగా ఇద్దాము



కాళంరాజు
వేణుగోపాల్
8106204412

బాల్యం గుర్తుకొస్తే చాలు భారమైన వయసు తేలికవుతుంది. బాల్యం నాటి జ్ఞాపకాలను మరోమారు మనసులోనే ఆవిష్కరింపజేస్తుంది. జీవితంలో ఒక్కసారైనా బాల్యాన్ని తలుచుకోని మనిషి ఉండదు. ముద్దు ముద్దు మాటలతో, చిలిపి అల్లరి చేష్టలతో ఇంటిల్లిపాదినీ అలరించే బాలలంటే అందరికీ ప్రేమే. ప్రకృతితో సహా అందరి ప్రేమకు అర్హులైనవారు వీరు మాత్రమే. వారికోసం ప్రత్యేకంగా బాలల దినోత్సవం నిర్వహిస్తున్నారు. బాలలంటే బడికి వెళ్ళే పిల్లలే కానక్కరలేదు. సాటి పిల్లల్లా విద్య ద్వారా ఉత్తమ భవిష్యత్తును అందుకోవాలని ఆశించినా, ఆర్థిక స్థితిగతుల వల్ల బడికి దూరమై బ్రతుకు భారాన్ని అతి పిన్నవయసులో మోయవలసిన పరిస్థితిలో భవిష్యత్తంటే ఏ పూటకాపూట కడుపు నింపుకోవడమే అనే లక్ష్యానికి బలై బ్రతికే ప్రతీ బాలుడు, బాలిక. మరి వారి బాల్యాన్ని ఎందుకు కోల్పోతున్నారు? అని ఆలోచిస్తే ప్రధాన కారణం మాత్రం బాలల హక్కులను కాలరాస్తున్న మన పాలకుల నిర్లక్ష్యధోరణి. కారణం పరిశీలిస్తే వారికి ఓటు హక్కు లేక పోవడమే .

దేశంలో బాల్యాన్ని బాల్యంలా అనుభవిస్తున్న పిల్లల సంఖ్య చాలా తక్కువ. తల్లిదండ్రుల పేదరికం పిల్లలను ఆనందానుభూతుల్లోకి కాకుండా నరకంలోకి నెడుతోంది. బాలకార్మికులు, ఆకలితో అల్లాడే పిల్లలు మన దేశంలోనే ఎక్కువ. ప్రపంచ వ్యాప్తంగా మరణిస్తున్న ఐదేళ్ళ వయస్సులోపు పసి పిల్లల సంఖ్య భారత్‌లోనే అత్యధికంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఐదేళ్ళ వయస్సులోపున్న పిల్లల మరణాలలో మూడో వంతు మన దేశంలోనే జరుగుతున్నాయి. 2017లో మరణించిన పిల్లల్లో 22 శాతం మంది భారత్‌లోనే ఉన్నారని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. భారత్‌లో పుట్టిన వెయ్యి మంది శిశువుల్లో 62 మంది ఏడాదిలోపే చనిపోతుంటే, మిగిలిన వారిలో కొంతమంది పోషకాహార లోపంతో మృతి చెందుతున్నారు.

ఏటా 14.5 కోట్ల మంది పిల్లలు పుట్టిన రెండు మూడేళ్లకే తనువు చాలిస్తున్నారని ఐరాస తెలపడం మనదేశ పాలనలోని డొల్లతనాన్ని తెలియజేస్తుంది. శిశు మరణాలను నివారించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమౌతున్నాయి. వాగాడంబరం... ఆచరణ శూన్యత శైశవానికి శాపాలుగా మారుతున్నాయి. చాలా గ్రామాల ఆసుపత్రులలో మౌలిక వసతులు సైతం లేకపోవడం, ఆసుపత్రులున్నా డాక్ట ర్లు లేకపోవడం, మందులు లేకపోవడం మరణాల రేటు పెరగడానికి ప్రధాన కారణమౌతోంది. ఏజెన్సీలో సరైన వసతులు లేకపోవడం వలన కలిగే చిన్నారుల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలేనని పౌర సమాజం, ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నా పాలకులకు చీమకుట్టినట్లయినా లేకపోవడం బాధాకరం.

నేడు మనిషి తన బాల్యదశను క్రమక్రమంగా కోల్పోతూ వస్తున్నాడు. నేడు బాల్యం చిదిమివేయబడుతోంది. లేనివాళ్లింటో ఆకలి, అనారోగ్యం, అవిద్యతోనూ, బాల కార్మికులుగాను చిదిమివేయబడుతున్న బాల్యం, ఉన్నవాళ్లింట్లో రెండు మూడేళ్లకే ప్రారంభమవుతున్న ప్రైవేటు, కాన్వెంటు చదువులు, కార్పొరేట్ స్కూళ్లలో సర్వనాశనం అయిపోతోంది. భారతదేశంలో కోట్లాది చిన్నారుల్లో చాలామంది పిల్లలు శారీరకంగా మానసికంగా ఎదుగుదల లోపించి ఉంటున్నారు. ఆర్థిక, సామాజిక స్థితిగతుల కారణంగా ఈ అభివృద్ధి లోపం ఏర్పడుతున్నమాట వాస్తవం. రేపటి జ్ఞానవంతమైన శక్తిమంతమైన, ఆరోగ్యవంతమైన నవభారతాన్ని నిర్మించాలంటే నేటి బాలల అవసరాలను తీర్చడం ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న అంశం. అందుకు సమయమాసన్నమైనది.

ఇక బాలికల సంగతి చెప్పనక్కరలేదు ఇంట్లో, బడిలో, గుడిలో ఎక్కడ సరైన రక్షణ లేదు, స్వేచ్ఛగా ఎగరడం సంగతి అటుంచి, సరిగ్గా బతకలేని పరిస్థితి. తల్లిదండ్రులు, కుటుంబం బాగున్న వారి పరిస్థితి వేరు. వలస వెళ్ళేవారు, తల్లిదండ్రులు పట్టించుకోని వారు, తాగుబోతుల పిల్లలు, అనాధలు ఇలాంటి వారి పరిస్థితి గురించి తలుచుకుంటేనే బాధ వేస్తుంది. వసతి గృహాలు, హాస్టళ్ళు వాటి గురించి చెప్పనవసరం లేదు. ఇది కాకపోతే కుర్రకారు ప్రేమా, గీమా అని మోసం చేయడం, కుదరకపోతే యాసిడ్లు పోయడం, అఘాయిత్యం చేయడం, ఘోరంగా చంపేసే వార్తలు నిత్యకృత్యం.

ఒకచోట బడి పిల్లలు రాజ కుమారుల్లా దర్శనమిస్తారు. మరోచోట యోగి వేమనల్లే ఎదురొస్తారు. ఒకరికి వంటినిండా మోయలేనన్ని బరువులు. షూ, టై, బ్యాడ్జి, రిబ్బన్, వీపు మీద బ్యాగ్. వీటిలో ఏది లోపించినా అది నేరం. మరచిపోయినా, మాసిపోయినా వళ్లంతా వాతల శిక్ష. మరొకరిది సిగ్గు బిళ్లలు కూడా కప్పుకోలేని దైన్యం. సుర్రున కాలే రోడ్డు మీద నడవాలన్నా, ముళ్ల బాటలో పరుగెత్తాలన్నా కనీసం చెప్పులేసుకోలేని దౌర్భాగ్యం. అతుకుల బొంతలే వారికి యూనిఫాం. ఎందుకీ దుస్థితి? ఎవరిదా పాపం? బంగారు చెంచాలో తినాలని అతడికి ఎవరు వ్రాసారు? చెత్త కుప్పల్లో మెతుకులు ఏరుకొని తినమని వీడికి ఎవరు చెప్పారు? అంటా తలరాత అని సర్దుకుందామా? ఏమిటీ దౌర్భాగ్యం? మరెందుకీ దైన్యం? ప్రతీ పిల్లవాడికి అందమైన బాల్యాన్ని ఇవ్వలేమా?

పిల్లలకి బహుమతిగా ఏమివ్వబోతున్నారు? ఖరీదైన ఎలక్ట్రానిక్ ఆట వస్తువులూ, థీమ్ పార్కు, మాల్స్, పర్యటనలు? పోనీ మొబైల్ ఫోన్ ఇస్తారా? భవిష్యత్తు గురించి బాగా ఆలోచించి.. ఆర్థిక బాండ్లూ, బీమా పథకాలను కానుకగా ఇవ్వాలనుకుంటున్నారా? వారి పేరు మీద లక్షలు కాదు కాదు కోట్లు కూడకట్టాలనుకుంటున్నారా.. వారి అడుగు తీసి వేయకుండా కష్టం కాంపౌండ్ వాల్ దాటకుండా కాపలా ఉంటున్నారా చేయండి మంచిదే! కానీ వీటన్నింటికంటే మించినది ఒకటుంది అదే నేటి పిల్లలకి వాళ్ల బాల్యాన్నే వారికి బహుమతిగా ఇవ్వండి ! నిజానికిది బహుమతి కూడా కాదు. వాళ్ల నుంచి మనం బలవంతంగా దూరం చేసిన ఒక అద్భుతమైన వరం. దాన్ని ఖచ్చితంగా వారికి తిరిగి ఇవ్వండి. మనకున్న ఎన్నో కోరికల మధ్య వాళ్లని వర్తమానంలో పిల్లలుగా చూడటం మరిచిపోతున్నాం. మార్కుల కోసం కొందరు, ర్యాంకుల కోసం మరికొందరు మంచి భవిష్యత్తునిస్తున్నామనే భ్రమలో.. వాళ్ల బాల్యాన్ని తీసేసుకుంటున్నాం! వారి నుంచి బలవంతంగా లాక్కుంటున్న దాన్నెలా మనం తిరిగివ్వాలి? ఉన్నదాన్ని ఎలా కాపాడాలి? తరగని ఆనందం, నియంత్రణ లేని ఉద్వేగం ఇవే బాల్యం లక్షణాలు.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత ఈ ఏడు దశాబ్దాల కాలంలో నిశ్చితమైన నిబద్ధతతో కూడిన భారతదేశ రాజ్యాంగ, చట్ట నిబంధనల ద్వారా బాలల కొరకు అవకాశాలను, కార్యాచరణ విధానాలను, కార్యక్రమాలను రూపొందించాల్సిన అవసరముంది. ఈ శతాబ్దపు చివరి దశకంలో ఆకస్మిక సాంకేతిక అభివృద్ధిలో భాగంగా ఆరోగ్యం, పోషణ, విద్య అంశాలతో బాటు ప్రాదేశిక విషయాలతో నూతన ఆకాంక్షలను కల్పించే అవకాశాలను పిల్లలకు కల్పించే విధంగా ఎన్నో నిర్ణయాలు తీసుకున్నప్పటికీ పిల్లల హక్కులను సంరక్షించే ఫలాలు ఇప్పటికీ అందరికీ అందడంలేదు. చిన్నారులపై ఏ ఒత్తిడి తేకుండా ఈ మూడింటిని సరైన దారి మళ్లించగలిగితే చాలు. మంచి బాల్యాన్ని బహుమతిగా అందించినట్టే. అపుడే బాలల పరమార్థం నెరవేరినట్టు.

సకుటుంబం

వెచ్చదనానికో... ఫ్యాషన్





ఈ కాలంలో.. వణికించే చలికి రోజంతా ముసుగేసుకుని పడుకోవాలనిపిస్తుంది...అలా అని రోజువారీ పనులను చేయకుండా ఉండలేం కదా! అప్పుడు ముసుగులాంటి బట్టలే వేసుకుని తిరుగుతుంటాం..కానీ స్టైల్ సంగతేంటి. ఈ సీజన్ అంతా ఇలాంటి బట్టల్లో కాకుండా అందరిలో తిరిగేలా ఉండేందుకు డిజైనర్లు వింటర్‌వేర్‌ని తయారు చేశారు. అందమైన ఉన్ని టాపుల్ని మనకోసం రూపొందించారు.








కనీసం అరగంటైనా..



ఈ మధ్య కాలంలో ఇంటి పనులు చేసుకోవడం బాగా తగ్గిపోయింది. అన్నింటికీ యంత్రాల మీదా రెడీమేడ్‌గా తయారయ్యే వాటిమీదా ఆధారపడడం పెరిగింది. దీని వల్ల మహిళల్లో ఎక్కువ మంది ఊబకాయులుగానూ వ్యాధిగ్రస్తులుగానూ మారి, తద్వారా అకాల మరణానికి చేరువ అవుతున్నారు. ముఖ్యంగా 65 సంవత్సరాలు పై బడిన మహిళలు రోజూ కనీసం ఓ అరగంట సేపయినా ఇంటి పనులు చేసుకోవడం వల్ల అలాంటి ప్రమాదాలు తగ్గుతాయని పరిశోధకులు చెబుతున్నారు. ఆ వయసులో వాళ్ల ప్రతి కదలికా ఆరోగ్యానికి ఎంతో మంచిదట. చుట్టుపక్కల ఇళ్ళకు నడిచి వెళ్ళి కాసేపు మాట్లాడటం, బట్టలు మడత పెట్టడం, వంట చేయడం.. ఇలా శరీరాన్ని కదిలించే ఏ చిన్న పని చేసినా అది వాళ్ల ఆరోగ్యానికి మంచిదేనట. ఇందుకోసం వీళ్లు 64 ఏళ్ళ పైబడ్డ ఆరు వేల మంది మహిళల్ని ఎంపిక చేసి, సుమారు నాలుగున్నరేళ్ల పాటు పరిశీలించి చూడగా తేలికపాటి పనులు చేసేవాళ్లలో 12 శాతం, వాటితో పాటు సైక్లింగ్, వేగంగా నడవడం... వంటి వ్యాయామాలు చేసేవాళ్లలో దాదాపు 40 శాతం మరణాల రేటు తక్కువగా ఉన్నట్లు తేలిందట. కాబట్టి వాళ్లు శారీరకంగా ఎంత చురుగ్గా ఉంటే దీర్ఘకాలిక వ్యాధులు కూడా అంత దూరంగా ఉంటాయని చెబుతున్నారు.

గుడ్డుతో రోగనిరోధక శక్తి...!

ఏడాదిలోపు పిల్లలకు ఇచ్చే ఆహారంలో తల్లులు చాలా జాగ్రత్తలు పాటిస్తుంటారు. వారికి తేలికగా జీర్ణమయ్యే పదార్థాలే ఇస్తారు. ఆ క్రమంలో కొందరు పాలు ఇవ్వడం కూడా మానేస్తారు. పాలు సంపూర్ణపోషకాహారమని తెలిసినా రకరకాల కారణాలు చూపిస్తూ పాల పరిమాణం తగ్గించేస్తారు. అంతే కాకుండా గుడ్లు, వేరుశనగపప్పులు వంటివి పిల్లలకు జీర్ణం కావన్న అపోహ చాలామంది తల్లులకు ఉంటుంది. ఇది తప్పుడు అభిప్రాయం అంటున్నారు నిపుణులు. పిల్లలకు ఆరు నెలల వయస్సు నుంచే పాలతో పాటుగా గుడ్లు, వేరుశనగపప్పు వంటివి ఇవ్వడం వల్ల వారిలో రోగనిరోధకశక్తి పెరుగుతుందనీ, ఆస్తమా వంటి ఎలర్జీలు వారిని చుట్టుముట్టవనీ అంటున్నారు. ఆరు నెలలలోపు పిల్లలకు కూడా వీటిని ఇవ్వవచ్చని వారు చెబుతున్నారు. కొన్ని మూఢనమ్మకాలతో తల్లులే పిల్లల్ని అనారోగ్యానికి దగ్గర చేస్తున్నారన్నది వారి వాదన.



మెరిసే చర్మానికి..!




చలికాలంలో మన చర్మానికి జరిగే హాని అంతా కాదు. చల్లటి గాలులు, వాతావరణం మన చర్మంలోని తేమను పీల్చేస్తాయి.ఫలితంగా అది నిర్జీవంగా, కాంతి విహీనంగా మారుతుంది. అలా కాకుండా ఉండాలంటే.. ఓ పద్ధతి ప్రకారం ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి.

క్లెన్సింగ్: ముందుగా ముఖాన్ని తడి వస్త్రంతో తుడవాలి. అదయ్యాక...

టోనర్: మీ ముఖంపై ఉండే చర్మం ఆరోగ్యంగా, తాజాగా కనిపించాలంటే టోనింగ్ తప్పనిసరి. దూదిపై టోనర్ వేసుకుని ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. చర్మం మృదువుగా మారేలా చేస్తుంది.


పూత : ఇంట్లో సహజసిద్ధంగా తయారు చేసుకున్న ఏదయినా పూతను ముఖానికి వేసుకుని పదిహేను నిమిషాలయ్యాక కడిగేసుకోవాలి. తరువాత నాణ్యమైన మాయిశ్చరైజర్‌ని పట్టించాలి. దీనివల్ల చర్మానికి కావల్సిన తేమ అందుతుంది.

మన రంగవల్లులు



21 చుక్కలు
సరి చుక్క ఒకటి
వచ్చే వరకు


సుప్రజ
నల్లగొండ



25 చుక్కలు
5వచ్చే వరకు

లలిత
చాడ

చిట్కాలు



* మల బద్ధకం ధ్యానానికి ప్రధాన శత్రువు. సాధకుడు ఏ పరిస్థితిలోనూ మలబద్ధకానికి తావీయకూడదు.
* ఆహారంలో వెల్లుల్లిని క్రమం తప్పకుండా వాడే వారికి ఎప్పటికీ ఎముకల బలం తగ్గదు.
* రెండు పూటలా పచ్చి ఉల్లిగడ్డ మజ్జిగన్నంతో తినేవారు నిత్య ఆరోగ్య వంతులుగా రాణిస్తారు.

సర్పంచ్‌లకు 27,940 నామినేషన్లు

మన తెలంగాణ/హైదరాబాద్ ఈ నెల 21వ తేదీన జరిగే 4,479 గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలకుగానూ మొత్తం 27,940 నామినేషన్లు వచ్చాయి. 13వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో నిలిచిన అభ్యర్థుల సంఖ్యను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది. అలాగే 39,822 వార్డు మెంబర్లకుగానూ 97,690 నామినేషన్లు వచ్చాయి. జిల్లాల వారిగా వివరాలు ఇలా ఉన్నాయి.

జిల్లా	పంచాయతీలు	వచ్చిన నామినేషన్లు	వార్డులు	వచ్చిన నామినేషన్లు
ఆదిలాబాద్	153	595	1,240	1,953
ఆసిఫాబాద్‌లో	113	646	992	2,087
మంచిర్యాల	111	792	972	2,441
నిర్మల్	134	728	1,058	1,937
జగిత్యాల	131	936	1,146	2,446
కరీంనగర్	97	906	928	2,980
పెద్దపలి	106	1,048	962	2,536
సిరిసిల్లా	80	660	722	1,920
కొత్తగూడెం	174	276	1,534	1,227
ఖమ్మం	188	1,125	1,736	4,564
గద్వాల్	106	523	974	1,883
మహబూబ్‌నగర్	249	1,511	2,274	5,127
నాగర్‌కర్నూల్	160	852	1,376	3,199
వనపర్తి	80	607	728	1,636
మెదక్	154	883	1,364	3,007
సంగారెడి	258	1,679	2,398	7,576
సిద్దిపేట్	186	1,609	1,712	5,223
నల్గొండ	304	2,231	2,572	7,215
సూర్యాపేట్	161	1,282	1,456	4,264
యాదాద్రి	124	697	1,050	2,696
కామారెడి	164	1,257	1,508	4,066
నిజామాబాద్	177	1,155	1,746	4,205
మేడ్చల్	33	199	322	1,178
రంగారెడి	179	982	1,580	4,735
వికారాబాద్	249	1,180	2,160	4,475
జనగామ్	100	645	906	2,063
భూపాలపల్లి	158	956	1,358	3,350
మహబూబాబాద్	156	881	1,366	3,397
వరంగల్ రూరల్	145	819	1,264	2,987
వరంగల్ అర్బన్	49	280	472	1,261

పంచాయతీ 'వేలం'లపై కఠిన చర్యలు తీసుకోండి

డిజిపికి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశం

మన తెలంగాణ / హైదరాబాద్ : పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఏకగ్రీవ ఎన్నిక కోసం జరుగుతున్న బహిరంగ వేలంపాటల సంఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డిజిపికి రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి గురువారం లేఖ రాశారు. అన్ని జిల్లాల ఎస్‌పిలను, పోలీసు కమిషనర్‌లను ఆదేశించాలని ఆ లేఖలో కోరారు. వికారాబాద జిల్లా పంచాయతీ అధికారి ఎంఏ మజిద్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఈ నెల 6వ తేదీన రాసిన లేఖలో జిల్లాలోని బషీరాబాద్ మండల పరిధిలోని బోజ్యానాయక్ తండాలో సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేసేందుకు రెండు గ్రూపులు వేలం పాటలు నిర్వహించాయని, ఆ రెండు గ్రూపుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయని, ఒక గ్రూపుపై మరో గ్రూపు పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాయని తెలియజేశారు. పోలీసులు కూడా ఈ రెండు గ్రూపులకు సంబంధించిన వ్యక్తులపై కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వెంటనే డిజిపికి లేఖ రాసి ఆ జిల్లా ఎస్‌పి వెంటనే ఈ వ్యవహారంలో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా జరుగుతున్న ఈ వ్యవహారంలో వెంటనే దర్యాప్తు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అన్ని జిల్లాల ఎస్‌పిలను అప్రమత్తం చేయాల్సిందిగా కూడా సూచించారు. ఏకగ్రీవం కోసం వేలం పాటలు పాడినా, ప్రభావితం చేసేలా వ్యవహరించినా ఎన్నికల నిబంధనల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని కమిషనర్ హెచ్చరించారు. ఇప్పటికే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటాయన్న ఉద్దేశంతో సర్క్యులర్‌ను కూడా జారీ చేసినట్లు గుర్తుచేశారు.

ఏకగ్రీవంపై ఆచితూచి నిర్ణయం తీసుకోండి..
ఎన్నికల నిఘా వేదిక

పంచాయతీ ఎన్నికల్లో రకరకాల ప్రలోభాలతో 'ఏకగ్రీవం' అయినట్లు ప్రకటనలు వస్తున్నాయని, అయితే దాని వెనక ఉన్న బహిరంగ వేలం పాటలు, ప్రలోభాలు తదితరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని, పూర్తిస్థాయిలో వాస్తవాలు వచ్చేంతవరకు అధికారిక ప్రకటన చేయవద్దని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఎన్నికల నిఘా వేదిక ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కలిసిన సంస్థ ప్రతినిధులు పద్మనాభరెడ్డి, రావ్ చెలికాని తదితరులు ఏకగ్రీవం పేరుతో ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా చోటు చేసుకున్న సంఘటనలపై సీరియస్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాజాగా ముగిసిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమ సంస్థ క్రియాశీలక పాత్ర పోషించి ఎన్నికల యంత్రాంగానికి సహకరించిందని, ఇప్పుడు కూడా అదే తరహా సహకారాన్ని ఇవ్వడానికి సిద్ధంగా ఉందని వివరించారు. పంచాయతీ ఎన్నికలు ఏకగ్రీవమైతే ఎంఎల్‌ఏ నిధుల నుంచి రూ. 15 లక్షలు ఇస్తామంటూ కొద్దిమంది ఎంఎల్‌ఏలు ఇటీవల చేసిన వ్యాఖ్యలు సైతం ఎన్నికల కోడ్‌కు విరుద్ధమైనదని గుర్తుచేశారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఇప్పటికీ ఎన్నికల ఖర్చుల వివరాలను సమర్పించని అభ్యర్థుల జాబితాను రిటర్నింగ్ అధికారులను ఇవ్వాలని, తద్వారా వారిపై చర్యలు తీసుకోడానికి అవకాశం ఉంటుందని సూచించారు.

తెల్లవారుజాము వరకు నామినేషన్ల స్వీకరణ

కాసిపేటలో 521 నామినేషన్లు



మనతెలంగాణ/కాసిపేట : మొదటి విడత గ్రామ పంచాయతీల ఎన్నికల్లో భాగంగా బుధవారం నామినేషన్ గడువు చివరి రోజు కావడంతో అభ్యర్థులు చివరి రోజే అధిక సంఖ్యలో రావడంతో నామినేషన్ల ఘట్టం గురువారం తెల్లవారుజాము వరకు కొనసాగింది.నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థులు క్యూలైన్లలో సుమారు 12 గంటల పాటు నిల్చొని తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. క్యూలైన్ల లో నిలబడిన అభ్యర్థులు తెల్లవారు జామున మూడు గంటలు దాటిన తదుపరి నిలబడి కునుకు తీయడం కనిపించిది. మొత్తం మీద ఉదయం ఐదు గంటల వరకు తమ నామినేషన్లను దాఖలు చేసి ఇళ్లకు వెళ్లిపోయారు. కాసిపేట మండలంలో 22 పంచాయతీలు, 190 వార్డులకు గాను మొత్తం 521 నామినేషన్లు దాఖలు అయినట్లు అధికారులు పేర్కొన్నారు. కాసిపేట గ్రామ పంచాయతీలో సర్పంచ్‌కు 4, వార్డులకు 31 నామినేషన్లు వేసారు. రొట్టెపల్లిలో సర్పంచ్‌కు 3 వార్డులకు 9, లంబాడితండా (కె)లో సర్పంచ్‌కు 5 వార్డులకు 20, పల్లంగూడలో సర్పంచ్‌కు 4, వార్డులకు 20, మామిడిగూడెంలో సర్పంచ్‌కు 8, వార్డులకు 20, సోమగూడెం (కె)లో సర్పచ్‌కు 6, వార్డులకు 25, మత్యంపల్లిలో సర్పంచ్‌కు 5, వార్డులకు 26, చిన్నధర్మరంలో సర్పంచ్‌కు 1, వార్డులకు 13, పెద్దనపల్లిలో సర్పంచ్‌కు 5, వార్డులకు 23, బుగ్గగూడలో సర్పంచ్‌కు 8, వార్డులకు 11, కోమటిచేనులో సర్పంచ్‌కు 9, వార్డులకు 19, మల్కేపల్లిలో సర్రంచ్‌కు 5, వార్డులకు 14, కోనూర్‌లో సర్పంచ్‌కు 3, వార్డులకు 13, వెంకటాపూర్‌లో సర్పంచ్‌కు 3, వార్డులకు 10, గట్రావ్‌పల్లిలో సర్పంచ్‌కు 5, వార్డులకు 19, సోనాపూర్‌లో సర్పంచ్‌కు 4, వార్డులకు 12, లంబాడితండా (డి)లో సర్పంచ్‌కు 6, వార్డులకు 18, మద్దిమాడలో సర్పంచ్‌కు 12, వార్డులకు 19, తాటిగూడలో సర్పంచ్‌కు 5 వార్డులకు 9, కొండాపూర్‌లో సర్పంచ్‌కు 8, వార్డులకు 17, దేవాపూర్‌లో సర్పంచ్‌కు15, వార్డులకు 49 మంది తమ నామినేషన్లు ధాఖలు చేసారు. ఒక్క ధర్మరావుపేటలో మాత్రం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

కొలువుల కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

నియామక అవకాశం రాలేకపోయిందని, కోర్టులో పిటిషన్ వేయడంతో ఇటీవల వారిని నియమించాల్సిందిగా ఉత్తర్వులు వెలువడ్డాయని గుర్తుచేశారు. పదోన్నతుల్లో జరిగిన పొరపాట్ల కారణంగా 175 పోస్టుల భర్తీకి మెరిట్ జాబితాలో ఉన్నవారికి నియామక పత్రాలు ఇవ్వడం వీల్లేకపోవడంతో ఆ ప్రక్రియనే ఆపేయాల్సి వచ్చిందని, ఇప్పుడు కోర్టు ఉత్తర్వుల ప్రకారం భర్తీ చేయాలంటే వారిని ఎక్కడ నియమించాలో, ఎక్కడ ఖాళీలు ఉన్నాయో లేవో తేలాల్సి ఉంటుందని ఉదహరించారు. ప్రతీ శాఖలో ఎంత మంది సిబ్బంది ఉన్నారో ఇప్పటికీ స్పష్టత లేనందువల్ల ఆ వివరాలన్నింటినీ అధ్యయనం చేసిన తర్వాత సర్దుబాటు ప్రక్రియకపై స్పష్టత వస్తుందని, ఖాళీ పోస్టుల నియామకం కోసం నోటిఫికేషన్ ఇవ్వడంపై కూడా స్పష్టత వస్తుందని, అందులో భాగమే ఇప్పుడు అన్ని విభాగాలు, శాఖల నుంచి సిబ్బంది వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం దగ్గర ప్రతీ విభాగానికి సంబంధించిన పూర్తి డాటా ఉన్నట్లయితే ఇబ్బందులను నివారించవచ్చని, ఈ ప్రక్రియతో అది సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

అలోక్ ఫైర్డ్

(మొదటిపేజీ తరువాయి)

నాయకుడు మల్లికార్జున ఖర్గే, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి తరపు నామినీ జస్టిస్ ఎకె సిక్రి ఉన్నారు. అలోక్ భవితవ్యంపై నిర్ణయం తీసుకోవడానికి ఈ కమిటీ బుధ, గురువారాల్లో విస్తృతంగా చర్చలు జరిపింది. కేంద విజిలెన్స్ కమిషన్ (సివిసి) నివేదిక బుధవారం అందకపోవడంతో కమిటీ గురువారం కూడా సమావేశమైంది. సివిసి నివేదికను పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం వర్మపై ఆరోపణలకు ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నట్లు భావించిన కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. ఇదిలా ఉంటే ఈ నిర్ణయం వెలువడడానికి కొద్ది గంటల ముందు అలోక్‌వర్మ అయిదుగురు సిబిఐ అధికారులను బదిలీ చేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. అస్థానా కేసును విచారిస్తున్న డిఐజి ఎంకె సిన్హా, డిఐజి తరుణ్ గౌబా, జెడి మురుగేషన్, ఎడిజి ఎకె శర్మలను బదిలీ చేశారు. దీంతో పాటు అస్థానా కేసు దర్యాప్తును 2006 బ్యాచ్ ఐపిఎస్ అధికారి మోహిత్ గుప్తాకు అప్పగించారు. బుధవారం విధుల్లో చేరగానే సిబిఐ తాత్కాలిక డైరెక్టర్ నాగేశ్వర రావు తీసుకున్న నిర్ణయాలన్నిటినీ వర్మ రద్దు చేసిన విషయం తెలిసిందే.

అలోక్ వర్మ, సిబిఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ రచ్చకెక్కడంతో ప్రభుత్వం వీరిద్దరి అధికారాలను లాగేసుకుని బలవంతంగా సెలవుపై పంపుతూ గత అక్టోబర్ 23న ఆదేశాలు జారీ చేయడం తెలిసిందే. అదే రోజు ఒడిశా కేడర్ ఐఎఎస్ అధికారి ఆర్ నాగేశ్వర రావును తాత్కాలిక డైరెక్టర్‌గా నియమించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అలోక్‌వర్మ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం రెండు రోజుల క్రితం అలోక్ వర్మకు తిరిగిపగ్గాలు అప్పగించాలంటూ తీర్పు చెప్పడం తెలిసిందే. దీంతో అలోక్‌వర్మ సిబిఐ డైరెక్టర్‌గా బుధవారం తిరిగి బాధ్యతుల చేపట్టారు. అయితే ఇది జరిగిన 24 గంటల్లోపే ఆయనపై వేటు వేయడం గమనార్హం.

ఖర్గే డిసెంట్

ఇదిలా ఉండగా సిబిఐ డైరెక్టర్ అలోక్‌వర్మను తప్పించాలని ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన గురువారం జరిగిన అత్యున్నత స్థాయి కమిటీ సమావేశంలో దానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున ఖర్గే ఒక డిసెంట్ నోట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా బలవంతంగా వర్మను సెలవుపై పంపిన 77 రోజులు కూడా ఆయన పదవీ కాలానికి పొడిగించాలని ఖర్గే ఆ నోట్‌లో కోరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. కాగా వర్మను తొలగించాలన్న నిర్ణయాన్ని ఖర్గే వ్యతిరేకించడం ఇది రెండో సారి.

వృద్ధ దంపతులకు కెటిఆర్ అభినందన

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వానికి డొనేట్ చేయనున్నట్లు తెలిపా రు. ఎకరంన్నర స్థలంలో ఆరువేల చదరపు అడుగుల స్థలా న్ని సుమారు కోటి రూపాయలతో నిర్మించామని వివరించా రు. అయితే వృద్ధాప్యం, ఆరో గ్య సమస్యలతో నిర్వహణలో ఇబ్బంది కలగకుండా ప్రభుత్వానికి విరాళంగా ఇవ్వనున్న ట్లు వృద్ధదంపతులు కెటిఆర్ తో చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి చేస్తున్న కృషి, ముఖ్యమంత్రి కెసిఆర్ సంక్షేమపథకాలు ఎం తగానో ఆకట్టుకున్నాయని వా రు చెప్పారు. ఈ నేపథ్యంలో వృద్ధాశ్రమాన్ని ప్రభుత్వానికి విరాళం ఇస్తే ప్రభుత్వపరంగా ఎలాంటి ఆధారం లేని వృద్ధులకు సేవలందిస్తారనే ఆశతో ఈనిర్ణయం తీసుకున్నట్లు వృద్ధదంపతులు కెటిఆర్‌కు చెప్పారు. వృద్ధుల నిర్ణయాన్నికెటిఆర్ అభినందించారు. సేవచేయాలనే ఆలోచన వారిలో ఉండటాన్ని ప్రసంసించారు. అయితే అధికారులతో చర్చించి ప్రభుత్వరంగంలో వృద్ధాశ్రమనిర్వహణకు సహకారం అందిస్తానని కెటిఆర్ హామీ ఇచ్చారు. అలాగే జిల్లాకలెక్టర్ అనితారామ చంద్రన్ తో కెటిఆర్ అప్పటికప్పుడు ఫోన్‌లో మాట్లాడి వివరాలు చెప్పారు.వృద్ధుల దాతృత్వాన్ని కెటిఆర్ తో పాటు కలెక్టర్ కొనియాడారు. భవిష్యత్‌లో ఆశ్రమ నిర్వాహణకు చట్టప్రకారంగా నిర్ణయాలు తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రభుత్వంతో చర్చించి వృద్ధాశ్రమాన్ని కొనసాగించే విధంగా చర్యలు తీసుకొని వృద్ధదంపతుల కోరిక తీరుస్తానని హామి ఇచ్చారు.

ఆర్‌టిసి నష్టాలను అధిగమించాలి

- ఆర్థిక పరిపుష్టి, పురోభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ
- ప్రయాణికుల సౌకర్యాల మెరుగుకు ప్రత్యేక చర్యలు
- సంస్థ అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎండి



మన తెలంగాణ / హైదరాబాద్ : ఆర్‌టిసి ఆర్థిక పరిపుష్టి, పురోగతిపై ప్రత్యేక దృష్టిని కేంద్రికరించాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఇంఛార్జీ మేనేజింగ్ డైరెక్టర్, రోడ్లు, భవనాలశాఖ ముఖ్య కార్యదర్శి బి.సునీల్‌శర్మ అధికారులను ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి నష్టాలను అధిగమించేందుకు అవసరమైన చర్యల ను చేపట్టా లన్నారు. దీంతో పాటు ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు కూడా చర్యలను చేపట్టాలన్నారు. సంస్థ ఆర్థిక పురోగతితో పాటు ప్రయాణి కుల సౌకర్యాల కల్పన ధ్యేయంగా నిర్మాణాత్మక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, రీజనల్ మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారుల తో ఆయన గురువారం బస్‌భవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సంస్థ పనితీరుతో పాటు మెరుగుతో పాటు ఆర్థిక పరిపుష్టి, ప్రయాణికుల సౌకర్యం తదితర అంశాలపై సుధీర్ఘంగా చర్చించారు. సమావేశం అనంతరం సునీల్‌శర్మ పలు అంశాలపై అధికారులకు దిశానిర్ధేశం చేశారు. ప్రధానంగా గత ఏడాది నవంబర్ నాటికి సర్వీసులకు సంబంధించిన బ్రేక్ డౌన్ వివరాలతో తెలుసుకొని రానున్న రోజుల్లో జీరో బ్రేక్ డౌన్స్ లక్ష్యం దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఇందుకోసం సంస్థ తగిన చర్యలకు శ్రీకారం చుట్టిందన్నారు. దీంతో పాటు కాలం తీరిన బస్సులను తుక్కు కింద అమ్మివేసి ప్రయాణికుల అవసరాల మేరకు బస్సులను సమకూర్చేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కమర్షియల్ రాబడిని పెంచుకునేందుకు వీలుగా అధికారులు చొరవ చూపాలని సూచించారు. ప్రయాణికులకు మరింత సురక్షిత ప్రయాణం అందించేందుకు సంస్థ ఇప్పటికే నిర్ధిష్ట, నిర్మాణాత్మక చర్యలకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. బస్టాండ్‌లో ప్రయాణికుల సదుపాయాలు, వసతిని కల్పించే అంశాలపై ప్రత్యేక దృష్టిని సారించినట్లు చెప్పారు. ఖర్చును తగ్గించుకొని ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రత్యేక చర్య లను కూడా తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇందులో ప్రధానంగా గత ఏడాది నవంబర్ వరకు లాభాల్లో ఉన్న డిపోలు, డివిజన్లు, రీజియన్ల వివరాలతో పాటు డిసెంబర్ వరకు నిర్ధేశించుకున్న టార్గెట్లు, నెలవారీ ఆదాయం తదితర వివరాలపై ఆరా తీశారు. దీంతో పాటు ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు ఆదాయం పెంపునకు ఎలాంటి వ్యూహాలను అనుసరించాలన్న దానిపై దృష్టి సారించాలన్నారు. డిపోల వారీగా ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి నష్టాలను అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు ఆర్థిక పరిపుష్టి కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా చర్చించారు. సమీక్ష సమావేశానికి హాజరుకాని అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే వారు ఎంతటి స్థాయి అధికారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సంస్థ ఆర్థిక స్థితిని అవగతం చేసుకొని సంస్థ పురోగాభివృద్ధి కోసం అధికారులంతా తగిన కృషి చేయాలన్నారు. అధికారులు ఆ రకమైన ప్రయత్నాలు చేసినప్పుడు ఉత్తమ ఫలితాలు వస్తాయనే అభిప్రాయా న్ని వ్యక్తం చేశారు. ఆ దిశగా సంస్థలోని కిందిస్థాయి సిబ్బందిని మొదలుకొని ఉన్నత స్థాయి అధికారుల వరకు చొరవ చూపాలన్నారు. సంస్థ పురోగాభివృద్ధి కోసం టిక్కేటేతర ఆదాయాన్ని సమకూర్చుకోవ డం, ప్రత్యేక, అద్దె బస్సుల రాబడి పెంచుకునేందుకు ఉండే అవకాశాలపై దృష్టి సారించాలని సూచించారు. ఇందులో ప్రధానంగా ఎన్నికల సమయంతో పాటు ఇతరత్రా రోజుల్లో ప్రత్యేక సర్వీసుల ద్వారా ప్రయాణికులకు సేవలు అందిస్తూ రాబడిని పెంచుకునేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎం.రవీందర్, పురుషోత్తం, కొమురయ్య, వినోద్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమోఘంగా ఆర్ఆర్ఆర్

(మొదటిపేజీ తరువాయి)

కొంతమేర నెమ్మదించినా ప్రస్తుతం భూ సేకరణతో మళ్లీ వేగం పుంజుకుంది. హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల పట్టణాలను కూడా అభివృద్ధిలోకి తీసుకెళ్లాలన్న ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం రీజనల్ రింగ్ రోడ్డును నిర్మించాలన్న ప్రతిపాదనను తెరమీదకు తీసుకొచ్చారని, అందులో భాగంగానే ప్రభుత్వం దీనికి రూపకల్పన చేసినట్టు అధికారులు పేర్కొంటున్నారు. దీనివలన రియల్ జోరు పెరగడంతో పాటు స్థానికంగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయన్న ఆలోచనతో ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను అప్పట్లో ఓకే చెప్పినట్టు తెలిసింది. కెసిఆర్ సిఎం కాగానే రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో ఆర్థిక వికేంద్రీకరణ జరగాల్సిన ఆవశ్యకతను గుర్తించారు.

హైదరాబాద్ చుట్టూ 50 నుంచి 100 కి.మీ రేడియేషన్ పరిధిలోని...

హైదరాబాద్ చుట్టూ 50 నుంచి 100 కి.మీ వ్యాసం పరిధిలోని ద్వితీయ శ్రేణి పట్టణాలు, జాతీయ రహదారులను కలుపుతూ ఆర్ఆర్ఆర్‌ను నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఔటర్ రింగ్‌రోడ్డును తలదన్నేలా ఈ నిర్మాణం ఉండాలని, దీంతోపాటు స్థానికంగా ఉద్యోగ అవకాశాలు పెరగాలని సిఎం కెసిఆర్ ఇప్పటికే అధికారులకు సూచించినట్టు తెలిసింది. ఆ దిశగానే ఆర్ఆర్ఆర్‌ను నిర్మించాలని అధికారులు ప్రణాళికలు రూపొందించినట్టు తెలిసింది. మొత్తంగా మూడేళ్ల వ్యవధిలో దీనిని పూర్తి చేయాలన్న లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయనున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నిర్మాణానికి అంచనా వ్యయం కింద మొత్తం రూ.12 వేల కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం ఒక అంచనాకు వచ్చింది. అందులో 70 కిలోమీటర్ల దూరానికి అయ్యే వ్యయాన్ని రాష్ట్రం ప్రభుత్వం భరించనుండగా 268 కిలోమీటర్లకు అయ్యే వ్యయాన్ని కేంద్రం భరించనున్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్మించడంతో వాహనదారుల నుంచి టోల్ ఫీజును వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. రీజనల్ రింగ్ రోడ్డును మాత్రం జాతీయ రహదారుల సంస్థ నిర్మించనుండడంతో వాహనదారులకు టోల్ ఫీజు భారం ఉండదని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో కంది, షాద్‌నగర్‌లో నాలుగు వరసల రహదారి నిర్మాణం జరుగుతుంది. ఈ పరిధి కూడా ఆర్ఆర్ఆర్ పరిధిలోకి రానున్నట్టు అధికారులు తెలిపారు.

17 చోట్ల రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారులను కలుపుతూ...

ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి 11 వేల ఎకరాల భూమి అవసరం అవుతుందని అధికారులు ఒక అంచనాకు వచ్చారు. 17 చోట్ల రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారులను కలుపుతూ రీజనల్ రింగ్‌రోడ్డును నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నిర్మాణం వలన 12 పట్టణాలు, 125కు పైగా గ్రామాలకు మహర్దశ పట్టనుంది. వరంగల్, ముంబై, విజయవాడ, నాగపూర్, బెంగళూరు హైవేలను కలుపుతూ ఈ నిర్మాణం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనివలన వాహనాలు ఔటర్ రింగ్ రోడ్డు వరకు వెళ్లకుండా తమ గమ్యస్థానాలకు వెళ్లేలా ఆర్ఆర్ఆర్‌ను నిర్మించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. రీజనల్ రింగ్ రోడ్డు ప్రారంభం అయితే ఔటర్ రింగ్ రోడ్డుపై ఏర్పాటు చేసిన టోల్‌గేట్లపై ప్రభావం పడనుంది. 12 ఏళ్ల నిర్మాణ అనంతరం 158. కి.మీల ఔటర్ రింగ్‌రోడ్డు పూర్తి స్థాయిలో ఐదు నెలల క్రితం అందుబాటులోకి వచ్చింది. రానున్న మూడేళ్లలో 338 కిలోమీటర్ల మేర రీజనల్ రింగ్‌రోడ్డు పూర్తి చేసి వాహనదారులకు మరింత సౌకర్యవంతంగా ప్రయాణం అందించాలన్న ఆలోచనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కసరత్తు చేస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

మోడీ మాటల మర్మమేమిటో!

బీదర్ (కర్నాటక) : ఆడవారి మాటలకు అర్థాలే వేరులే..అంటూ ఎప్పుడో రాసాడో కవి. కాని, ఒక్కోసారి మగవారి మాటలకు కూడా అర్థాలు వెతుక్కోవాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. ఇంతకీ ఎందుకీ ఉపోద్ఘాతమంటే...ప్రధాని నరేంద్ర మోడీ ఒక్కోసారి చేసే వ్యాఖ్యలు అందరినీ గందరగోళంలోకి నెట్టేస్తుంటాయి. ఆయన పొగుడుతున్నారా లేక తెగుడుతున్నారా తెలియక అయోమయంలో చిక్కుకుంటుంటారు కొందరు. ఇలాంటి పరిస్థితే జెడిఎస్‌కు చెందిన జిల్లా మంత్రి బండెప్ప కాషెంపూర్‌కు బుధవారం ఎదురైంది. బుధవారం మహారాష్ట్రలోని సోలాపూర్‌కు వెళుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఇక్కడి ఐఎఎఫ్ విమానాశ్రయంలో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా ప్రధానికి స్వాగతం చెప్పేందుకు బండెప్ప వచ్చారు. తనను తాను జెడిఎస్ మంత్రిగా ఆయన పరిచయం చేసుకున్నారు. వెంటనే మాజీ ప్రధాని దేవెగౌడ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న మోడీ "నా బెస్ట్ ఫ్రెండ్(కుమారస్వామి) ఎలా ఉన్నాడు?" అంటూ ప్రశ్నించారు. దీంతో బిత్తరపోయిన బండెప్ప ఆ బెస్ట్ ఫ్రెండ్ ఎవరో అర్థం కాక బాగానే ఉన్నారంటూ తలవూపి అక్కడి నుంచి బయటపడ్డారు. ఇంతకీ బిజెపిని దెబ్బకొట్టేందుకు కాంగ్రెస్‌తో చేతులు కలిపి కర్నాటకలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కుమారస్వామి మోడీకి "బెస్ట్ ఫ్రెండ్" ఎలా అయ్యారబ్బా!

అయ్యప్ప భక్తుడిని చంపిన ఏనుగు

కోచ్చి : అయ్యప్ప దర్శనానికి వెళుతున్న ఒక భక్తుడిని ఒక అడవి ఏనుగు తొక్కి చంపేసింది. ఈ విషాద సంఘటన గురువారం తెల్లవారుజామున ఒంటి గంట ప్రాంతంలో ఎరుమేలి, పంబ మధ్య జరిగింది. మృతుడిని తమిళనాడులోని సేలంకు చెందిన 35 ఏళ్ల పరమశివంగా గుర్తించారు. తన ఏడేళ్ల కుమారుడు, మరో 13 మంది భక్తులతో కలసి పరమశివం అయ్యప్ప దర్శనం కోసం వెళుతుండగా మార్గంమధ్యలో అటవీ మార్గంలో ఏనుగు అతనిపై దాడి చేసి తొక్కి చంపింది.

గిన్నెస్ వైపు కాళేశ్వరం

(మొదటిపేజీ తరువాయి)

వేల ఘనపు మీటర్ల కాంక్రీటు పనులు అని అనుకుంటున్నాం. కానీ ఎల్ అండ్ టి సంస్థ ఇంజినీర్లు మాత్రం పాతిక వేల ఘనపు మీటర్ల వరకు సాధించవచ్చు అనే ధీమాతో ఉన్నారు. వచ్చే వారంలో దీనిపై స్పష్టత వస్తుంది'' అని ఒక అధికారి వివరించారు. ఈ నెల చివరి వారంలో మాత్రం రికార్డు తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు ఇటీవల సృష్టించిన రికార్డు గురించి ఆ అధికారి ప్రస్తావిస్తూ, అది ప్లెయిన్ సిమెంట్ కాంక్రీటు పనులకు వచ్చిన గుర్తింపు అని, కానీ కాళేశ్వరం ప్రాజెక్టు సృష్టించిన రికార్డులుగానీ, ఇకపైన సృష్టించబోయే రికార్డుగానీ 'రీ ఇన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్' (ఆర్‌సిసి) పనులకు సంబంధించినది అని వివరించారు. ఈ రికార్డు సృష్టించాలంటే కనీసంగా పది రోజుల ముందు నుంచే కసరత్తు ప్రారంభం కావాల్సి ఉంటుందని, కాంక్రీటును కలిపే యంత్రాలు, బూమ్ ప్లేసర్లు, ఇంజనీర్లు, సిబ్బంది, కార్మికులతో పాటు సిమెంటు, కంకర, స్టీలు తదితరాలన్నీ కూడా ఆ ప్రాంతానికి చేరాల్సి ఉంటుందని ప్రాజెక్టు వ్యవహారాలు చూస్తున్న ఇంజనీర్ ఒకరు వ్యాఖ్యానించారు. గత నెల మూడవ వారంలో సాధించిన రికార్డుకు అవసరమైన ఏర్పాట్లను పరిగణనలోకి తీసుకుని దానికంటే ఎక్కువ మొత్తంలో ఈసారి తరలించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

గిన్నెస్ ప్రతినిధుల సమక్షంలో పనులు

గత నెల 22 నుంచి జరిగిన 24 గంటల సిమెంటు కాంక్రీటు పనుల్లో 1.21 లక్షల బస్తాల సిమెంటు (6238 టన్నులు)ను, 1,070 టన్నుల స్టీల్ (ఇనుము)ను, 15,384 ఘనపు మీటర్ల కంకరను వినియోగించి 16,722 ఘనపు మీటర్ల సిమెంటు కాంక్రీటుతో పనులు పూర్తయ్యాయి. ఇందుకోసం ఇరవై బూమ్ ప్లేసర్లను, 120 ట్రాన్సిట్ మిల్లర్లను, 8 కాంక్రీట్ బ్యాచింగ్ ప్లాంట్లను ఇంజనీర్లు వినియోగించారు. దీనికి తోడు ఇంజనీర్లు, స్కిల్డ్ వర్కర్లతో కలిపి మొత్తం 4824 మంది కార్మికులు పనిచేశారు. సగటున ప్రతీ గంటకు 870 ఘనపు మీటర్ల చొప్పున సిమెంటు కాంక్రీటు పనులు పూర్తయ్యియి. ఈ నెల చివరి వారంలో లక్ష్యాన్ని పాతికవేల ఘనపు మీటర్లుగా నిర్దేశించుకున్నందు వల్ల కనీసంగా 8,800 టన్నుల సిమెంటును, 22 వేల ఘనపు మీటర్ల కంకర, 1600 టన్నుల మేర ఇనుమును వాడడంతో పాటు యంత్ర సామాగ్రిని కూడా అదనపు సంఖ్యలోనే సమకూర్చుకోవాల్సి ఉంటుంది. కార్మికుల సంఖ్య కూడా పెరగాల్సి ఉంటుంది.

వివిధ ప్రాంతాల్లో ఉన్న యంత్ర సామాగ్రిని అక్కడికి తరలించడంతోపాటు కాంక్రీటుకు అవసరమైన ముడి పదార్థాలను కూడా తరలించే పని ప్రారంభమైంది. ప్రతీ మూడు గంటలకు ఒకసారి చొప్పున మొత్తం ఎనిమిది దశల్లో కాంక్రీటు పనుల్లో సాధించిన ప్రగతిని గిన్నెస్ రికార్డు సంస్థ ప్రతినిధులు విశ్లేషిస్తారు. మొత్తం 24 గంటల వ్యవధిలో సాధ్యమైన పనిని లెక్కిస్తారు. ఇటీవల పోలవరం ప్రాజెక్టులో 24 గంటల వ్యవధిలో 31,800 ఘనపు మీటర్ల రికార్డు 'ప్లెయిన్ కాంక్రీటు' విభాగంలో లభించినదికాగా, కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో మాత్రం అది 'రీ ఇన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్' విభాగానికి చెందినది. కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ ఎన్. వెంకటేశ్వరరావు, ఎస్‌ఇ సుధాకరరెడ్డిలతో పాటు ఎల్ అండ్ టి ప్రతినిధులు సమన్వయంతో ఈ నెలాఖరు పనుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.



శ్రీవారి సేవలో డిజిపి మహేందర్ రెడ్డి

మన తెలంగాణ /తిరుమల ప్రతినిధి : తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని గురువారం పలువురు వీఐపీలు ప్రముఖులు దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర డిజిపి మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ మంతెన వెంకట సత్యనారాయణ, నగిరి ఎమ్మెల్యే, వైసిపి నాయకురాలు ఆర్ కే రోజా, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రెగ్యులారిటీ కమిషన్ చైర్మన్ జస్టిస్ భవానీ ప్రసాద్ తదితరులు స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులలో ఉన్నారు. వీరందరూ గురువారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనం సమయంలో శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. టిటిడి తిరుమల జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.ఎస్.శ్రీనివాసరాజు వీఐపీలకు సాదర స్వాగతం పలికి దర్శనం వసతి ఏర్పాట్లు చేపట్టారు. ఆలయంలోని రంగనాయకుల మండపంలో స్వామి వారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాలను వీఐపీలకు అందించి వేదపండితుల ఆశీర్వచనాలు అందించారు.

ఎసిబి వలలో పరిశ్రమల శాఖ అధికారి



మనతెలంగాణ/మహబూబాబాద్ ప్రతినిధి : ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, చిన్నతరహా పరిశ్రమలు స్థాపించి వెనుకబడిన తరగతుల ఆర్థిక స్వావలంభనకు కృషి చేస్తుంటే మరో ప్రక్క ఉన్నతాధికారులు లంచావతారమెత్తి జేబులు నింపుకునే పనిలో ఉన్నారు. నిరుద్యోగుల నుంచి నిలువు దోపిడి చేస్తున్నారు. గురువారం జిల్లా పరిశ్రమల అధికారి వీరేశం రూ.10వేలు లంచం తీసుకుంటూ ఏసిబికి చిక్కడంతో బండారం బయట పడింది. వివరాల్లోకి వెళితే మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలానికి చెందిన దరావత్ భగ్నానాయక్ 2017లో ఐటిడిఏ ద్వారా రూ.16లక్షల 96వేల 171 రూపాయలతో వరికోత మిషన్‌కు సంబంధించిన గ్రాంట్ రూ.5,93,171 మంజూరు కాగా దానికి సంబంధించిన చెక్కు లబ్దిదారుడు భగ్నానాయక్‌కు ఇచ్చేందుకు జిల్లా పరిశ్రమల అధికారి వీరేశం రూ12వేలు లంచం అడిగారు. దీంతో అబ్దిదారులు అంత మొత్తం ఇవ్వలేక ఎసిబిని ఆశ్రయించడంతో గురువారం ఎసిబి బృందం వీరేశంను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరేశం బయ్యారం మండల ప్రత్యేక అధికారిగా కూడా కొనసాగుతున్నారు.

సుప్రీంకోర్టు తీర్పు ప్రధానికి చెంప పెట్టు

మనతెలంగాణ/హైదరాబాద్ : సిబిఐ డైరెక్టర్ అలోక్‌వర్మ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రధాని నరేంద్రమోదీకి చెంపపెట్టు లాంటిదని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాయణ విమర్శించారు. మోదీ నేరుగా సిబిఐ సంస్థలోకి ప్రవేశించి తనకు అనుకూలంగా ఉన్న వారిని తీసుకొచ్చి పెట్టుకున్నారని, అందులో భాగంగానే అవినీతి అధికారిని తీసుకొచ్చారని ఆయన వ్యాఖ్యానించారు. సిబిఐపై సిబిఐనే దాడులు చేసుకునే పరిస్థితి ఏర్పడిందంటూ నారాయణ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. సిబిఐలో ఏర్పడిన సంక్షోభంతో ఆ సంస్థ అప్రతిష్ట పాలయ్యిందన్నారు. దీనికి కారణమైన ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

క్యాడర్ బలోపేతానికి సిపిఎం సిద్ధం

మన తెలంగాణ/హైదరాబాద్ : కింది స్థాయి నుంచి క్యాడర్‌ను చక్కదిద్దే విషయమై సిపిఎం పార్టీ కసరత్తు చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో బిఎల్‌ఎఫ్ పేరిట చేసిన ప్రయోగం విఫలం కావడంతో రానున్న పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలతో పాటు క్యాడర్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టింది. గత ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో సిపిఎం క్యాడర్ దెబ్బతిన్నట్టు పార్టీ గుర్తించింది. దీనికోసం తీసుకోవాల్సిన చర్యలపై ఆలోచిస్తోంది. కిందిస్థాయి నేతలు ప్రలోభాలకు గురయినట్టు పార్టీ గుర్తించింది. దీనికి సంబంధించిన నివేదిక పార్టీ తెప్పించుకుందని, రానున్న ఎన్నికల్లో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని పార్టీ గుర్తించినట్టు సమాచారం. పార్టీకి పట్టున్న నియోజకవర్గాల్లో కూడా ఆశించిన మేర ఓట్లు పడకపోవడంపై ముఖ్యంగా ఈ సమావేశంలో చర్చించినట్టు తెలిసింది. దీంతోపాటు పార్టీకి పట్టున్న జిల్లాల్లోని నాయకులు, కార్యకర్తల మధ్య ఉన్న అంతరాలను తుడిచిపెట్టాలని, గ్రామాల్లో రెండు వర్గాలు లేకుండా ఒకటే వర్గంలా క్యాడర్ పనిచేసేలా వారికి దిశానిర్దేశం చేయాలని ఇటీవల జరిగిన ఒక సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం. గతంలో మాదిరిగానే కార్యకర్తలకు పార్టీ తరపున శిక్షణ ఇవ్వాలని, ఈ శిక్షణా తరగతుల్లో రాష్ట్ర నాయకులు పాల్గొనాలని కూడా వారు నిర్ణయించినట్టు తెలిసింది. బహుజన లెఫ్ట్ పార్టీ (బిఎల్‌ఎఫ్), సిపిఎం పార్టీ కార్యకలాపాలు వేరుగా ఉండాలని, పంచాయతీ ఎన్నికల్లో బిఎల్‌ఎఫ్ తరపున అభ్యర్థులను పోటీలో నిలపాలన్న విషయమై కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చినట్టు సమాచారం.

ఆరు నెలల చిన్నారికి కాలేయ మార్పిడి

గ్లోబల్ ఆసుపత్రి వైద్యుల మరో ఘనత



మన తెలంగాణ/ హైదరాబాద్ : ఆరు నెలల వయస్సు పాపకు కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి గ్లోబల్ ఆసుపత్రి మరో చరిత్ర సృష్టించింది. దేశంలోనే అరుదైన ఈ చికిత్సను హైదరాబాద్‌లోని గ్లెనిగల్స్ గ్లోబల్ ఆస్పత్రి నిర్వహించింది. కాలేయ మార్పిడి జరిగిన పాప మైథిలి పూర్తిగా కోలుకొందని, అన్ని అవయవాలు సక్రమంగా పని చేస్తున్నాయని ఆమెకు శస్త్రచికిత్స నిర్వహించిన డాక్టర్ల బృందం, ఆసుపత్రి యాజమాన్యం గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. స్థానిక సంజీవరెడ్డి నగర్‌లో నివాసముంటున్న దంపతులకు జూన్ నెలలో జన్మించిన మైథిలికి ప్రతిరోజూ ఫిట్స్ రావడం, కనుచూపు మందగించడం, వినికిడి లోపం వంటి సమస్యలు తలెత్తాయి. శరీరం నీలం రంగుకు మారుతూ తీవ్ర ఇబ్బందులకు గురవటం చూసి హైదరాబాదులోని పిల్లల ప్రత్యేక హాస్పటల్లో వైద్యుల్ని సంప్రదించారు. రక్తంలో ఎమైనో ఆమ్లాలు పరిమితికి మించి ఉత్పత్తవటం వల్ల పాప అనారోగ్యానికి గురవుతుందని గుర్తించారు. కాలేయంలో ఎంజైమ్ లోపం ఉందని, కాలేయ మార్పిడీ శస్త్రచికిత్స ద్వారా అరికట్టవచ్చని తల్లిదండ్రులకు వివరించారు. గ్లెనిగల్స్ గ్లోబల్ ఆస్పత్రి వైద్య బృందం పది గంటలపాటు శ్రమించి శస్త్రచికిత్స నిర్వహించారు. తల్లినుంచి సేకరించినకాలేయాన్ని పాపకు మార్పిడీ చేయటంలో వైద్యులు విజయం సాదించారు. అతక్కువ వయస్సు బాలికకు కాలేయ మార్పిడి శస్త్రచికిత్సను తమ బృందం చాలెంజిగా తీసుకొని విజయంసాదించిందని ఆసుపత్రి గ్రూప్ చైర్మన్ డాక్టరు కె. రవీంద్రనాద్ వెల్లడించారు.గత 15 ఏళ్లలో 20మంది చిన్నారులకు కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు చేసినా, ఇది అరుదైందని చెప్పారు. బృందంలో పాల్గొన్న వైద్యులను ఆయన అభినందించారు. కాలేయ మార్పిడి తర్వాత మైథిలి పూర్తిగా కోలుకొందని, రాబోయే రోజుల్లో పాప ఎదుగుదలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని బృందానికి సారధ్యం వహించిన డాక్టరు బల్బీర్ వివరించారు. సమావేశంలో ఆసుపత్రి వైద్యులు డాక్టరు ప్రశాంత్ బచిన, డాక్టరు రవిచంద్ర రాయ, డాక్టరు గోపీకృష్ణలు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా మానేరు

● ఐలాండ్‌లో రూ. 5కోట్లతో 25 కాటేజ్‌లు, రెస్టారెంట్‌లు, పార్కులు ● కెసిఆర్ ఐలాండ్‌గా నామకరణం ● కరీంనగర్ ఎంఎల్‌ఎ గంగుల కమలాకర్





తెలంగాణ/కరీంనగర్‌టౌన్ : కరీంనగర్ శివారులోని మానేరు ఎగువ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దుతామని కరీంనగర్ శాసన సభ్యులు గంగుల కమలాకర్ అన్నారు. గురువారం కరీంనగర్ డ్యామ్ మధ్యలో ఉన్న గుట్ట ప్రాంతాన్ని ఎంఎల్‌ఎ సందర్శించారు. గుట్ట ప్రాంతాన్ని పర్యటకంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ తెలంగాణలోనే జిల్లా కేంద్రానికి అనుకుని ఉన్న ఏకైక రిజర్వాయర్ ఎల్‌ఎండి అని అన్నారు. కరీంనగర్ శివారులోని లోయర్ మానేరు తీర ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. డ్యాం మధ్యప్రాంతంలో ఉన్న ఐలాండ్ ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రుపొందిస్తున్నామని తెలిపారు. ఇతర రాష్ట్రాల పర్యాటక ప్రాంతాలకు ధీటుగా మానేరు ఐలాండ్‌ను తీర్చిదిద్దుతామన్నారు. ఐలాండ్ తోపాటు రోప్ వే, రెస్టారెంట్లు, కాటేజీ, పార్కులతో అత్యాధునికంగా మార్చుతామన్నారు. అనంతరం బోటింగ్ చేస్తూ సరదాగా గడపారు. అనేక వనరులున్న కరీంనగరాన్ని గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రామప్ప, లక్నవరం లాంటి పర్యాటక ప్రాంతాలకు ధీటుగా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నామ న్నారు. మానేరు రివర్ ఫ్రంట్ తో పాటు కేబుల్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నామని, కరీంనగర్‌కు మానేరు ప్రాంతం ఆస్థిగా మారనుందని చెపారు. మానేరు డ్యాం మధ్యలో ఉన్న ఐలాండ్ చుట్టూ నిత్యం నీరు ఉంటుందని చెప్పారు. దీనికి సిఎం కెసిఆర్ ఐలాండ్‌గా నామకరణం చేసామన్నారు. దాదాపు 15 ఎకరాల ఈ ఐలాండ్‌ను ప్రణాళిక ద్వారా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఈ ఐలాండ్ చుట్టు 25 కాటేజ్ లు, రెస్టారెంట్ కోట్లతో ప్రణాళికలు రూపొందించి సిఎంకి ప్రతిపాదనలు పంపుతామన్నారు. ఈ ఐలాండ్‌కు రావాలంటే కేవలం బోట్, జెట్ స్కీ, క్రూస్‌లలో మాత్రమే రాగలమని చెప్పారు. గన్నేరు వరం గుట్టకు ఈ ఐలాండ్ కు మధ్య ఓ కేబుల్ బ్రిడ్జి కానీ, రోప్ వే ప్లాన్ చేస్తామని చెప్పారు. జిల్లా ప్రజలు శుభకార్యక్రమాలు చేసుకునేందుకు జెట్టీని కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. పర్యాటక ప్రాంతాలైన రామప్ప, లక్నవరం, విజయవాడ, నాగార్జున సాగర్, వైజాగ్ వెళ్తుంటామే తప్ప పక్కనే ఉన్న కరీంనగర్ మానేరు నది తీరాన్ని అభివృద్ది చేసుకోలేక పోయామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి మేయర్ రమేష్, కార్పొరేటర్లు సునీల్ రావు, బోనాల శ్రీకాంత్, ఏవీ రమణ, చొప్పరి జయశ్రీ, టీఆర్‌ఎస్ నేతలు చల్లా హరిశంకర్, నందెల్లి మహిపాల్, ప్రేమ్ కుమార్ ముందాడా టీఆర్‌ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జైళ్లలో మరిన్ని సంస్కరణలు



మనతెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ జైళ్లలో మరిన్ని సంస్కరణలు చేపట్టి దేశవ్యాప్తంగా రాష్ట్రానికి ఖ్యాతి తీసుకొస్తామని జైళ్ల శాఖ డిజి వి.కె సింగ్ పేర్కొన్నారు. జైళ్ల శాఖలో చేపట్టిన సంస్కరణలు, పనితీరును వివరిస్తూ గురువారం తన కార్యాలయంలో 2018 వార్షిక నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా డిజి వి.కె సింగ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని జైళ్లలో అవలంభిస్తున్న విధానాలను అధ్యయనం చేయడానికి అమెరికా, శ్రీలంక దేశాల ప్రతినిధులు రాష్ట్ర జైళ్ల శాఖ చేపడుతున్న విధివిధానాలను ప్రశంసించారన్నారు. ఖైదీల ఆరోగ్యానికి సంబంధించి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, ఈక్రమంలో 2014లో 56మంది ఖైదీలు మృతి చెందగా, 2018లో కేవలం 8 మంది మాత్రమే వివిధ అనారోగ్యాల కారణంగా మృతి చెందారని వివరించారు. అదేవిధంగా 2013లో జైళ్లశాఖ నుంచి 1.5కోట్లు మాత్రమే ఆదాయం వచ్చిందని 2018లో పెట్రోల్ పంపుల నిర్వహణ తదితర వాటి నుంచి ఆదాయం రూ.17 కోట్లకు పెరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని జైళ్లలో అటు ఉగ్రవాదులు, ఇటు మావోయిస్టులతోపాటు 299 మంది పిడియాక్ట్ ఖైదీలున్నప్పటికీ ఏలాంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. జైలు శిక్షలు అనుభవించి విడుదలైన వారిపై నిఘా కోసం 32 బృందాలను ఏర్పాటు చేశామని, జైళ్లశాఖలో మార్పు కోసం బిపిఅరెండి నిర్వహిస్తున్నామని, ఇది కేవలం తెలంగాణ రాష్ట్రమే కాకుండా దేశంలోని అన్ని ప్రాంతాలలో రావలని ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర జైళ్లలో 60 ఏళ్లు దాటి వయోభారంతో ఉన్న మహిళా ఖైదీలకు నిద్రించేందుకు మంచాలను 2019 నుంచి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని జైళ్ల శాఖ పనితీరుపై 5వేల మందితో అభిప్రాయ సేకరణ జరిపించగా కేవలం 77 మంది మాత్రమే వసతుల ఏర్పాటుపై వ్యతిరేకత తెలిపారన్నారు.అంతేకాకుండా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నల్సార్ యూనివర్సిటీకి జైళ్లశాఖ చేసిన పనిపై సర్వే నిర్వహించగా తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖకు ఇతర రాష్ట్రాలకు ఆదర్శవంతంగా పనిచేస్తున్నాయని సర్వే ఫలితాలు వెల్లడించాయన్నారు. రాష్ట్ర జైలుశాఖ ఉద్యోగులకు సినియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించామన్నారు. రాష్ట్రంలోని వివిధ జైళ్లలో క్షమాభిక్షకు అర్హులైన వారి జాబితాను గవర్నర్‌కి పంపించామని, అక్కడి నుంచి ఇప్పటి వరకు ఏలాంటి సమాధానం రాలేదని తెలిపారు. గత ఏడాది డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 12వేల మంది జైలు శిక్ష అనుభవించారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ జైళ్లలోని ఖైదీలకు ఉదయాన్ని అల్పాహారం(టిఫిన్) అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని జైళ్లలో 7133 మంది ఖైదీల ఉంచే కెపాసిటి ఉందని తెలిపారు. రాష్ట్రంలో జైళ్ల శాఖ ఆధ్వర్యంలో 247 పెట్రోల్ పంప్స్ ఉన్నాయని, అలాగే ఆయుర్వేద గ్రామాలు 15 ఉన్నట్లు తెలిపారు. జైళ్ల శాఖ నిర్వహిస్తున్న ఆనాధాశ్రమంలో 7వేల మంది పురుషులు, 4,500మంది మహిళలు ఉన్నారని తెలిపారు. జైళ్లశాఖను సమర్థవంతంగా ముందుకు తీసుకుపోయేందుకు తాము 9 అంశాలను ఎంచుకున్నామని, వాటిని అమలు చేస్తూ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శవంతంగా మారేందుకు యత్నిస్తున్నామని తెలిపారు. ఆనంద నిలయంలో 275 మంది యాచకులకు ఆశ్రయం కల్పించామని పేర్కొన్నారు. 1,32 వేల మందిని డిగ్రీ ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 2018 వార్షిక నివేదిక విడుదల కార్యక్రమంలో జైలు సూపరింటెండెట్‌లతో పాటు జైలు సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నాప్ ఓ కట్టుకథ

కొడంగల్ పోలీసుల అదుపులో సర్పంచ్ అభ్యర్థి



మన తెలంగాణ/కొడంగల్/కొడంగల్ రూరల్ : వికారాబాద్ జిల్లా, కొడంగల్ మండలంలో సర్పంచ్ అభ్యర్థి కిడ్నాప్ అంశం సుఖాంతమైంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన సదరు బాధితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే కిడ్నాప్ ఓ కట్టుకథగా అనుమానిస్తున్నారు. కొడంగల్ మండలం, నీటూరు గ్రామానికి చెందిన విశ్వనాథం మంగళవారం రాత్రి కిడ్నాప్‌కు గురైన సంఘటన పాఠకులకు తెలిసిందే. కాంగ్రెస్ పార్టీకి చెందిన విశ్వనాథం సర్పంచ్ పదవికి నామినేషన్ వేసేందుకు సిద్ధంగా ఉన్న తరుణంలో కిడ్నాప్ సంఘటన చోటు చేసుకుంది. డిఎస్పీ రవీంద్రారెడ్డి ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకుని దర్యాప్తు వేగవంతం చేశారు. బుధవారం రాత్రే మండలంలోని అంగడిరాయిచూర్ వద్ద ఆయన ఆచూకీ కనుగొన్నారు. రాత్రికి రాత్రే అతన్ని అదుపులోకి తీసుకుని కొడంగల్ ఠాణాకు తరలించారు. దీనిపై వివరాలు తెలుసుకునేందుకు పోలీసులను ఆశ్రయించగా విశ్వనాథం ఆచూకీ లభ్యమైందని, అతను ప్రస్తుతం తమ అదుపులో ఉన్నారని కొడంగల్ పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు శుక్రవారం డిఎస్పీ సమక్షంలో వెల్లడిస్తామని చెప్పారు. ఈ విషయమై బాధితునితో మీడియా ప్రతినిధులు ఆరా తీయగా తనను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని తెలిపారు. మంగళవారం రాత్రి ఇంటి ముందుకు కుక్కలు అరుస్తుండగా తాను బయటకు రాగా నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు తనను బలవంతంగా గుర్తు తెలియని వాహనంలో తీసుకువెళ్లిన వ్యక్తులు రాత్రి అంగడి రాయచూరు శివార్లలో వదిలేశారని విశ్వనాథం వివరించారు. ఆయన పొంతనలేని సమాధానాలు చూస్తుంటే కిడ్నాప్ ఓ కట్టుకథగా అనుమానిస్తున్నారు. 24 గంటల వ్యవధిలోనే పోలీసులు ఛేదించడం గమనార్హం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బూత్‌స్థాయి నుంచి పార్టీ పటిష్టం: పొన్నం

మన తెలంగాణ/న్యూఢిల్లీ, హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా రానున్న పార్లమెంటు ఎన్నికల్లో విజయం కోసం బూత్‌స్థాయి వరకు పార్టీని పటిష్టం చేస్తామని తెలంగాణ పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. అన్ని రాష్ట్రాల పిసిసి అధ్యక్షులతో ఢిల్లీలోని వార్ రూమ్‌లో గురువారం ఉదయం మొదలు సాయ ంత్రం వరకు జరిగిన చర్చల్లో రానున్న పార్లమెంటరీ ఎన్నికలపై చర్చించినట్లు పొన్నం వివరించారు. చర్చల అనంతరం పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుతం దేశవ్యాప్తంగా బిజెపికి వ్యతిరేక పవనాలు బలంగా వీస్తున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా పిసిసి నేతలు దృష్టి సారించాల్సిందిగా కోర్‌కమిటీ సభ్యులు తమకు వివరించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రతీ లోక్‌సభ సెగ్మెంట్‌ను పార్టీ నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయం కోసం పనిచేయాలని కోర్ కమిటీ సూచించిందని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్న అభ్యర్థుల వివరాలతో పాటు ప్రత్యర్థి పార్టీల బలాబలాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, అందుకు తగిన రీతిలో రాజకీయ వ్యూహాలను అమలు చేయాలని వివరించిందని, కేంద్రంలోని మోదీ సర్కార్ తీసుకుంటున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలతో పాటు బిజెపి పాలిత రాష్ట్రంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి, వాటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమిపై గాంధీభవన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన సమీక్షా సమావేశానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని కోర్ కమిటీ నేతలకు నారాయణరెడ్డి అందజేసినట్లు తెలిసింది.

కొండగట్టుపై ప్రమాదాలకు చెక్!

● మూలమలుపు వద్ద కొరియన్ టెక్నాలజీతో రక్షణ గోడ
● రేడియం స్టిక్కర్లతో కూడిన 73 హెచ్చరిక బోర్డులు
● ఆధునిక టెక్నాలజీతో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు
● భక్తులు కొండపైకి వెళ్లేందుకు మినీ బస్సులు





మనతెలంగాణ/మల్యాల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఘాట్ రోడ్డుపై ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సెప్టెంబర్ 11న ఘాట్ రోడ్డులోని ప్రమాదకరమైన మూలమలుపు వద్ద ఆర్‌టిసి బస్సు అదుపు తప్పి లోయలో పడగా 65 మంది మృత్యువాతపడ్డారు. మరో 50 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. బస్సు ప్రమాదంలో పెద్దసంఖ్యలో ప్రయాణీకులు మృత్యువాత పడటం దేశంలోనే ఇదే ప్రథమం కావడంతో తెలంగాణ ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. ప్రమాదానికి గల కారణాలు... ఘాట్ రోడ్డు తీరును పరిశీలించేందుకు రోడ్డు భద్రతా డిజితో పాటు వివిధ శాఖల అధికారులను అప్రమత్తం చేసింది. ప్రమాద సంఘటనపై పూర్తి స్థాయి నివేదిక అందజేయడంతో పాటు భవిష్యత్తులో ఘాట్ రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలకు ఉపక్రమించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పలుమార్లు రోడ్డు భద్రతా డిజి కృష్ణప్రసాద్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్ ఘాట్ రోడ్డును పరిశీలించి చర్యలు చేపట్టారు. ప్రమాదం జరగగానే ఘాట్ రోడ్డు మీదుగా వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. కొండగట్టుపైన చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘాను తీవ్రతరం చేశారు. బస్సు లోయలో పడ్డ మూలమలుపు వద్ద గతంలో పలు ప్రమాదాలు చోటు చేసుకుని పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయిన దృష్ట్యా ఆ ప్రాంతంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రక్షణ గోడ నిర్మించడంతో పాటు వాహనాల వేగాన్ని నియంత్రించేలా స్పీడు బ్రేకర్లు, భారీ వాహనాలు ఘాట్ రోడ్డు మీదుగా రాకపోకలను నియంత్రించేందుకు రోడ్డుకు అడ్డంగా బారీకేడ్లు నిర్మించాలని రోడ్డు భద్రతా అధికారులు సూచించారు. అలాగే ఘాట్ రోడ్డుపై ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో పుణేలోని ఆడోర్ నుంచి ప్రత్యేక నిపుణులు వచ్చి కొండగట్టు ఘాట్ రోడ్డును, ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదాలను అరికట్టేందుకు కొరియన్ టెక్నాలజీతో ఆస్ట్రేలియా, యుఎస్‌ఎ, థాయ్‌లాండ్, మలేషియా దేశాల్లో నిర్మించిన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రక్షణ గోడను ప్రమాదం జరిగిన మూలమలుపు వద్ద 40 మీటర్ల మేర నిర్మించారు. ఈ గోడ నిర్మా ణం వల్ల వాహనాలు ప్రమాదాలకు గురైనప్పుడు వాహనం నుంచి కెనెటిక్ ఎనర్జిని రొటెస్ట్ ఎనర్జీగా తయారు చేయబడుతుందని, 120 కిలో మీటర్ల వేగంలో వచ్చిన 15 టన్నుల వాహనమైనా ప్రమాదానికి గురైతే వాహనం స్వల్పంగా దెబ్బతింటుం దే తప్పా ప్రాణ నష్టం జరగకుండా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే ఘాట్ రోడ్డుపై రేడియం స్టికర్లతో కూడిన 73 ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పా టు చేశారు. రోడ్డు చివరలో రేడియం పేయింట్ వేయడంతో పాటు పెద్ద వాహనాలు కొండపైకి ఘాట్ రోడ్డు మీదుగా వెళ్ళకుండా కొండ కింద, కొండపైన రోడ్డుకు అడ్డంగా స్టీల్ ఫ్రేమ్ ఏర్పాటు చేశారు. వాహనాలను కంట్రోల్ చేయడానికి భూమ్ బ్యారియర్ కూడా ఏర్పాటు చేశారు. ఘాట్ రోడ్డులో ప్రమాదాల నివారణకు అధికారులు పూర్తి చర్యలు చేపట్టడంతో కొండ మీదికి ఘాట్ రోడ్డు గుండా లైట్ మోటార్ వెహికిల్స్, ద్విచక్ర వాహనాలు వెళ్తున్నాయి. స్వామి వారిని దర్శించుకునేందుకు కొండపైకి వెళ్లే భక్తులకు రెండు మినీ బస్సులు ఏర్పాటు చేసి ఘాట్ రోడ్డు మీదుగా కాకుండా నాచుపెల్లి జెఎన్‌టియు మీదుగా భక్తులను కొండపైకి చేరుస్తున్నారు. కొండపైన చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు వాహనదారులకు అధికారులు సూచనలు చేస్తున్నారు.

సమస్యల్లో ఎంజిఎం.. అవస్థల్లో రోగులు

• ప్రధాన విభాగాల రోగులకు వైద్యులు కరువు • రిపేర్లలో డయాగ్నస్టిక్ మిషన్లు • పడిగాపులతో కిక్కిరిస్తున్న రోగులు • ప్రభుత్వ ఉదాసీనత, నిర్లక్ష్యం పై విమర్శలు



మన తెలంగాణ/ వరంగల్ టౌన్ : ఉత్తర తెలంగాణలో రోగులకు ఏకైక పెద్ద దిక్కు,ఉమ్మడి కరీంనగర్, అదిలాబాద్,వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి ప్రతి రోజు వేలాది మంది రోగులు అనేక వ్యయ ప్రయాసాలకోర్చి ఇక్కడికి వస్తే నాణ్యమైన వైద్యం కరువవుతున్నది. అన్ని రోగాలకు డాక్టర్లు లేరు. కొన్ని విభాగాలకైతే డాక్టర్లు అసలే లేరు. లేని విభాగాలకు సమీప విభాగాలకు డిప్యూటేషన్ మీద పంపి వైద్యం అందిస్తున్నారు. కొన్ని చోట్ల డాక్టర్లు పరీక్షలు సూచిస్తే పరీక్షలు చేయించుకోవడానికి అక్కడ మిషన్లు రిపేర్లలో వున్నాయి. ఒకవైపు తీవ్రమైన వైద్యుల కొరత, మరోవైపు ఎక్కువ సంఖ్యలో రోగుల జనసమ్మర్థం తో వైద్యం చేయించుకోవాల్సిన రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దినదినం వైద్యరంగంలో వస్తున్న మార్పులు, ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుని రోగుల నిష్పత్తి కంటే కాస్త ఎక్కువగానైనా వైద్యసిబ్బందిని సమకూర్చుకుని సూపర్ స్పెషాలిటి హాస్పిటల్‌గా ఎదగాల్సిన ఎంజిఎం నానాటికి సమస్యల కొలిమిలో నలిగిపోతున్నది. దీనికంతటికి ప్రభుత్వ ఉదాసీనత, నిర్లక్ష్యధోరణే ప్రధాన కారణమని ఓ వైపు వైద్యులు, మరవైపు రోగులు, రోగి బంధువులు విమర్శిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

విభాగాల్లో వైద్యుల కొరత..

దీనిలోకి వచ్చే వివిధ రకాల రోగులకు చికిత్స అందించేందుకు సుమారు ఇరవై రెండు విభాగాలున్నాయి. వీటిలో ప్రధానంగా జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ,ఆర్థోపెడిక్, పిడియాట్రిక్, యూరాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, న్యూరోసర్జరీ తదితర విభాగాలకు మాత్రం ఎక్కువ సంఖ్యలో రోగులు వస్తున్నారు. కాని దీనిలో జనరల్ మెడిసిన్,జనరల్ సర్జన్, ఆర్థోలకు మాత్రమే చెప్పుకోతగ్గ వెద్యసిబ్బంది ఉన్నారు. తక్కిన విభాగాల్లో వైద్యులు నామమాత్రంగానే వున్నారు. కొన్ని విభాగాల్లో ఆ విభాగాల వైద్యులు అసలే లేరు. వీటిలో యూరాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీలు వున్నాయి. అసలే ఈ విభాగాల రోగులకు వారంలో కేవలం రెండు రోజులు మాత్రమే నడుస్తున్నాయి. ఈ రోజులలో కూడా సంబంధిత వైద్యులు కాకుండా ఇతర విభాగాల డాక్టర్లు డ్యూటీలు చేస్తున్నారు. వీరు కూడా పిజి డాక్టర్లే కావడం గమనార్హం. దీంతో గత్యంతరం లేని పరిస్థితులలో రోగులు చూపించుకుంటున్నారు.

ఒకే ఒక్కడు..

రోగులకు అత్యవసర విభాగాల్లో ఒకటైన న్యూరోసర్జరీ విభాగంలో ఒకే ఒక్క వైద్యుడు అన్నీ తానై పనిచేస్తున్నాడు .న్యూరో సర్జరీ హెచ్ఓడి గా డాక్టర్ రాజమోహన్ తన సేవలందిస్తున్నాడు. సమీప ప్రాంతాల్లో యాక్సిడెంట్స్ కేసులు రేయింబవళ్లు వస్తున్నాయి.దీనిలో ఎక్కువ సంఖ్యలో న్యూరో విభాగానికి కూడా ఎక్కువ వస్తున్నాయి. కాని దీనికి ఈ డాక్టర్లు లేకపోవడంతో నైట్‌డ్యూటీలు కూడా ఈయనే చేయాల్సి వస్తున్నది. ఈయనకు జనరల్ సర్జరీ పిజి డాక్టర్లు సహకరిస్తున్నారు. దీనికి రోగుల తాకిడి రోజురోజుకు పెరుగుతుండటంతో ఆయన అలసిపోతున్నారు. ఎక్కువ సంఖ్యలో వస్తున్న కేసులకు ఈయన పూర్తి న్యాయం చేయలేక పోతున్నారు .ఒక వైపు క్యాజువాలిటి ఇంకోవైపు ఇన్‌వార్డులోని రోగులను, మరోవైపు ఓపి నుంచివస్తున్న కేసుల రోగులకు అన్ని వేళల్లో అన్నీ తానై రాజమోహన్ శ్రమిస్తున్నారు.ఈ విభాగంలో వస్తున్న క్రిటికల్ కేసులను అత్యవసరంగా మెరుగైన చికిత్సకోసం ఇతర హాస్పిటల్స్‌కు రిఫర్ చేస్తున్నారు.

దశాబ్ధాలుగా భర్తీకి నోచుకోని ఖాళీ పోస్టులు..

దీనిలో ఔట్‌గోయింగే కాని ఇన్‌కమింగ్ లేని పరిస్థితి నెలకొందని కొందరు వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తం సుమారు వందమంది ఉండాల్సిన వైద్య పోస్టులలో కేవలం నలబై రెండు మంది వైద్యులు మాత్రమే పనిచేస్తున్నారు. మిగిలిన పోస్టులను దశాబ్ధాలుగా వీటిని పూరించడం లేదు. రోజుకు సుమారు రెండువేలన్నర మంది రోగులు ఒపికి, మూడు వందల మంది ఎమర్జెన్సీ రోగులకు సరిపడేంత మంది ఉండాల్సిందే. ఇప్పటి వరకు పదుల సంఖ్యలో రిటైర్ అవుతున్నా వారి స్థానంలో కొత్త వారిని నియమించక పోవడంతో ఇబ్బందులకు గురికావాల్సివస్తున్నది. ప్రతి సారి అన్ని రకాల పోస్టులను భర్తీచేస్తామని ప్రభుత్వాలు హామీ ఇస్తున్నా నేటికీ భర్తీ చేయకపోవడం బాదాకరం.

మిషన్ల రిపేర్ ఎప్పుడో..

రోగులకు రోగ నిర్ధారణ కోసం చేయాల్సిన పరీక్షలు పడకేస్తున్నాయి. గత రెండు నెలలుగా ఎంఆర్ఐ మిషన్, దాని సంబంధిత జనరేటర్‌లు రిపేర్ కొచ్చాయి. కాని రోజులు గడుస్తున్నా రిపేర్ కావడం లేదు. గుండె తదితర వైద్యం కోసం చేసే టూడీ ఎకో పరీక్షలు ఆ మిషన్ రిపేర్‌కు రావడంతో దానిని గత కొంతకాలంగా నిలిపివేశారు. దీనిని రిపేర్ చేయాల్సింది.





ప్రయాణికులతో కిటకిటలాడిన బస్టాండ్



మనతెలంగాణ/ పరకాల టౌన్: సంక్రాంతి సెలవులు పాఠశాలలు, కళాశాలకు ఇవ్వడంతో పరకాల బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. నేటి నుండి సంక్రాంతి సెలవుల సందర్భంగా విద్యార్థులు, ప్రజలు తమతమ ఇంటికి వెల్లడానికి బస్టాండ్‌కు చేరుకోవడంతో సకాలంలో బస్సులులేక అనేక ఇబ్బందులు పడ్డారు. దూర ప్రాంతాలకు వెల్లే ప్రయాణికులు ఆందోళనకు గురిఅయ్యారు. అదనపు బస్సులు ఏర్పాటు చేయడంలో పరకాల ఆర్టీసి అధికారులు విఫలమయ్యారని ప్రయాణికులు మండిపడ్డారు. చేసేది ఏమీలేక ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి తమ గమ్యస్థానాలకు చేరుకునే విధంగా ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఆర్టీసికి నష్టం చేకూరుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన ఆర్టీసి అధికారులు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే దిశలో అడుగులు వేయాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.

కాలేజీ విద్యార్థిని వేధించిన యువకుని అరెస్టు

మన తెలంగాణ / జహీరాబాద్ : కాలేజి విద్యార్థిని మరో విద్యార్థి వేధిస్తుండడంతో అతనని పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రంజోల్ గ్రామానికి చెందిన ఓ యువతి (23) జహీరాబాద్ పట్టణంలోని ఓ కాలేజ్‌లో చదువుతోంది. జహీరాబాద్‌లో ఐటీఐ చదువుతున్న ఓ యువకుడు ఆ యువతిని తరుచు వేదిస్తుండడం జహీరాబాద్ డీఎస్పీనల్లమల రవి ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. అయినా ఆ యువకుని తీరుమారలేదు. గత రెండు రోజులుగా మళ్లీ ఆ యువతినిని వెంట పడుతూ తనను ప్రేమించాలని లేకపోతే చంపేస్తానని లేదా తాను చనిపోతానని బెదిరించడం మొదలుపెట్టాడు.


ఈ విషయంతో విద్యార్థులు షీటీం ఇంచార్జి షానుబాయికి ఫిర్యాదు చేయడంతో ఆమె రంగంలోకి దిగి యువతిని వేదిస్తున్న యువకున్ని పట్టుకొని టౌన్ ఎస్ఐ రాజశేఖర్ ముందు హాజరు పరిచారు. యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఎవరైనా ఇలాంటి సంఘటనకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

'లవ్ ఖమ్మం' వద్ద సెల్ఫీల కోసం పోటీ



మన తెలంగాణ/ఖమ్మం టౌన్ : ఖమ్మం నగరంలో లకారం పార్క్ వద్ద ప్రారంభించిన లవ్ ఖమ్మం సెల్ఫీ స్పాట్ వద్ద నగర ప్రజలు సెల్ఫీలు దిగడానికి పోటీలు పడ్డారు. హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేసిన లవ్ హైదరాబాద్ మాదిరిగా ఖమ్మంలోని లకారం పార్క్ లో రోటరి క్లబ్, మిత్ర పౌండేషన్, పిటి కన్‌స్ట్రక్షన్ ఆధ్వరంలో ఖమ్మం లవ్ సెల్ఫీ స్పాట్‌ను నిర్మించా రు. దీనిని ఖమ్మం ఎంఎల్‌ఏ పువ్వాడ అజయ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం ఈ స్పాట్‌లో సెల్ఫీలు దిగడానికి నగర ప్రజలు పోటీలు పడ్డారు. సాయంత్రం ఆహ్లాదం కోసం పా ర్క్‌కు వచ్చినవారు, సాయంత్రం వాకింగ్‌కు వచ్చినవారు అక్క డ తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్లతో సెల్ఫీలు తీసుకున్నారు. ప్రధాన ంగా ప్రేమ జంటలు, భార్యాభర్తలు జోరుగా సెల్ఫీలు దిగారు.

గోదాదేవి రంగనాయకుల కళ్యాణం



మనతెలంగాణ/మెట్‌పల్లి: మెట్‌పల్లి డివిజన్ కేంద్రంలోని చెన్నకేశవనాథ స్వామి ఆలయంలో గురువారం గోదాదేవి రంగనాయకుల కళ్యాణం ఎమ్మెల్యే దంపతుల ఆధ్వర్యంలో కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ కమిటీసభ్యులు, ఎమ్మెల్యే దంపతులు భారీ సంఖ్యలో మహిళలు కన్యాదాతలుగా వ్యవహరించి వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య గోదాదేవి రంగనాయకుల కళ్యాణం ఘనంగానిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలోకౌన్సిలర్ ద్యావతి అరుణ, శ్రీనివాస్, సురేందర్, కృష్ణమాచారీ, శ్రీనివాస్ మూర్తి, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న హుండీ లెక్కింపు






మనతెలంగాణ/ వేములవాడ : శ్రీరాజరాజేశ్వర స్వామి వారి హుండీని గురువారం లెక్కించారు. పదకొండు రోజుల హుండీని లెక్కించగా 48లక్షల 3వేల 580రూపాలయులు, 85గ్రాముల బంగారం, 35కిలోల వెండి సమకూరినట్లు ఆలయ అధికార గణం తెలిపింది. ఈ లెక్కింపు కార్యక్రమాన్ని ఈవో దూస రాజేశ్వర్, ఏఈవో ఉమారాణిలు దగ్గర ఉండి పర్యవేక్షించారు. వీరితో పాటు సత్యసాయి సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

హుండీలో అరుదైన కానుక

హుండీ లెక్కింపులో అజ్ఞాత భక్తుడు రాజన్నకు అరుదైన కానుక హుండీలో వేసాడు. వెండితో తయారు చేసిన శివలింగం, నంది, వినాయకుడు కలిగిన అరుదైన కానుకను తయారుచేసి హుండీలో వేసినట్లు తెలుస్తుంది. ఆలయ సిబ్బంది దాన్ని ప్రత్యేకంగా గుర్తించి చూపించడం జరిగింది.

అపురూప జ్ఞానానికి ఆదరణ కరువు..!

- **కరిగే కాలం.. పుస్తకంలో నిక్షిప్తం**
- **డైరీ రాయడం ఓ కళ**
- **అనుభూతులు సజీవం**
- **అనుసరిస్తే భవిష్యత్తుకు బాటలు**



మనతెలంగాణ/నిడమనూరు : ఏడాదిలో ఎన్నో మధుర జ్ఞాపకాలు.. విషాద వీచికలు ..చెదిరిపోని గుర్తులు..మరువలేని అనుబంధాలు.. మానసిక సంతోషాలు..దుఃఖాలు..ఇలా ఒక్కటేమిటి అన్ని అంశాలను పదిలపరుచుకోవడానికి ఉపయోగించే డైరీ నేడు కనిపించకుండాపోతోంది. దైనందిన జీవితంలో డైరీ ఎంతో ము ఖ్య పాత్ర పోషిస్తుంది. సెల్‌ఫోన్ రాకతో ఆ డైరీని చాలా వరకు వినియోగించడం తగ్గించారు. కాలం ప్రవా హం..ఆ ప్రవాహంలో మరో సంవత్సరం కాలం కరిగిపోతుంది. వెళ్లిపోయిన అనుభూతులు సజీవంగా ఉంచే సాక్ష్యమే మనం రాసే డైరీ. యువతరం చాటింగ్, ఫేస్‌బుక్, వాట్సాప్ లాంటి సోషల్ మీడియాకు అలవాటు పడి డైరీ రాయడం చాలా మంది మరచిపోతున్నారు. డై రీ రాయడం ఒక కళ. అనుభవాలను కలబోసి భవితకు మార్గదర్శిగా నిలిచే చుక్కాని. అనుభవాల వడపోత, అనేక అనుభూతుల కలబోత, డైరీ రాయడంలో మెలకవలు నేర్చుకుంటే మంచి చేతిరాతకు, మంచి మిత్రుడు, మంచి మార్గదర్శకుడిగా ఉపయోగపడుతుంది.

కాలగమనంలో ఎన్నో మార్పులు : మొదట్లో ఒక చిన్న పుస్తకం లాగానో, కొన్ని కాగితాల బొత్తిలాగానో ఉండే దినదర్శిని రానురానూ రంగుల అట్టాలను సంతరించుకుంది. లోపల ఆదాయ పన్ను, దూరవాణి, రైలు, బస్సు మార్గాలు, తపాలా వివరాలకు చోటు లభించింది. ప్రభుత్వ శాఖలు, వ్యాపార వర్గాలు, ఉద్యోగ సంఘాల వారీగా రూపుదిద్దుకుంటున్నాయి. కొంతమంది నచ్చిన సినీతారల బొమ్మలను మరికొంతమంది దేవతల చిత్రాలను, ప్రకృతి సౌందర్య చిత్రాలను మధ్య మధ్యలో అమర్చుతున్నారు. దీంతో చూడముచ్చటగానే కాక సమాచార దర్శినిలుగా కూడా ఇవి ఉపకరిస్తున్నాయి. నాలుగు అంగుళా పరిమాణం నుంచి అడుగు పరిమాణం దాకా పొడవు, వెడల్పులతో 365 రోజులకు సరిపడా పుటలతో సరికొత్త అందాలతో రూపొందుతున్నాయి. ఒక పుటలో రెండు రోజులకు సంబంధించిన వివరాలను రాసుకునేది కొన్నైతే ఒక రోజుకు సంబంధించిన వివరాలను మాత్రమే రాసుకునే విధంగా మరికొన్ని ఉంటున్నాయి. ప్రతి పుట కింద నీతి వాక్యాలు, ధర్మసూత్రాలు ఉండేవి. కొన్నైతే రాజ్యాంగపరంగా ఉండే విశేషాలు, మహనీయుల సూక్తులతో ఇంకొన్ని కనిపిస్తుంటాయి. ప్రభుత్వంలో మంత్రులు, పారిశ్రామికవేత్తలు, వాణిజ్యవేత్తలు వద్ద ఉండే కార్యదర్శులు డైరీని నిత్యం అనుసరిస్తుంటారు. ముందస్తుగానే కార్యక్రమాల వివరాలను డైరీలో నమొదు చేసుకుని ఏ రోజు కారోజు క్రమం తప్పకుండా వ్యవహారాలు చక్కబెట్టడానికి సాధనంగా ఉపయోగపడుతోంది.

తీపిజ్ఞాపకాలుగా మిగలాలి : కొంత మంది దైనందిని చదివితే కాలం గురించి తెలుస్తుంది. కొన్ని జాగ్రత్తలు పాటించి డైరీ రాస్తే తీపిజ్ఞాపకంగా మిగులుతుంది. ఇతరుల మీద ద్వేషాన్ని ప్రదర్శించే అంశాలతో రాయకూడదు. తమను ప్రేమించే వ్యక్తుల గురించి రాసుకుంటే మనలో కూడా సానుకుల ఆలోచనలు పెరుగుతాయి. జీవితమంటే జమ ఖర్చుల పుస్తకం కాదు ఆర్థిక లావాదేవీలతో నింపకూడదు.

మొదటి పేజిలోనే మీ నూతన సంవత్సరం లక్ష్యాలు, నిర్ణయాలతోపాటు అవి నెరవేర్చుకోవడానికి ప్రణాళిక వేసుకుంటే విజయానికి మార్గదర్శిగా నిలుస్తుంది.

అనాథ పాపకు అన్న ప్రాసన..

మనతెలంగాణ/ఎంజిఎం : ఉత్తర తెలంగాణలో పెద్దదిక్కుగా పేరొందిన వరంగ ల్ మహాత్మ గాంధీ మెమోరియల్ ఆస్పత్రి(ఎంజిఎం) పిల్లల విభాగం(ఎన్ఐఎస్‌యు)లో వైద్యులు, సిబ్బంది అనాథ పాపను ఆదరించి సేవా ధృకృధంతో మానవత్వం చాటుకొని అన్న ప్రాసన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం జిఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు, పిల్లల విభాగం హెచ్ఓడి విజయ్‌కుమార్‌లు మాట్లాడుతూ ఎంజిఎం ఆస్పత్రిలో ఇలాంటి కేసులు తరుచుగా వ స్తూ ఉంటాయని ఎందరికో ఎంజిఎం ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది మానవత్వం చా టుకొని అపన్న హస్తంగా వైద్యంతో పాటు తల్లిదండ్రుల పాత్ర వహించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. చికిత్సతో పాటు సేవా ధృకృథం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేణు, ఎంజిఎం స్టాఫ్ సిస్టర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కామేశ్వరాలయం కనుమరుగయ్యేనా..?

• కాకతీయుల కట్టడాలు అద్భుతం • 806 సంవత్సరాల కాకతీయ గుళ్ల కట్టడాలు



మన తెలంగాణ/ వెంకటాపూర్ : కామేశ్వరాలయం కనుమరుగయ్యేనా.. 806 సంవత్సరాల నాటి కాకతీయ కట్టడాలు శిథిలావస్థలో చేరుకుని కూలిపోతున్నాయి. సుప్రసిద్ధి గాంచిన రామప్ప గుడి ఆనుకుని ఉన్న కామేశ్వరాలయం 2013 లో శిథిలావస్థలో ఉన్న గుడిని సంబంధిత అధికారులు ప్రతి ఒక్క శిలకు నంబర్లు వేసి కామేశ్వరాలయాన్ని విప్పారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎక్కడ వేసిన శిల అక్కడనే ఉంది. కానీ ఇప్పటి వరకు ఎవ్వరు పట్టించుకోక పోవడం వలన పునాదిలోనే ఆగిపోయింది. చరిత్రాత్మక కట్టడాలు చరిత్రలో నిలిచిపోయే విధంగా కాకతీయులు గుళ్ళను కట్టారు. అవి ఇప్పటికి అవుపడుతున్న కానీ సంబంధిత పురావస్తు శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేకపోవడం వలన గుళ్ళు అలాగే ఉంటున్నాయి. ప్రపంచ నలుమూలల నుంచి అనేక సంఖ్యలో భక్తులు రామప్ప దేవాలయానికి ప్రతి రోజు వస్తుంటారు. రామప్ప ఆవరణలో అనేక రకాల దేవుళ్ళకు సంబంధించిన గుళ్ళు ఉన్న ఏ గుడిని ఇప్పటికి పురావస్తు శాఖ వారు పునరుద్ధరణ చేయలేదని పురావస్తు శాఖ వారు కామేశ్వర ఆలయాన్ని 2013లో ఏ శిలకు ఆ శిల విడిగా చేసి గుడి పరిసర ప్రాంతాలల్లో వేశారు. ఇప్పటికి అలాగే ఉన్నాయి. కానీ పనులు ప్రారంభం కాలేదు. ఇలా రామప్ప దేవాలయానికి భక్తుల రాకపోకలు తగ్గుతాయని చెప్పుకోవచ్చు. రామప్పకు భక్తుల తాకిడి ఎక్కువ ఉండాలంటే రామప్ప పరిసర ప్రాంతంలో ఉన్నటువంటి గుళ్ళను పునరుద్దర చేసి రామప్పకు ఆదాయం పెరిగేటట్లు పురావస్తుశాఖ వారు పనులు చేస్తే రామప్పకు అందాల కళ వస్తుందని చెప్పుకోవచ్చు. 806 సంవత్సరాల క్రితం కాకతీయులు ఏర్పాటుచేసిన గుళ్ళను ఇప్పటికి ఎవ్వరు వాటిపై శ్రద్ధ వహిస్తే రామప్పకు అద్భుతమైన కళలు ఉండేదని తెలుస్తుంది. కాకతీయ కట్టడాలు కనుమరుగు అవుతాయా లేదా భక్తుల్లో ఒక ప్రశ్నగా మారింది. 2013లో కామేశ్వరాలయాన్ని పునరుద్ధరణచేస్తామని పురావస్తు శాఖ వారు పనులు చేపట్టిన తరువాత మళ్ళీ ఆ గుడిపై ఎవ్వరి చేయి పడలేదని అందువల్లనే గుడి పునరుద్ధరణ ఆగుతుందని తెలుస్తుంది. దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులు కామేశ్వరాలయం కనుమరుగు అయ్యేనా అనే విధంగా చర్చించుకుంటున్నారు. రామప్ప ప్రతి సంవత్సరానికి శివరాత్రికి దేశ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. భక్తులు వచ్చే ఆదాయం రామప్పకు ఎక్కువ ఉంటుంది. అయిన పురవాస్తు శాఖ వారు అభివృద్ధి చేయలేకపోతున్నారు. రామప్ప పరిసర ప్రాంతాల్లో గుడి ఆవరణలో హైద్రాబాద్ నుంచి సినిమా షూటింగ్‌లకు కూడా వచ్చి షూటింగ్ లు ఏర్పాటుచేసుకుంటారు. ఇలా రామప్ప పరిసర ప్రాంతాల్లో ఉన్నటువంటి అన్ని గుళ్ళను పునరుద్ధరణ చేస్తే ఇంకా భక్తులరద్దీ సినిమా షూటింగ్‌లు ఎక్కువ పెరిగే అవకాశాలు ఉంటాయి. అందువల్ల వెంటనే పురావస్తు శాఖ వారు కామేశ్వరాలయం పునరుద్ధరణ పనులు చేపట్టి రామప్ప పరిసర ప్రాంతాల్లో ఉంటున్న ప్రతి గుడిని పునరుద్ధరణ చేసి రామప్పకు అందాల కళ తెచ్చేవిధంగా పనులు చేపట్టాలని భక్తులు అన్నారు. సుప్రసిద్ధి గాంచిన రామప్ప సమీపంలో రామప్ప సరస్సు ఉంటుంది. సరస్సు కట్టకు చిత్రలేఖను దాదాపు





ఒక చిత్రలేఖను 15 ఫీట్లు ఉంటుందని చెప్పుకోవచ్చు. అది 5 కిల మీటర్ల దూరం నుంచి భక్తులు రామప్పకు వస్తుంటే స్పష్టంగా ఏర్పడేది. దానిని కూడా అధికారులు మరిచి పోయి కట్ట చిత్రలేఖనంలో పిచ్చి మొక్కలతో దర్శనమిస్తుంది. ఇలా అధికారులు రామప్ప పరిసర ప్రాంతాల్లో ఏలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడం వలన రామప్పకు భక్తుల రద్దీ తక్కువ అవుతుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఉంటున్న ములుగు నియోజకవర్గం సమ్మక్క సారలక్క జిల్లాగా మారుతుంది. జిల్లా అభివృద్ధి కొరకు సమ్మక్క సారక్క జిల్లాలో ఉండే దేవాలయాలను దేశ నలుమూలల ఉంటున్న అందరికి తెలిసే విధంగా సమ్మక్క సారక్క జిల్లాలో ఉన్న దేవాలయాలను పునరుద్ధరణ పనులు చేపట్టి సమ్మక్క సారక్క జిల్లాను దేశంలో ఉన్న రాష్ట్రాలు అన్ని గుర్తించేవిధంగా జిల్లాను అభివృద్ధి చేసి రామప్ప పరిసర ప్రాంతాల్లో ఉంటున్న గుళ్ళను పునరుద్దణ పనులు చేపట్టాలని భక్తుల మాట.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

ముగిసిన రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాలు





మన తెలంగాణ / భద్రాచలం : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు ఆడితేనే మానసిక ఉల్లాసం కలుగుతుందని భద్రాచలం ఐటిడిఏ పిఓ పమేలా సత్పథి అన్నారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాల ముగింపు వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండి విద్యార్థులను ప్రోత్సహించి రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనేలా చేసిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. 31 జిల్లాల నుండి వచ్చిన గిరిజన విద్యార్థులు క్రీడా పోటీలలో చాలా ఉత్సాహంగా పాల్గొన్నారని, అన్ని క్రీడల్లో కూడా తమ సత్తా చాటుకుని బహుమతులు సొంతం చేసుకున్నారని అన్నారు. రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడోత్సవాలను మొట్ట మొదటిసారిగా భద్రాచలంలో నిర్వహించడానికి అవకాశం కల్పించిన గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బెనహర్ మహేష్‌దత్ ఎక్కా, గిరిజన సంక్షేమశాఖ కమీషనర్ క్రిస్టినా జెడ్ చోంగ్తూలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వివిధ జిల్లాల నుండి వచ్చిన విద్యార్థులను తమ తమ గమ్యస్థానాలకు చేర్చేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. వివిధ క్రీడల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. రాష్ట్రస్థాయి పోటీలు ఇంత ఘనంగా నిర్వహించిన గిరిజన సంక్షేమశాఖ అధికారులను అభనందించారు. రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడోత్సవాలలో ఓవరాల్ ఛాంపియన్ ప్రథమ స్థానంలో భద్రాచలం జోన్ గెలుచుకుంది, ద్వితీయ స్థానంలో ఏటూరునాగారం, తృతీయ స్థానంలో ఉట్నూరు గెలుపొందింది. ఈ ముగింపు వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర క్రీడల నిర్వహణాధిరి వి జ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ డిడి రాంమూర్తి, జిల్లా క్రీడల నిర్వహణాధికారి పుట్టా శంకరయ్య, ఎపిఓ జనరల్ నాగోరావు, ఆసిఫాబాద్ ఎటిడివో శ్రీనివాస్, ఏటూరునాగారం డిటిడివో ఎర్రయ్య, ఏటూరునాగారం డిప్యూటీ డిఇఓ నర్సింహా, సంబంధిత ఎటిడిఓలు జహీరుద్దీన్, లక్ష్మణ్‌బాబు, సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు, 31 జిల్లాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకగ్రీవాలపై ఎన్నికల సంఘం నజర్..!



మనతెలంగాణ/ఆదిలాబాద్ ప్రతినిధి: పంచాయతీ ఎన్నికలలో ఏకగ్రీవం పేరిట వేలం పాటలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వస్తుండడంతో ఎన్నికల సంఘం ఈ అంశంపై దృష్టి సారించింది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలలో ఏకగ్రీవ పంచాయతీలు, అక్కడ ఎన్నికైన వారి పూర్తి వివరాలను సేకరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక పరిశీలకులను నియమించి ఏకగ్రీవాలపై ఆరా తీసేందుకు చర్యలు చేపట్టారు. ఇందులోభాగంగా ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలలో పంచాయతీ ఎన్నికలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఐఎఎస్ స్థాయి అధికారి మహ్మద్ అబ్దుల్ అజీమ్‌ను ఎన్నికల సంఘం నియమించింది. రెండు జిల్లాలకు సంబంధించిన జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో ఆయన సమావేశమై పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఆరా తీశారు. వివిధ రాజకీయ పార్టీలలో క్రియాశీల పాత్ర పోషిస్తున్నప్పటికీ ఎలాంటి పదవి లేకుండా ఉండిపోయిన వారంతా ప్రస్తుత ఎన్నికలలో రిజర్వేషన్లు అనుకూలించడంతో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలోనే ప్రత్యర్థులను మచ్చిక చేసుకొనేందుకు నజరాలు ఇస్తూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే కొన్ని గ్రామాలలో వేలం పాటల ద్వారా సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను ఎంపిక చేస్తున్నట్లు ఆరోపణలు వస్తుండడంతో వీటిని నిరోధించడంలో భాగంగా ఎన్నికల సంఘం పరిశీలకులను ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. ఇక కొన్ని గ్రామాలలో ప్రభుత్వం అందించే 10 లక్షల రూపాయల నజరానాతో గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకోవచ్చనే ఉద్దేశంతో ఏకాభిప్రాయంతో ఎన్నిక నిర్వహించుకుంటున్నారు. ప్రధానంగా నూతన గ్రామ పంచాయతీలలో ఎక్కువ శాతం ఏకగ్రీవ ఎన్నికలు జరుగుతుండగా, మిగిలిన ప్రాంతాలలో కొంత మేర పోటీ నెలకొనగా గ్రామస్థులు జోక్యం చేసుకొని ఎన్నికలు జరగకుండా చర్యలు చేపట్టారు. ఇలాంటి వాటిలో కొన్నింటిలో కొంత మేరకు డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్నప్పటికీ అలాంటిదేమి లేదని చెబుతున్నారు. అయితే ఏకగ్రీవ పంచాయతీల వ్యవహారంపై ఎన్నికల సంఘం నిఘా పెట్టడంతో అక్రమాలకు చెక్ పడే అవకాశాలున్నాయని అంటున్నారు.

జిల్లాలో 39 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం

ఆదిలాబాద్ జిల్లాలో మొదటి విడతలో 153 గ్రామ పంచాయతీలకు నామినేషన్ల స్వీకరణ పర్వం ముగిసింది. వీటిలో 39 సర్పంచ్ స్థానాలకు ఒకే నామినేషన్ దాఖలు కాగా, 1240 వార్డు స్థానాలలో 346 స్థానాలకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలయ్యాయి. ఇవన్ని ఏకగ్రీవం కానున్నాయి. అలాగే నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ అనంతరం మరిన్ని సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమయ్యే అవకాశాలున్నటలు తెలుస్తోంది. ఆదిలాబాద్ రూరల్ మండలంలో 34 గ్రామ పంచాయతీలకు గాను 12 స్థానాలు, బేల మండలంలో 35 గ్రామ పంచాయతీలకు గాను 8, జైనథ్‌లో 42 పంచాయతీలలో 3, తాంసిలో 13 పంచాయతీలకు గాను 3, భీంపూర్‌లో 26 పంచాయతీలలో 13 సర్పంచ్ స్థానాలకు ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవమయ్యాయి. ఇదిలాఉంటే రెండో విడతలో బజార్‌హత్నూర్, బోథ్, గుడిహాత్నూర్, నేరడిగొండ, తలమడుగు మండలాల పరిధిలో 149, మూడవ విడతలో ఇచ్చోడ, సిరికొండ, ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ మండలాల పరిధిలో 164 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనుండగా, ఇప్పటికే కొన్ని గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం చేస్తూ గ్రామస్థులు తీర్మాణాలు చేశారు.

లారీ ఢీ ఒకరు మృతి ఒకరికి తీవ్ర గాయాలు

మన తెలంగాణ/ములుగు : జయశంకర్ భూపాలపల్లి ములుగు మండలం జంగాలపల్లి గ్రామం ఎక్స్ రోడ్డు వద్ద గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే వెంకటాపూర్ మండలానికి చెందిన యాట సురేష్ జవహర్ నగర్ గ్రామానికి చెందిన బొండం వీరిద్దరు లారీపైన తరుచు పనిచేస్తు ఉండేవారు. గురువారం రోజున మద్యాహ్నం 3 గంటల సమయంలో బజాజ్ 100 బైక్ నంబర్.టిఎస్03ఇఎన్0578 గల ద్విచక్ర వాహనంపై జవహర్ నగర్ పోతుండగా మంగపేట నుండి లారీ హెచ్‌ఆర్ 55వై 9834 గల లారీ వస్తుండగా ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో బొండం అక్కడిక్కడే మృతి చెందగా యాట సురేష్ కు తీవ్ర గాయాలయ్యాయి.

ఇది జంగాలపల్లి క్రాస్ రోడ్డులో ఘోర ప్రమాదం జరిగింది. ఈ ప్రమాద పరిసర ప్రాంతానికి ములుగు రెండవ ఎస్సై ఫణి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతి చెందిన శవాన్ని ములుగు ఆసుపత్రికి తరలించగా గాయపడ్డ యాట సురేష్ ను 108 లో ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ఉపాధే లక్ష్యం.. సిద్దిపేటే సజీవ సాక్ష్యం

- జిల్లా వ్యాప్తంగా ఇండస్ట్రియల్ కారిడార్
- నెరవేరనున్న నిరుద్యోగుల కల
- 900 ఎకరాల సేకరణ, మరో వెయ్యి ఎకరాలకు ప్రతిపాదన
- ప్రస్తుతం డిఎక్స్ఎన్ కంపెనీ తాత్కాలిక ప్రారంభం
- మరో రెండు కంపెనీలు స్థాపించడానికి ప్రతిపాదనలు
- 6400 మందికి ప్రత్యక్షంగా, 6500 పరోక్షంగా ఉపాధి
- హరీశ్‌రావు చొరవతో పనులు వేగవంతం





మన తెలంగాణ/సిద్ధిపేట అర్బన్: దేశంలోనే సిద్ధిపేట అభివృద్ధిలో ఆదర్శం. ఎన్నో అవార్డులు, రివార్డులు ఎక్కడ చూసినా ప్రశంసలే. నియోజకవర్గంలో పలు రంగాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసేందుకు ఇతర రాష్ట్రాల నుండి ప్రజా ప్రతినిధులు, అధికారులు వస్తుంటారు. అభివృద్ధిలో భాగంగా నిరుద్యోగులైన యువతీయువకులకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నది కూడా మాజీ మంత్రి, శాసన సభ్యుడు తన్నీరు హరీశ్‌రావు ఆశయం. దీని కోసం నియోజకవర్గంలో వివిధ పరిశ్రమలను స్థాపించడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. దీని కోసం సిద్ధిపేట జిల్లా వ్యాప్తంగా పరిశ్రమల కారిడార్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే రెండు ఎంఎన్‌సి కంపనీలు వారి కార్యాకలాపాలను ప్రారంభించాయి. త్వరలోనే మరిన్ని కంపనీలు జిల్లాకు రానున్నాయి. కంపనీల స్థాపన వల్ల స్థానిక నిరుద్యోగులకు ఉపాధి దొరకనుంది. పరిశ్రమల స్థాపన కోసం సిద్ధిపేట, గజ్వేల్ డివిజన్‌లలో అధికారులు ప్రస్తుతం 900 ఎకరాల భూమిని సేకరించారు. వీటిలో వివిధ రకాల పరిశ్రమలు స్థాపించనున్నారు. ఈ పరిశ్రమల స్థాపన జరిగితే ప్రత్యక్షంగా 6400 మందికి, పరోక్షంగా 6500 మందికి ఉపాధి దొరకనుంది. మరో 1000 ఎకరాల భూ సేకరణకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. అంటే మరో 10 వేల మందికి ఈ పరిశ్రమల ద్వారా ఉపాధి కలుగనుంది. తన్నీరు హరీశ్‌రావు పట్టుదలతో మలేషియా దేశానికి చెందిన ఎంఎన్‌సి పరిశ్రమ డిఎక్స్ఎన్‌కి మందపల్లి గ్రామ శివారులో 47 ఎకరాలు కేటాయించారు. దీంతో వారు తాత్కలిక కంటైనర్‌లలో కార్యాలయం ప్రారంభించి పనులు నిర్వహిస్తున్నారు. త్వరలోనే వారు తమ స్వంతం భవన నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. నర్మేటలో 125 ఎకరాల భూ సేకరన పూర్తవగా మరో 150 ఎకరాల భూ సేకరణ జరిపి వివిధ పరిశ్రమలకు ఇవ్వాల్సి ఉంది. ఈ కారిడార్‌లోని పరిశ్రమల ఏర్పాటు వల్ల 800 మందికి ప్రత్యేక్షంగా, మరో 1500 మందికి పరోక్షంగా ఉపాధి కల్పించనున్నారు. బండ మైలారం గ్రామంలో 153 ఎకరాలు స్వీకరించిన అధికారులు మరి కొంత భూమిని సేకరించే పనిలో ఉన్నారు. బండ తిమ్మాపూర్ గ్రామంలో 127 ఎకరాలు భూమిని సేకరించిన అధికారులు ఇందులో 20 ఎకరాల భూమిని ఆర్‌పిఎస్ గోయంక (ఆలు చిప్స్ తయారీ ఇండియన్ బెస్డ్ ఎంఎన్‌సి పరిశ్రమ)కు కేటాయించారు. ఈ కారిడార్‌లో కేటాయించే పరిశ్రమల వల్ల 2000 మందికి ప్రతే

క్షంగా,1500 మందికి పరోక్షంగా ఉపాది కలుగనుంది. తున్కి బోల్లారం గ్రామంలో ఇప్పటికే 150 ఎకరాలు సేకరించిన అధికారులు మరో 200 ఎకరాల భూమి సేకరించడానికి ప్రతిపాదనలు రూపొందించారు. ఇక్కడ కూడాఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు అనుమతి ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. పరిశ్రమలు వస్తే ప్రత్యక్షంగా 2000 మందికి, పరోక్షంగా 1500 మందికి ఉపాది కల్పనకు వీలవుతుంది. పీర్లపల్లి, మునిగడ గ్రామాల్లో 400ల ఎకరాల భూమి సేకరణకు ప్రతిపాదనలు రూపొందించినట్లు అధికారులు తెలిపారు. నాగుల బండ వద్ద ఐటి కారిడార్ ఏర్పాటుకు 3 ఎకరాల భూమిని అధికారులు సేకరించారు. దుద్దేడ గ్రామంలో 100 ఎకరాల భూమిని అధికారులు సేకరించారు.

పరిశ్రమలతో ఉపాధి కల్పన...

ప్రస్తుతం అగ్రిప్రొడక్స్ తయారు చేస్తున్న మలేషియా దేశానికి చెందిన డిఎక్స్ఎన్ పరిశ్రమ వారు కార్యకలాపాలను ప్రారంభించారు. వారికి కేటాయించిన 47 ఎకరాల్లో బిల్డింగ్ నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి స్థాయిలో కార్యాలయం, ప్రొడక్షన్ తయారు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రూ.200 కోట్లతో ఏర్పాటు చేయబోయే పరిశ్రమ వల్ల 2300 మందికి పత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించనున్నారు. ఇక్కడి కంపనీలో ముఖ్యంగా స్పైరోలినా, గ్యానోడెర్మాలాంటి ఆరోగ్యానికి సంబంధించి మందుల ఉత్పత్తులు జరుపనున్నట్లు అధికారులు తెలిపారు.

నర్మేటలో హై న్యూట్రిషన్ పరిశ్రమ..

నర్మేటలో జపాన్ దేశానికి చెందిన హై న్యూట్రిషన్ పరిశ్రమ ప్రారంభించనున్నారు. ఈ పరిశ్రమలో కోడిగ్రుడ్డుతో తయారు చేసే హై న్యూట్రిషన్ ప్రొడక్ట్‌ను ఉత్పత్తి చేయనున్నారు. పరిశ్రమ ద్వారా 1200 మందికి ప్రత్యక్షంగా,మరో 1500 మందికి పరోక్షంగా ఉపాధి దొరకనుంది.

బండతిమ్మాపూర్‌లో ఆర్‌పిఎస్ గోయంకా పరిశ్రమ...

బండతిమ్మాపూర్ కారిడార్‌లో ఇండియన్ బెస్డ్ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఆర్‌పిఎస్ గోయాంక(ఆలు చిప్స్ తయారి పరిశ్రమ) స్థాపించడానికి సిద్దంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ పరిశ్రమకు ఇప్పటికే 20 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ పరిశ్రమల వల్ల 400 మందికి ప్రత్యక్షంగా, 500 మందికి పరోక్షంగా ఉపాధి దొరకనుంది. ఇవే కాకుండా సిద్దిపేటలోని ఆయిల్ మిల్లులు, పుట్నాల మిల్లులు, పారాబాయిల్డ్ మిల్లులు, ధాన్యం మిల్లులు కూడా ఒక చోట ఏర్పాటకు ప్రతి పాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇవే కాకుండా జిల్లా వ్యాప్తంగా మరో 1000 ఎకరాలు సేకరణలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఎన్నో ఏళ్లుగా గత పాలకులు చెప్పి ఉపాధి కల్పన మాటలకే పరిమితం కావడంతో చాల మంది నిరుద్యోగులు నిరుత్సాహానికి గురయ్యారు, కాని ప్రస్తుతం టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి, శాసన సభ్యుడు టి.హరీశ్ రావు పట్టుదల, చొరవతో నిరుద్యోగుల కల నేరవేరనుంది.

మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు ఆదేశాల మేరకు సిద్దిపేట ను పరిశ్రమల కారిడార్‌గా మార్చడానికి ఇప్పటికే 900 ఎకరాల భూమిని సేకరించాం మరో 1000 ఎకరాలు సేకరించే పనిలో ఉన్నాం. ఇప్పటికే రెండు పరిశ్రమలు ఉనికిలోకి

పరిశ్రమల స్థాపన కోసం భూ సేకరణ

టిఎస్ఐఐసి జిల్లా మేనేజర్ శివప్రసాద్

వచ్చాయి. పరిశ్రమల స్థాపన కోసం త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తాం. పరిశ్రమల కోసం మిషన్ భగీరథ నీటి నుండి 10 శాతం నీటిని కేటాయించనున్నాం. పరిశ్రమల ద్వారా వేల మందికి ఉపాధి దొరుకుతుంది.





భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు

తిరుమలలో అభివృద్ధి పనులపై జెఇఒ సమీక్ష



మనతెలంగాణ/తిరుమల ప్రతినిధి: తిరుమలలో శ్రీవారి దర్శనార్థం విచ్చేసే లక్షలాది మంది భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు టిటిడి ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై టిటిడి తిరుమల జెఈవో కె.ఎస్.శ్రీనివాసరాజు గురువారం ఉదయం తిరుమలలోని అన్నమయ్య భవనంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో సివిల్ ఇంజినీరింగ్ పనులపై సమీక్ష చేపట్టారు.

ఈ సందర్భంగా జెఈవో మీడియాతో మాట్లాడుతూ రోజు రోజుకూ పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా వసతులు కల్పించేందుకు టిటిడి ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పనులు చేపట్టినట్లు తెలిపారు. తిరుమలలో విశేష పర్వదినాలైన రథసప్తమి, వైకుంఠ ఏకాదశి, గరుడసేవలకు తాత్కాలిక ఏర్పాట్లు, శాశ్వత ప్రాతిపాదికన పనులు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 3వ విడత రింగ్ రోడ్డు పనులను త్వరిత గతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోనికి తీసుకురావాలన్నారు. అదేవిధంగా రూ.23 కోట్లతో నారాయణ గిరి ఉద్యాన వనాలలో క్యూ లైన్ల నిర్మాణం, రూ.10 కోట్లతో ఆళ్వారు ట్యాంక్ అతిథి భవనం నుండి ఎమ్బిసి కూడలి వరకు రోడ్డు విస్తరణ పనులలో నాణ్యతలో రాజీ లేకుండా, నిర్ధిత కాలవ్యవధిలో పూర్తి చేయలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం రూ.70 కోట్లతో పిఎసి5ను నిర్మించేందుకు టెండర్లు పిలిచి త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు వివరించారు.

తిరుమలలో వైఎస్ జగన్




మన తెలంగాణ తిరుమల ప్రతినిధి: వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి గురువారం తిరుమలకు చేరుకున్నారు. ఆయన చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర పూర్తయి విజయ సంకల్పం సందర్భంగా రాత్రి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. కాగా ఏడాది క్రితం ఆయన చేపట్టిన పాదయాత్ర 3648 కిలోమీటర్లు పూర్తయిన పూర్తయి పాదయాత్ర ముగిసిన సందర్భంగా స్వామివారి మొక్కు తీర్చుకోవడానికి తిరుమలకు చేసినట్లు వైసిపి నాయకులు తెలిపారు. వైఎస్ జగన్ తిరుమల రాక సందర్భంగా తిరుపతి రేణిగుంట తిరుమల జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో కార్యకర్తల హడావుడి నెలకొంది. గురువారం కాలిబాట ద్వారా తిరుమలకు చేరుకున్న వైఎస్ జగన్ కు నాయకులు అడుగడుగున స్వాగతం పలికారు. పుష్పాలతో ముంచెత్తారు. తిరుమలలోని పద్మావతి నగర్ ప్రాంతంలో వీఐపీలు బసచేసే శ్రీకృష్ణ అతిథి భవనంలో ఆయన కాసేపు విరామం తీసుకున్నారు. విశ్రాంతి అనంతరం గురువారం రాత్రి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు రాత్రికి తిరుమల లోనే బస చేసి శుక్రవారం ఉదయం తిరుగు ప్రయాణమవుతారని వైసిపి నాయకులు వెల్లడించారు. తిరుమలకు విచ్చేసిన వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆయనతోపాటు వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణస్వామి, ఆర్ కే రోజా, మిధున్ రెడ్డి, వై వి సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

లారీ ఢీకొని... ఇద్దరు దుర్మరణం

మన తెలంగాణ/ఖమ్మం రూరల్ : కూలీ పనులు కోసం ద్వి చక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరిని మృత్యువు లారీ రూపంలో బలి తీసుకున్న సంఘటన గురువారం ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలోని కరుణగిరిలోని టిఎన్జీవోస్ కాలనీలో చోటు చేసుకుంది వివరాల్లోకి వెళితే కూలీ పనుల కోసం ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరు యువకులును లారీ ఢీ కొట్టింది. రామన్నపేటకు చెందిన యాకూబ్ (26), చంద్రగాని శ్రీకాంత్ (25) రూరల్ మండలంలోని సాయి గణేష నగర్‌కు సుతారి పనికి ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. మార్గమధ్యలో వెనుక నుండి వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. వారిద్దరు కింద పడిపోగా కుడి వైపు ముందున్న టైర్ వారి తల మీదకి ఎక్కడంతో ఇద్దరూ అక్కడికక్కడికే మృతి చెందారు. మృతుల్లో యాకుబ్‌కి వివాహమై నాలుగు సంవత్సరాలు కాగా భార్య, మూడు సంవత్సరాల కుమారుడు, ఐదు నెలల పసి కందు ఉన్నారు. చంద్రగాని శ్రీకాంత్‌కు ఆరు నెలల క్రితమే వివాహమైంది. యాకుబ్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకోని మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

అక్కడ 6లక్షలు... ఇక్కడ ఫ్రీ


- అన్ని రకాల క్యాన్సర్లకు మెరుగైన వైద్యం
- గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ రోగులే అత్యధికం
- 35 యేళ్లు నిండిన మహిళలు తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి
- ఎంఎన్‌జె ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జయలత



మన తెలంగాణ/సిటీబ్యూరో: కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో రోగులకు వైద్యులు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రల నుండి గర్భాశయ, రొమ్ము (బ్రెస్ట్) క్యాన్సర్‌తో పాటు బ్లెడ్, బోన్, లంగ్ క్యాన్సర్ రోగులు ఎంఎన్‌జే ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. కార్పొరేటర్ ఆస్పత్రుల్లో రూ. 6 నుంచి రూ. 8 లక్షల వరకు అయ్యే చికిత్సలను ఎంఎన్‌జేలో ఉచితంగా నిర్వహిస్తున్నారు. వివిధ రకాల క్యాన్సర్లతో బాధపడే రోగులలో గర్భాశయ, రొమ్ము క్యానర్స్ బాధితులు అధికంగా ఉంటారు. రొమ్ము (బ్రెస్ట్) క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించడం వల్ల శస్త్ర చికిత్స ద్వారా నియం చేయవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రధానంగా పిల్లలు లేకపోవడం, పాలు పట్టకపోవడం వంటి కారణాలతో మహిళలకు రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుంది. జన్యుపరం (వంశపారపర్యం) గా కూడా రొమ్ము క్యాన్సర్ భారిన పడే అవకాశం ఉంది. రొమ్ము (బ్రెస్ట్) క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు రోజు రోజుకు అధికమవుతున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. రొమ్ము (బ్రెస్ట్) క్యాన్సర్‌పై అవగాహన లేకపోవడంమే ఇందుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. 35 యేళ్లు నిండిన ప్రతి మహిళ తప్పని సరిగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని ఎంఎన్‌జే ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు. బ్రెస్ట్ క్యాన్సర్‌తో చేరిన రోగులకు ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి మెరుగైన వైద్యం అందిజేస్తున్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా వైద్య సేవలు..

కార్పొరేట్ హాస్పటల్స్‌కు ధీటుగా ప్రభుత్వం ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలకు అధునాతన పరికరాలను ఏర్పాటు చేసింది. దీంతో రొమ్ము క్యాన్సర్ భారీన పడన రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ప్రాథమిక దశలో గుర్తించడం వల్ల కేవలం శస్త్ర చికిత్స ద్వార నయం చేయవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రాథమిక దశ దాటిన రోగులకు తప్పని సరిగా కిమోథెరపీ, రేడియోథెరపీ చికిత్సలు అందచేయాల్సి ఉంటుంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో లక్షలాది రూపాయలు వరకు ఖర్చు అయ్యే ఇటువంటి చికిత్సలతో పాటు అవసరమైన మందులను ఎంఎన్‌జే ఆస్పత్రిలో ఉచితంగా అందజేస్తున్నారు. అదే విధంగా ఎక్స్‌రే, సిటీ స్కాన్, ఎంఆర్ఐ, నాలుగు రేడియో థెరపీలు, కోమా కెమెరాలు, మ్యామోషిఫి తదితర క్యాన్సర్‌ను గుర్తించడానికి అవసరమైన అన్ని రకాల వైద్య పరికరాలు ఎంఎన్‌జేలో అందుబాటు ఉండడంతో రోగులకు మెరుగైన వైద్య అందించడానికి వీలుకలుగుతుంది. గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ రోగులతో పాటు ఇతర క్యాన్సర్‌లకు సంబంధించన రోగులు ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో చేరి మెరుగైన వైద్య సేవలు పొందుతున్నారు.



మెరుగైన వైద్యం అందిస్తున్నాం..

ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో చేరిన రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని రకాల వైద్య సేవలను అందజేస్తున్నాం. ఎంఎన్‌జే వైద్య పరీక్షలకు అన్ని రకాల వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. దీంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా రోగ నిర్ధారణ పరీక్షలు చేసి రోగులకు కావాల్సిన వైద్యాన్ని అందజేస్తున్నాం. కిమోథెరపీ, రేడియోథెరపీ సేవలు ఎంఎన్‌జేలో అందుబాటులో ఉన్నాయి. ఎక్కువగా గర్భాశయ, రొమ్ము క్యాన్సర్‌తో బాధపడే వారే ఉంటారు. బ్రెస్ట్ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించడం వల్ల శస్త్ర చికిత్స ద్వారా నయం చేయవచ్చు. వ్యాధి ముదిరితే తప్పక కీమోథెరపీ అందజేయాల్సి ఉంటుంది. కనుక 35 ఏళ్లు నిండిన ప్రతి మహిళ తప్పక స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం శ్రేయస్కరం.





క్రెడిట్‌కార్డు వినియోగంలో జర జాగ్రత్త!

పండగలకు, పెళ్లిళ్లకు, ఇంట్లోకి అవసరమైన వస్తువులను క్రెడిట్ కార్డుతో కొనుగోళ్లు చేస్తున్నారా? అయితే, కొనుగోళ్లు చేసిన ఆ బిల్లులను వాయిదాల్లోకి మార్చాలని అనుకుంటే.. ఒకసారి ఆలోచించండి.

మన దగ్గర ఎంత నిల్వ ఉందో చూసి, దానికనుగుణంగా ఖర్చుపెట్టాలి. కానీ, క్రెడిట్ కార్డుల వల్ల మన దగ్గర లేని డబ్బును కూడా ముందుగానే ఖర్చు చేసేస్తుంటాం. తర్వాత బిల్లులు చెల్లించేప్పుడు ఏం చేయాలో అర్థం కాక, కనీస చెల్లింపు లేదా.. నిర్ణీత మొత్తం కన్నా అధికంగా ఉన్న కొనుగోలును ఈఎంఐలోకి మార్చేస్తాం. ఈ రెండూ పొరపాటే. మనకు తెలియకుండానే అప్పులు చేసేలా పురిగొల్పుతున్నాయి. మన నెల జీతం కన్నా, క్రెడిట్ కార్డు బిల్లు అధికంగా వచ్చిందంటే.. డబ్బు విషయంలో మనం సరైన జాగ్రత్తలు తీసుకోవడం లేదని అర్థం. ఇలాంటి సందర్భం వచ్చినప్పుడు భవిష్యత్తు అవసరాలకు పొదుపు చేసేందుకుగానీ, లేదా అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకునేందుకు, కుటుంబ ఆర్థిక లక్ష్యాలను సాధించేందుకూ వీలుపడదు. ఇలాంటప్పుడు మనం తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తలు...

* ముందుగా చేయాల్సింది.. కనీస చెల్లింపు అనే అవకాశాన్ని వినియోగించుకోకూడదు. ఇలా 'కనీసం' చెల్లిస్తూ వెళ్లడం వల్ల అప్పు భారం పెరిగిపోతుంది. బాకీ ఉన్న మొత్తంపై వడ్డీ చెల్లించాలి. ఇది ఎప్పటికప్పుడు భారంగా మారిపోతుంది. దీనికన్నా.. మీ పొదుపు మొత్తాలను బయటకు తీయండి. వాటితో కార్డు బిల్లులు చెల్లించేయండి. దీనివల్ల మీపై వడ్డీ భారం తగ్గడమే కాకుండా.. క్రెడిట్ స్కోరుకు కూడా ఇబ్బంది కలగదు.
* వాయిదాల్లోకి మార్చుకునేందుకు ప్రయత్నించడం వల్ల కూడా ప్రతినెలా భారం పడుతుంది. ప్రాసెసింగ్ ఫీజుతోపాటు, వడ్డీ కూడా చెల్లించాల్సి వస్తుంది. దీనివల్ల నెలవారీ బడ్జెట్‌పై ప్రభావం పడుతుంది.
* ఒకసారి బిల్లు పూర్తిగా చెల్లించాక.. మళ్లీ ఇలాంటి పరిస్థితి రాకుండా జాగ్రత్తగా ఉండండి. నెలకు రూ.5 వేలైనా అదనంగా పొదుపు చేసేందుకు ప్రయత్నించండి. దీనివల్ల మీకు అత్యవసర నిధి పోగవుతుంది. అవసరం వచ్చినప్పుడు ఈ డబ్బునే వాడుకునే వీలుంటుంది. అనవసర ఖర్చు తగ్గించాలి..అప్పుడే ఆర్థిక క్రమశిక్షణ మెరుగుపడుతుంది.
* ఒక కార్డు చాలు.. మరీ కావాలనుకుంటే.. మరోటి. ఇలా రెండు కార్డులు ఉంటే చాలు. కార్డులు ఎక్కువవుతున్న కొద్దీ కష్టాలు కూడా పెరుగుతాయి. వీలైతే కార్డులన్నింటికీ ఒక్క రూపాయి అప్పు లేకుండా చెల్లించి, ఎక్కువ పరిమితి ఉన్న రెండు కార్డులను ఉంచుకోండి. కొన్నిరోజుల పాటు డెబిట్ కార్డును మాత్రమే అలవాటు చేసుకుంటే.. అప్పుల తిప్పలు తప్పుతాయి. ఆ తర్వాత మీరు బిల్లు కచ్చితంగా చెల్లిస్తామని నమ్మకం వచ్చిన తర్వాత క్రెడిట్ కార్డును వాడవచ్చు.



రియల్ ఎస్టేట్‌లో.. పారదర్శకత, జవాబుదారీతనం

- అక్రమాలకు చెక్‌పెట్టే దిశగా ప్రభుత్వ యోచన
- ఓ వైపు డిటిసిపి, మరో వైపు హెచ్‌ఎండిఎ
- సిద్ధమవుతోన్న అక్రమ లేఅవుట్ల నివేదిక

అనుమతిలేని లే అవుట్లలోని ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేయరాదు... అంటూ హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్‌ఎండీఏ) ప్రభుత్వానికి విన్నవిస్తూ వస్తుంది. కానీ, ప్రభుత్వం అందుకు సానుకూలంగా నిర్ణయం తీసుకోవడంపై దృష్టిసారించింది. గతంలో పురపాలక విభాగం ఉన్నతాధికారులతో సమావేశమైన అథారిటీ అధికారులు సంస్థకు ఆదాయాన్ని పెంచేవిధంగా, ప్రజలకు మేలు చేసేట్టుగా రిజిస్ట్రేషన్ చట్టం వినియోగంలో మార్పులు తప్పనిసరిగా తీసుకురావాలని స్పష్టంచేసింది. అలాగే, అంతకుముందు ఉన్నతస్థాయిలో పలుమార్లు జరిగిన సమావేశాల్లోనూ హెచ్‌ఎండీఏ తన పరిధిలోని అక్రమలేఅవుట్లలో రిజిస్ట్రేషన్ల నిలిపివేత వల్లనే ఇటు రియల్టర్లలో... అటు కొనుగోలుదారుల్లో మార్పును తీసుకురావడం సాధ్యమని గట్టిగా వాధిస్తూ వస్తోంది. అయితే, ప్రభుత్వం హెచ్‌ఎండీఏకు తనవంతు సహకారాన్ని అందించే దిశగా యోచిస్తున్నట్టు అధికారులు వెల్లడిస్తున్నారు. అథారిటీ పరిధిలో పుట్టగొడుగుల్లా వెలసిన అక్రమ లేఅవుట్లపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాన్ని తీసుకోవడం వల్లనే సంస్థ విస్తరిత ప్రాంతం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందుతుందని, రవాణా వ్యవస్థ ప్రపంచస్థాయిలో ఉంటుందనే యోచనలో ఉన్నది. రియల్టర్ల ఇష్టారాజ్యానికి చరమగీతం పాడి రియల్ రంగంలో స్పష్టమైన పారదర్శకత, జవాబుదారీ తనంను తీసుకురావాలన్నదే ప్రభుత్వం ప్రధాన యోచన.


జనార్థన్‌రెడ్డి
హెచ్‌ఎండీఏ కమిషనర్

రిజిస్ట్రేషన్ యాక్ట్-19తో రిజిస్ట్రేషన్లు నిషేధం...

రాష్ట్ర రిజిస్ట్రేషన్ యాక్ట్19లోని అండర్ సెక్షన్2(1)(ఇ) ప్రకారంగా అనుమతిలేని అవుట్లలో రిజిస్ట్రేషన్లను నిషేధించే అధికారము ఆ విభాగానికి ఉన్నది. ఈ విషయాన్ని హెచ్‌ఎండీఏ గత కమిషనర్‌లు ప్రధానంగా శాలినీమిశ్రా, చిరంజీవులు, ప్రస్తుత కమిషనర్ బి. జనార్థన్‌రెడ్డిలు ప్రభుత్వానికి వివరించడం జరిగిందని ప్లానింగ్ అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే ప్రభుత్వం ఆ చట్టాన్ని అమలుపరచడానికి సానుకూల సంకేతాలను వెలువరించింది. ప్రస్తుతం ఉన్న చట్టాన్ని, మనం గౌరవిస్తున్న చట్టాన్ని ఇటు ప్రభుత్వానికి, అటు ప్రజలకు ప్రయోజనకరంగా అమలు చేయడంపై పలు స్థాయిల్లో చర్చలు జరుగుతున్నాయి. రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారంగా చర్యలు లేనందునే రియల్టర్‌లు యధేచ్ఛగా భూ వ్యాపారం సాగిస్తున్నారు. ఎకరం నుంచి మొదలుపెడితే వందల ఎకరాల వరకు అక్రమంగా లేఅవుట్లను ఆకర్షణీయంగా ఏర్పాటుచేస్తున్నారు. హెచ్‌ఎండీఏకు ఏటా వందల కోట్ల రూపాయల నష్టాన్ని కలిగిస్తున్నారు. ఇది గ్రహించిన ప్రభుత్వం చట్టాన్ని కార్యరూపంలోకి తీసుకువచ్చే దిశగా అడుగులు వేస్తున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.

రిజిస్ట్రేషన్ల నిషేధంతో లాభాలు...

అనుమతిలేని లేఅవుట్లలోని ప్లాట్ల విక్రయాలపై నిషేధం విధిస్తే.. నాలా చట్టం ప్రకారం రుసుంలు చెల్లించడం జరుగుతుంది. ప్రతి లేఅవుట్‌లో ఎకరానికి మార్కెట్ విలువలో 3 శాతం రుసుంల రూపేణా ఆదాయం వస్తుంది. అభివృద్ధి రుసుంలు హెచ్‌ఎండీఏకు చేరుతాయి. అనుమతి ఉన్న లేఅవుట్‌లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు జరగడంతో ఆ విభాగానికి ఆదాయం చేకూరుతుంది. అక్రమలేఅవుట్లలో ప్లాట్లు రిజిస్ట్రేషన్‌లు చేయడంతో కేవలం రిజిస్ట్రేషన్‌లతోనే ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుంది. నాలా రుసుంలు, అథారిటీ అభివృద్ధి రుసుంలు ప్రభుత్వానికి చేరవు. ప్రజలకు సమస్యలు తలెత్తవు.

అనుమతిలేనివి 1000 లేఅవుట్లు...

హెచ్‌ఎండీఏ పరిధిలో అనుమతిలేకుండా వెలసిన లేఅవుట్లు 1000లుగా ప్లానింగ్ అధికారులు గుర్తించారు. వీటికి ప్లానింగ్‌లో స్పష్టంగా పేర్కొన్న నియమనిబంధనల్లోని ప్రొవిజనల్ ఆర్డర్(పిఓ), కన్ఫర్మేషన్ ఆర్డర్(సిఓ) అనే హెచ్చరికల నోటీసులను అందించినా స్థానిక సంస్థలులు తగిన చర్యలు తీసుకోవడంలో ఉదాసీ నతగా వ్యవహరిస్తున్నాయి. దీనిని తీవ్రంగా పరిగణిం చిన ప్రస్తుత కమిషనర్ జనార్థన్‌రెడ్డి అనుమతిలేని లేఅవుట్లను గుర్తించి నివేదికను సిద్ధంచేస్తున్నారు.

కఠిన చర్యలకు ఉపక్రమిస్తే..

ప్రభుత్వంలోని పెద్దలు, ప్రజాప్ర తినిధులు, ఉన్నతస్థాయి అధికారులు వత్తిడిలు తీసుకొస్తు న్నారని హెచ్‌ఎండీఏ వర్గాలు పేర్కొంటున్నాయి. వందల ఎకరాల్లో అనుమతి లేకుండా లేఅవుట్లు గతంలో పుట్టుకొ చ్చాయి. ఇవి రావడం వల్ల అటు ప్రభుత్వానికి రావాల్సిన నాలా(నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ అస్సెస్‌మెంట్ యాక్ట్) రుసుంలు, హెచ్‌ఎండీఏకు చేరాల్సిన అభివృద్ధి రుసుంలకు పుల్‌స్టాప్ పడింది. లేఅవుట్ అనుమతిని తీసుకోవాలంటే ముందుగా భూమిని నాలా చట్టం ప్రకారం భూవినియోగ మార్పిడి చేసుకోవాలి. అనంతరం అభివృద్ధి రుసుంలను అథారిటీకి చెల్లించాలి. కానీ, ఈ రెండు రుసుంలను ఎగవేస్తూ, లేఅవుట్ నియమనిబంధనల ప్రకారం రోడ్డు వెడల్పులు, విధిగా వదలాల్సిన 10 శాతం ఖాళీ ప్రదేశాన్ని, పార్కుకు స్థలాన్ని వదలకుండా ఆ స్థలాన్ని కూడా ప్లాట్లుగాచేసి విక్రయించి రియల్టర్లు ధనవంతులుగా ఎదుగుతున్నారు. హెచ్‌ఎండీఏకు ఆర్థిక నష్టాన్ని కట్టబెడుతున్నారు. దీనిని తీవ్రంగా తీసుకున్న కమిషనర్ వాటికి చరమగీతం పాడేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి అవరోధం...

అనుమతిలేని లేఅవుట్లు ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి అవరోధంగా మారుతున్నాయి. భవిష్యత్ ప్రజానికానికి క్రమపద్ధతి జీవనానికి ఊతమిచ్చే వెడల్పైన రోడ్లు, నాణ్యమైన డ్రైనేజీ ఏర్పాటు, ఆధునిక జీవవైవిధ్యమైన పార్కులు, బహుళ ప్రయోజనాలకు అనుగుణంగా ఖాళీ స్థలాలు ప్రతిలే అవుట్‌లో ఉండాలని చట్టం చేసిన ప్రభుత్వం వాటిని అమలులోకి తీసుకరావడంలేదు. టౌన్‌ప్లానింగ్ విభాగాన్ని మరింత పటిష్టం చేసేందుకు ప్రత్యేకంగా జీఓలు తీసుకొచ్చిన ప్రభుత్వం అనుమతి లేని లేఅవుట్లపై కొరడా ఝులిపించేందుకు సన్నాహాలు చేస్తున్నది.

హెచ్‌ఎండీఏ పరిధిలోని అక్రమలేఅవుట్ల జాబితా ఇది...

రంగారెడ్డి జిల్లా పరిధిలో సుమారు 550, నల్లగొండ జిల్లాలో 120, మహబూబ్‌నగర్ జిల్లాలో 20, మెదక్ జిల్లాలో 80, ఘట్‌కేసర్ జోనల్ పరిధి 50, మేడ్చెల్ జోనల్ పరిధిలో 120, శంకర్‌పల్లి జోనల్ పరిధిలో సుమారు 110 అక్రమలే అవుట్‌లు ఉన్నట్టు అధికారులు సూచనప్రాయంగా వెల్లడిస్తున్నారు. వీరు గుర్తించనివి మరో 500 వరకు ఉంటాయనేది అంచనా. వీటిపై చర్యలు తీసుకోని స్థానిక సంస్థ లపైనా విభాగపరమైన చర్యలు తీసుకునే దిశ గా కమిషనర్ యోచిస్తున్నారు.

కఠినంగా రెరా

రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత, జవాబుదారీతనం స్పష్టంగా ఉండేలా తెలంగాణ ప్రభుత్వం దృష్టిసారించింది. అన్ని వర్గాల వారికి మేలు జరిగేలా ఇటు రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా)ను అమలులోకి తీసుకువచ్చింది. మరో వైపు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్‌ఎండిఎ) పరిధిలో అక్రమ లేఅవుట్లను నియంత్రించేందుకు రిజిస్ట్రేషన్ చట్టంలో మార్పులు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నది. ఈ రెండు సంస్థలు సమర్థ వంతంగా పనిచేసేలా ప్రభుత్వం తగు సూచనలు చేస్తున్నది. 500 చ.గ.లకు లోబడి ఉన్న, 8 ఫ్లాట్ల కులోబడి ఉన్న భవన నిర్మాణాలు మినహా యించి జనవరి 1, 2017 తర్వాత అనుమతులు పొందిన ప్రతి రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు రెరా చట్టం ప్రకారంగా రెరా సంస్థలో రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి చేసింది ప్రభుత్వం. ఈ క్రమంలోనే 2018 సెప్టెంబర్ 1నుంచి రెరాలో పథకా లను నమోదు చేసే ప్రక్రియను అమలు చేస్తున్నది. నవంబర్ 30 వరకు 2017(90 రోజులు)లో అనుమతులు పొందిన రియల్ ప్రాజెక్టులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని స్పష్టం చేసిన రెరా ఆ గడువు ముగియగానే రూ. 50 వేలు జరిమానాతో మరో 15 రోజులు గడువునిచ్చింది. అనంతరం రూ. 1.00 లక్ష జరిమానాతో డిసెంబర్ 31 వరకు తుది గడువును పొడిగించింది. ఆ గడువు ముగిసిన తర్వాత రూ. 2 లక్షలు జరిమానాతో జనవరి 15 వరకు ప్రాజెక్టులు రెరాలో నమోదు చేసుకోవాలని హెచ్చరించింది. కానీ, రియల్ ఎస్టేట్ సంస్థలు రెరాలో నమోదుకు అంతగా ముందుకు రావడంలేదు. 2017లో సుమారు 5 వేల రియల్ ఎస్టేట్ పథకాలు పలు అధికారిక సంస్థల నుంచి అనుమతులు పొంది యున్నాయని, అందులో సగం వరకు కూడా పథకాలు రెరాలో నమోదు చేసుకోలేదని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. దీంతో రెరా తన చట్టాన్ని కఠినం గా అమలు చేయాలని భావిస్తున్నది. రాష్ట్రంలో పట్టణా భివృద్ధి సంస్థలు, పురపాలక సంస్థలు, పరుపాలక సంఘా లు, డిటిసిపిలు మంజూరు చేసిన రియల్ ఎస్టేట్ పథకాల జాబి తాను సేకరించి ఆ వివరాల ప్రకారంగా నేరుగా తనిఖీ లు చేసేందుకు ప్రత్యేక బృందాలను తయారు చేస్తున్నది. రెరాలో రిజిస్ట్రేషన్‌లు లేకుండా ప్రచారం చేసుకో వడం, ప్రకటనలు వెలువరించడం, విక్రయాలు చేయడం వంటివి చేయరాదని, అలా జరుగుతుంటే మాత్రం సంబం ధిత ప్రాజెక్టులపై జరిమానా కొరడా ఝులిపించాలని రెరా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది.


విధ్యాధర్,డిటిసిపి డైరెక్టర్

మంచె మహేశ్వర్

సరికొత్త ఓవెన్

ఈ రోజుల్లో ఓవెన్ అనేది ప్రతి ఇంట్లోనూ ఉంటుంది. కానీ, ఓవెన్ ఎంత ప్రత్యేకం అనేదే ఇక్కడ విషయం. ఎందుకంటే ప్రస్తుతం మార్కెట్లో సాధారణ ఓవెన్‌లకు కాలం చెల్లింది. ప్రముఖ కంపెనీలు కొత్త తరహాలోలో ఓవెన్‌లను తయారుచేస్తున్నాయి. పలు రకాల బ్రాండెడ్ కంపెనీలు ఓవెన్లను అందిస్తున్నాయి. వీటి ధరలు రూ.5-40 వేల వరకున్నాయి.



సాధారణ మోడల్, గ్రిల్‌తో కూడిన ఓవెన్, కన్వెన్షన్ వంటి మూడు రకాల ఓవెన్లు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి.

* రీ హీట్ కోసమైతే బేసిక్ ఓవెన్ మంచిది. బేకింగ్, గ్రిల్లింగ్ పదార్థాలను ఎక్కువగా వండుతున్నట్లయితే మైక్రోవేవ్ విత్ గ్రిల్ కొనడం మంచిది.
* మెకానికల్ కంట్రోల్‌గా పనిచేసేవైతే సాధారణ గృహిణులు వాడేందుకు వీలుగా ఉంటాయి. ఎక్కువగా వాడినా.. ఏ రకంగా వినియోగించినా ఇబ్బంది ఉండదు.
* సింగిల్ టచ్ రోటరీ ప్యానల్ కూడా మెకానికల్ కంట్రోల్స్‌ని పోలి ఉంటుంది. కాకపోతే వాడుతున్నప్పుడు ఇది కాస్త సున్నితంగా అనిపిస్తుంది.
* ఎలక్ట్రానిక్ ప్యానల్ ఉన్న ఓవెన్‌లో విద్యుత్ స్థాయిలను కూడా చూపిస్తుంది.
* కళ్లు కనిపించని వాళ్లు, కంటి చూపు సమస్య ఉన్నవారూ టాక్‌టైల్ కంట్రోల్ ఓవెన్‌లు ఎంతో సహాయపడతాయి.

చిన్నపిల్లలున్న ఇంట్లో చైల్డ్ సేఫ్టీ లాక్, ఎలక్ట్రానిక్ లాక్ ఉన్న ఓవెన్లను తీసుకోవడం ఉత్తమం.

విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి



ఈ మధ్య బిల్డర్లు చెప్పేది ఒకటి చేసేది మరొకటిలా ఉంటుంది. ఎక్కువగా గేటెడ్ కమ్యూనిటీల్లో ఫ్లాట్లు అమ్ముడవడానికి నానా తంటాలు పడుతుంటారు. వాటి నిర్మాణం పూర్తయి, నివాసితుల సంఘానికి అప్పజెప్పాక గానీఅసలు విషయం బయటపడదు. వీధుల్లో ఏర్పాటుచేసిన ఆధునిక విద్యుత్ దీపాలకు వచ్చే బిల్లును చూసి బిక్కమొగం వేయాల్సిందే. అలా జరక్కుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు.

* పెద్దపెద్ద భవనాలు, విలాసవంతమైన విల్లాల్లాంటి ఏ నిర్మాణమైనా సరే వాటి నిర్వహణ విషయంలో మాత్రం బిల్లులు మోతయోగిస్తుంటాయి. ముఖ్యంగా విద్యుత్ బిల్లుల భారాన్ని తప్పించుకోవాలంటే సౌర విద్యుత్ దీపాలనే వినియోగించాలి. ప్రాజెక్ట్ ఆవరణలో, సెల్లార్లలో సాధారణ విద్యుత్ దీపాల స్థానంలో సౌర వీధి దీపాల్ని ఏర్పాటు చేసుకుంటే , నిర్వహణ ఖర్చు తగ్గుతుంది.
* సోలార్ లైట్లు రెండు రకాలుగా ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక్కో స్తంభం మీద ఒక్కో దీపం ఏర్పాటు చేసుకోవచ్చు. దీన్ని స్టాండ్ ఎలోన్ సిస్టం అంటారు. మనకెన్ని కావాలో అన్ని వీధి దీపాలను ఏర్పాటు చేసుకోవచ్చు. దీనిలోని ప్రతికూలత ఏంటంటే.. ఈ పరికరంపై ఎండ నేరుగా పడితేనే పని చేస్తుంది. అపార్ట్‌మెంట్ నీడ పడితే పని చేయదు. రెండో రకానికొస్తే.. అపార్ట్‌మెంట్ పైకప్పు మీద సోలార్ ఫొటో వోల్టెక్ (ఎస్‌పీవీ) మాడ్యూళ్లను ఏర్పాటు చేస్తారు. ఇక్కన్నుంచి కేబుళ్ల ద్వారా విద్యుత్‌ను వీధి దీపాలకు సరఫరా చేస్తారు. ఈ విధానంలో గేటెడ్ కమ్యూనిటీల్లో ఒక కిలో వాట్ సోలార్ పవర్‌ప్యాక్ ఏర్పాటు చేసుకుంటే 25 వీధి దీపాలకు విద్యుత్‌ను సరఫరా చేయవచ్చు. దాదాపు 12 అడుగులుండే ఒక్కో స్తంభానికి 9 వోల్టుల ఎల్ఈడీ లైట్‌ను బిగించుకోవచ్చు. ఇది ఎంతలేదన్నా 30 అడుగుల దూరం దాకా వెలుగునిస్తుంది. దీని కోసం ఎంతలేదన్నా రూ.2 నుంచి 4 లక్షల వరకు ఖర్చవుతుంది. ఇందులో నుంచి 30 శాతం సబ్సిడీగా అందజేస్తారు. పరికరాన్ని బట్టి, దాని పనితీరు, పవర్ బ్యాకప్ ఆధారపడుతుందని గుర్తుంచుకోండి. ఇక బ్యాటర్ బ్యాకప్ విషయానికొస్తే.. 3 రోజుల దాకా విద్యుత్ ప్రసారంలో ఎలాంటి అంతరాయం ఉండదు. మరింత ఎక్కువ కాలం సరఫరా కోరుకునేవారు కాస్త ఖర్చెక్కువ పెట్టాల్సి ఉంటుంది. దీంతోపాటు అధిక సామర్థ్యం గల సోలార్ మాడ్యూళ్లను కొనాల్సి ఉంటుంది. దానికి తగ్గట్టు లైట్లనూ ఎంచుకోవాలి.



ఇంటి అందాన్ని పెంచేలా...

ఆధునిక కాలంలో ప్రతీది భిన్నంగా ఉండేందుకు మొగ్గు చూపుతున్నారు నేటి తరం..ఇందులో భాగంగా డైనింగ్ టేబుల్ ఆకారం, నాణ్యతలో కాలానుగుణంగా అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సౌకర్యంతో పాటూ ఇంటి అందాన్ని రెట్టింపు చేసే డైనింగ్ టేబుల్ డిజైన్స్‌కు వినియోగదారులు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో డిజైనర్లు ఆ తరహా టేబుల్స్‌ను రూపొందిస్తున్నారు. ప్రీమియం రకం డైనింగ్ టేబుల్స్ అయితే అవసరమైనప్పుడు డైనింగ్ టేబుల్‌లా ఉపయోగించుకొని మిగిలిన సందర్భంలో మడతపెట్టి పక్కన పెట్టే విధంగా తయారుచేస్తున్నారు. మరికొన్ని రకాల టేబుల్స్ కింద పాత్రలు, ప్లేట్స్ పెట్టుకునే విధంగా అరలు కూడా ఉంటున్నాయి. ఎవరి కుటుంబ అవసరాలకు, అభిరుచులకు తగ్గట్టుగా వివిధ రకాల డైనింగ్ టేబుల్స్ మార్కెట్లో లభ్యమవుతున్నాయి.

* వంటగది ఓపెన్‌గా ఉన్నప్పుడు హాల్‌లోనే ఒక పక్కన డైనింగ్ టేబుల్ ఏర్పాటు చేసుకోవచ్చు. హాల్ సైజ్‌కు అనుగుణంగా టేబుల్ సైజ్ ఉండేలా చూసుకుంటే మంచిది. టేబుల్ మరీ పెద్దగా ఉండటం వల్ల హాల్ లేదా వంటగది చిన్నగా లేదా ఇరుగ్గా కనిపిస్తుంది. పిల్లలు ఉన్న ఇంట్లో గ్లాస్ డైనింగ్ టేబుల్‌కు బదులుగా స్టోన్ ఫినిష్ ఉన్న టేబుల్‌ను లేదా ఉడెన్ టేబుల్‌ను ఎంచుకోవటం మంచిది. కిచెన్‌లో ఏమాత్రం అవకాశం ఉన్నా ఇద్దరు లేదా ఒక్కరు కూర్చొని తినేందుకు వీలుగా ఉండే చిన్నసైజు బ్రేక్‌ఫాస్ట్ టేబుల్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. గ్లాస్ డైనింగ్ టేబుల్ ఉంటే.. దానికి ఉపయోగించిన వుడ్ మెటీరియల్స్ గోడల రంగులకు మ్యాచ్ అయ్యేలా చూసుకుంటే ఇంటి అందం రెట్టింపు అవుతుంది.

హైదరాబాద్ జోన్

నెక్, చికెన్ ధరలు రూపాయల్లో

టోకు గుడ్లు	రూ. 453
రిటైల్ గుడ్లు	రూ. 5.15
ఫారమ్ కోడి	రూ. 87
డ్రెస్డ్ స్కిన్ చికెన్	రూ. 158
స్కిన్‌లెస్	రూ. 180

Vencobb FRESH CHICKEN

చిన్న వ్యాపారులకు ఊరట



- పన్ను మినహాయింపు పరిమితి 40 లక్షలకు పెంపు
- రెండేళ్ల వరకు కేరళకు విపత్తు సెస్
- జిఎస్‌టి మండలి సమావేశంలో నిర్ణయం



న్యూఢిల్లీ: చిన్న వ్యాపారులకు జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) నుంచి ఊరట లభించింది. చిన్న, మధ్యతరహా పరిశ్రమ రంగానికి పన్ను మినహాయింపు పరిమితిని రెట్టింపు చేస్తున్నట్టు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు. 2019 ఏప్రిల్ నుంచి ఈ పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని పొందనున్నారు. గురువారం జిఎస్‌టి మండలి 32వ సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇంతకుముందు రూ.20 లక్షల వరకు టర్నోవర్ కల్గిన వ్యాపారాలకు మినహాయింపు ఉండేది. తాజాగా ఈ మినహాయింపును రూ.40 వేలకు పెంచుతూ జిఎస్‌టి మండలి నిర్ణయం తీసుకుంది. కాంపోజిషన్ పథకం కింద ఉండే పరిమితిని కోటి రూపాయలు నుంచి రూ.1.5కోట్లకు పెంచుతున్నామని, ఈ పథకం కింద వ్యాపారులు ప్రతి మూడు నెలలకు ఒకసారి పన్నులు చెల్లించాలని, అయితే రిటర్న్ మాత్రం ఏడాదికి ఒకసారి మాత్రమే దాఖలు చేయాలని జైట్లీ వివరించారు. రెండేళ్ల వరకు అంతర్ రాష్ట్ర అమ్మకాలపై ఒక శాతం విపత్తు సెస్ విధించేందుకు కేరళకు అనుమతి ఇస్తున్నామని జైట్లీ వెల్లడించారు. గత నెలలో జరిగిన జిఎస్‌టి మండలి సమావేశంలో 23 వస్తువులను తక్కువ పన్ను శ్లాబులోకి తీసుకొచ్చింది. మధ్య తరగతి ప్రజలకు ఊరట కలిగించే విధంగా సినిమా టికెట్లు, 32 అంగుళాల వరకు టీవీలు, పవర్ బ్యాంకులు, డిజిటల్ కెమెరాలు, వీడియో గేమ్స్‌పై పన్ను భారం తగ్గించింది. ఈ తగ్గించిన ధరలు జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ప్రజలపై పన్ను భారం పడకుండా ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ ప్రభుత్వం జిఎస్‌టిని సరళతరం చేస్తున్న విషయం తెలిసిందే.

చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు..

ఇప్పటివరకు రూ.20లక్షల టర్నోవర్ కంటే తక్కువ ఉన్న వ్యాపార వర్గాలకు జిఎస్‌టి నుంచి మినహాయింపు ఉంది. ప్రస్తుతం ఈ పరిధిని రూ.40లక్షలకు పెంచుతూ జిఎస్‌టి కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. కాంపోజిషన్ స్కీమ్ పరిధిని కూడా రూ.1.5కోట్లకు పెంచుతూ మండలి నిర్ణయం తీసుకుంది. ఈ స్కీమ్ పరిధిలోకి వచ్చే వారు త్రైమాసికానికి ఓసారి పన్నులు చెల్లిస్తే చాలు. రిటర్న్స్ ఏడాదికి ఓసారి ఫైల్ చేయాలి. కంపోజిషన్ స్కీమ్ పరిధిని కూడా రూ.1.5కోట్లకు పెంచుతూ సమావేశంలో దీనిపై ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నట్టు జైట్లీ తెలిపారు.

కేరళకు విపత్తు పన్ను

కేరళలో వరదల వల్ల ఆర్థికంగా భారీ నష్టం వాటిల్లింది. దీంతో ఆ రాష్ట్రంలో అమ్మకాలపై 1 శాతం విపత్తు పన్ను అదనంగా విధించుకోవడానికి కేరళకు జిఎస్‌టి కౌన్సిల్ అనుమతి ఇచ్చింది. రెండేళ్ల వరకు ఈ అవకాశం ఇచ్చింది. అలాగే ప్రస్తుతం కొన్ని అంశాలపై నిర్ణయాన్ని జిఎస్‌టి మండలి వాయిదా వేసింది. ప్రభుత్వానికి వచ్చే ఆదాయం ఆధారంగా కొన్ని వస్తువుల మీద పన్ను తగ్గించే అంశంపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు జిఎస్‌టిలో ధరల హేతుబద్ధీకరణ మీద నిర్ణయాన్ని ప్రస్తుతానికి పెండింగ్‌లో పెట్టారు.

రియల్ ఎస్టేట్‌పై కమిటీ

రియల్ ఎస్టేట్, లాటరీ మీద జిఎస్‌టి కౌన్సిల్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వీటిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవ్వడంతో ఏడుగురు మంత్రులతో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ రెండు అంశాలపై ఆ కమిటీ నివేదిక వచ్చిన తర్వాత వచ్చే సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.



13 వరకు ఫ్లిప్‌కార్ట్ 'నోకియా డేస్'

న్యూఢిల్లీ: ఇ–కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ సంస్థ తాజాగా నోకియా బ్రాండ్ ఫోన్ కొనాలనుకునే వినియోగదారులకు డిస్కౌంట్లను అందిస్తోంది. గురువారం నుంచి 13వ తేదీ వరకు 'నోకియా డేస్' పేరుతో సేల్‌ని నిర్వహిస్తోంది. నాలుగు రోజుల సేల్‌లో భాగంగా నోకియా 6.1 ప్లస్, నోకియా 5.1 ప్లస్ స్మార్ట్ ఫోన్లపై రూ.1000 డిస్కౌంట్‌తో పాటు అదనంగా యాక్సిస్ బ్యాంకు కార్డులపై 5 శాతం డిస్కౌంట్‌ని అందిస్తోంది. ఈ సేల్ లో భాగంగా నోకియా 6.1 ప్లస్ స్మార్ట్ ఫోన్ రూ.14,999 ధరకి లభించనుండగా, నోకియా 5.1 ప్లస్ స్మార్ట్ ఫోన్ రూ.9,999 ధరకి లభించనుంది.

మార్కెట్లోకి ఒప్పో ఆర్15 ప్రో



న్యూఢిల్లీ: చైనా మొబైల్ తయారీ సంస్థ ఒప్పో సరికొత్త స్మార్ట్‌ఫోన్‌ని దేశీయ మార్కెట్లో విడుదల చేసింది. 'ఒప్పో ఆర్15 ప్రో' పేరిట విడుదల చేసిన ఈ ఫోన్ ధర రూ.25,990గా నిర్ణయించారు. ఈ ఫోన్ వినియోగదారులను ఆకట్టుకునే ఫీచర్లు ఉన్నాయి. ఈ ఫోన్‌లో భారీ డిస్‌ప్లేతో పాటు పవర్ ఫుల్ ర్యామ్‌ని ఏర్పాటు చేశారు. అమెజాన్ లో ప్రత్యేకంగా లభించనున్న ఈ ఫోన్ పై భారీ ఎక్స్ఛేంజ్ డిస్కౌంట్ ఆఫర్ కూడా ఉంది. ఎక్స్ఛేంజ్‌కు రూ.8,938 వరకు డిస్కౌంట్‌ని అందిస్తోంది.

4000 ఎంఎహెచ్ బ్యాటరీతో రెడ్‌మి నోట్7

న్యూఢిల్లీ: మొబైల్ మార్కెట్లో ఎంతో క్రేజ్ ఉన్న షియోమీ సంస్థ తాజాగా కొత్త మొబైల్‌ను ప్రవేశపెట్టింది. అయితే చైనాలో 'రెడ్ మీ నోట్7' పేరిట ఈ కొత్త ఫోన్‌ని విడుదల చేసింది. భారీ బ్యాటరీ 4000ఎంఎహెచ్‌తో పాటు 48/5 మెగాపిక్సల్ డ్యూయల్ బ్యాక్ కెమెరాను అందిస్తోంది. 3 జిబి/4జిబి ర్యామ్ తో పాటు 6జిబి వేరియంట్ కూడా మార్కెట్లో లభించనుంది. ట్విలైట్ గోల్డ్, ఫాంటాసి బ్లూ, బ్రైట్ బ్లాక్ రంగులలో ఈ ఫోన్ లభించనుంది. 3జిబి ర్యామ్, 32జిబి ఇంటర్నల్ స్టోరేజ్ ఫోన్ ధర సుమారు రూ.10,300, 4జిబి ర్యామ్, 64జిబి ఇంటర్నల్ స్టోరేజ్ ఫోన్ ధర రూ.12,400గా ఉంది. అలాగే, 6జిబి ర్యామ్, 64జిబి ఇంటర్నల్ స్టోరేజ్ గల ఫోన్ ధరను రూ.14,500గా నిర్ణయించింది.

స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	36,106.50	-106.41	(-0.29%)
నిఫ్టీ	10,821.60	- 33.55	(-0.31%)



కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	70.54
యూరో	81.57
బ్రిటిష్ పౌండ్	90.22
ఆస్ట్రేలియన్ డాలర్	50.58
కెనెడియన్ డాలర్	53.31
సింగపూర్ డాలర్	52.17
స్విస్ ఫ్రాంక్	72.52
చైనీస్ యువాన్	10.38
మలేషియన్ రింగిట్	17.20
న్యూజిలాండ్ డాలర్	47.83
హాంకాంగ్ డాలర్	9.00
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	233.03
సౌతాఫ్రికన్ రాండ్	5.08

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	30750	32887.70	0.79%
ముంబై	31280	33454.55	0%
ఢిల్లీ	31400	33582.89	0.96%
కోల్‌కతా	31750	33957.22	0.57%
కేరళ	29900	31978.61	1.01%
బెంగళూరు	30200	32299.47	1.27%
హైదరాబాద్	30750	32887.70	0.79%
గల్ఫ్	137.68	147.25	0%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42049.00
ముంబై	₹ 42049.00
ఢిల్లీ	₹ 42049.00
కోల్‌కతా	₹ 42049.00
హైదరాబాద్	₹ 42049.00



గర్జించిన టిసిఎస్



- క్యూ3లో నికర లాభం 24 శాతం వృద్ధి
- ఆదాయ వృద్ధి 12.1 శాతం
- 14 త్రైమాసికాల్లో ఇదే అత్యధిక వృద్ధి
- టిసిఎస్ సిఎండి రాజేశ్ గోపీనాథన్ వెల్లడి

న్యూఢిల్లీ: దేశీయ సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం టిసిఎస్(టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) మూడో త్రైమాసికంలోనూ దుమ్మురేపింది. సంస్థ నికర లాభం రూ.8,105 కోట్లతో 24.1 శాతం పెరిగింది. గతేడాది ఇదే సమయంలో టిసిఎస్ నికర లాభం రూ.6,531 కోట్లు మాత్రమే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2018–19) క్యూ3(అక్టోబర్–డిసెంబర్) ఫలితాలను గురువారం టిసిఎస్ ప్రకటించింది. అలాగే మూడో త్రైమాసికంలో టిసిఎస్ ఆదాయంలో 20.8 శాతం వృద్ధిరేటు నమోదు చేసింది. గతేడాదిలోని రూ.30,904 కోట్ల నుంచి రూ.37,338 కోట్లకు ఆదాయం పెరిగింది. కరెన్సీ ఆధారంగా ఆదాయ వృద్ధి 12.1 శాతం నమోదైంది. టిసిఎస్ సిఇఒ, ఎండి రాజేశ్ గోపీనాథన్ మాట్లాడుతూ, డిసెంబర్ ముగింపు నాటి త్రైమాసికంలో సంస్థ ఆదాయం వృద్ధి 12.1 శాతంతో పటిష్ఠ వృద్ధిని నమోదు చేసిందని, దీంతో 2018లో సత్తా చాటామని, గత 14 త్రైమాసికాల్లో ఇదే అత్యధిక వృద్ధి రేటని అన్నారు. బలమైన క్లయింట్లు, డిజిటల్ సేవల్లో అగ్రస్థానంలో ఉండటం, ఎక్కువ ఆర్డర్లు ఉండటంతో వినియోగదారులు టిసిఎస్ సామర్థ్యాలను గుర్తించారని ఆయన తెలిపారు. డిజిటల్ సేవల ద్వారా వచ్చే రాబడి ఆదాయంలో 30.1 శాతంగా ఉండగా వార్షిక వృద్ధి రేటు 52.7 శాతంగా నమోదైంది. కంపెనీ సిఎఫ్ఒ(చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్) వి.రామకృష్ణన్ మాట్లాడుతూ, ఇతర దేశాల కరెన్సీలతో పోలిస్తే రూపాయి ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నా, మార్కెట్లలో వ్యాపార నిర్వహణ ఖర్చులు పెరుగుతున్నా టిసిఎస్ పటిష్ఠమైన లాభాలను నమోదు చేసిందన్నారు. 'మేము మా కార్యకలాపాల్లో నాణ్యతపై దృష్టి పెట్టాం, పటిష్ఠమైన నగదు ప్రవాహం వస్తోంది, లాభాదాయకత మేము అనుకున్న స్థాయికి చేరింది. అదే సమయంలో భవిష్యత్ వృద్ధి కోసం పెట్టుబడుల సరళిని కొనసాగిస్తాం' అని ఆయన అన్నారు. ఇక 2018 అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో టిసిఎస్ 6,827 మంది ఉద్యోగులను నియమించుకుంది. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 4,17,929కి చేరింది. పన్నెండు నెలల ఆధారంగా సంస్థను వదిలేస్తున్న వారి శాతం 11.2 శాతంగా ఉంది.

క్యూ3 ముఖ్యాంశాలు

- ఆదాయం వృద్ధి రూ.37,338 కోట్లు నమోదు. వార్షికంగా 20.8 శాతం వృద్ధి
- కరెన్సీ ఆధారంగా ఆదాయ వృద్ధి 12.1 శాతం నమోదు
- నికర లాభం రూ.8,105 కోట్లు.. 24.1 శాతం వృద్ధి
- ఆపరేటింగ్ మార్జిన్ 25.6 శాతం, వార్షికంగా 0.4 శాతం పెరిగింది
- ఎర్నింగ్ పర్ షేర్ రూ.21.60, వార్షికంగా 26.6 శాతం
- నెట్ క్యాష్ ఫ్రమ్ ఆపరేషన్స్ రూ.8,682 కోట్లు
- డివిడెండ్ పర్ షేర్ రూ.4.00

రామగుండంలో సియెట్ 'మైన్‌మాక్స్' టైర్ల ఆవిష్కరణ

మన తెలంగాణ/ హైదరాబాద్: సియెట్ స్పెషాలిటీ టైర్స్ లిమిటెడ్(సిఎస్‌టిఎల్) టిప్పర్ ట్రక్కులకు అవసరమయ్యే 'మైన్‌మ్యాక్స్' ప్రత్యేక టైర్లను రామగుండంలో ఆవిష్కరించింది. టైర్ బ్రేకర్ ప్లై టెక్నాలజీతో అందుబాటులోకి తెచ్చిన ఈ టైర్లు ఎక్కువ కాలం మన్నిక కలిగి ఉంటాయి. పంక్చర్ రెసిస్టెన్స్ కలిగిన ఈ టైర్లు 11.00–20, 12.00–20, 1200–24 సైజుల్లో ఈ టైర్లు లభిస్తాయి. సియెట్ స్పెషాలిటీ టైర్స్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ గంభీరె మాట్లాడుతూ, రామగుండంలో మైన్‌మాక్స్ టైర్లను ఆవిష్కరించడం తనకెంతో ఆనందాన్ని కల్గించిందని అన్నారు. ఈ టైర్లను భారత్‌లో గనులు అధికంగా ఉండే పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిషా తదితర ప్రాంతాల్లో పరీక్షించామని తెలిపారు. ఈ టైర్లు దేశంలోని అన్ని సియెట్ డీలర్లు, డిస్ట్రిబ్యూటర్ల వద్ద అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ 'సేవ్‌థాన్' రెండో ఎడిషన్



మన తెలంగాణ/ హైదరాబాద్: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ గురువారం 'సేవ్‌థాన్' రెండో ఎడిషన్‌ను ప్రకటించింది. సమాజిక అంశాల పట్ల పౌరుల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు బ్యాంక్ వెల్లడించింది. దీనిలో వార్షిక 10కె, 5కె రన్ నిర్వహించనున్నామని పేర్కొంది. ఈ 'సేవ్‌థాన్' ఫిబ్రవరి 10న సంజీవయ్య పార్క్ నుంచి ప్రారంభిస్తారు. పచ్చదనం కోసం పరుగు పేరిట నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి కిలోమీటర్ ఒక మొక్క నాటనున్నారు. 8000 మంది ఈ వేడుకలో పాల్గొనున్నారని, దాదాపు 25000 వేల మొక్కలను హైదరాబాద్ వ్యాప్తంగా నాటాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నటుడు సందీప్ కిషన్ ఈవెంట్ లోగో టీషర్ట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హెడ్ బ్రాంచ్ బ్యాంకింగ్ (సౌత్) మధుసూదన్ హెగ్డే మాట్లాడుతూ, ప్రపంచంలోని నగరాలు పర్యావరణ సమస్యలను ఎదుర్కొంటున్నాయని, వాటిని పరిష్కరించాల్సి ఉందన్నారు. ప్రతి పౌరుడికి బాధ్యత ఉందని, పచ్చదనం కోసం మొక్కలను నాటాల్సిన అవసరం ఉందన్నారు.

టిసిఎస్ ఫలితాలకు ముందు మార్కెట్లు డీలా

ముంబై: ప్రైవేటు బ్యాంక్, ఫైనాన్స్ వంటి హెవీ వెయిట్ స్టాక్స్‌లో క్షీణత వల్ల మార్కెట్లు పతనమయ్యాయి. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాల కారణంగా ఇన్వెస్టర్లు అమ్మకాలకే ప్రాధాన్యమిచ్చారు. దీంతో ఉదయం నుంచే మార్కెట్లు బలహీనంగా ప్రారంభించి ఆఖరి వరకు అలాగే కొనసాగాయి. కార్పొరేట్ సంస్థల నిరుత్సాహకర గైడెన్స్, యూరోపియన్ స్టాక్ మార్కెట్లు బలహీనంగా కనిపించడంతో దేశీ స్టాక్ మార్కెట్లు కూడా నష్టాలనే కొనసాగించాయి. మార్కెట్ ముగిసేసరికి సెన్సెక్స్ 106 పాయింట్లు క్షీణించి 36,107 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 34 పాయింట్లు బలహీనపడి 10,822 వద్ద స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఇలో ప్రైవేట్ బ్యాంక్స్ 1 శాతం, రియల్టీ 0.3 శాతం నష్టపోయాయి. ఆటో, ఫార్మా 0.3 శాతం చొప్పున పెరిగాయి. నిఫ్టీ దిగ్గజాలలో హెచ్‌పిసిఎల్, ఇండస్‌ఇండ్, గ్రాసిమ్, ఇన్‌ఫ్రాటెల్, మారుతీ, కొటక్ బ్యాంక్, ఐఒసి, బిపిసిఎల్, ఒఎన్‌జిసి, పవర్‌గ్రిడ్‌లు డీలాపడ్డాయి. ఇంకా ప్రధాన స్టాక్స్ అయిన టైటన్, టాటా మోటార్స్, బజాజ్ ఆటో, ఐషర్, ఎన్‌టిపిసి, సిప్లా, ఎంఅండ్ఎం, యుపిఎల్, యస్ బ్యాంక్, ఎయిర్‌టెల్ ఒకటిన్నర శాతం పుంజుకున్నాయి. బిఎస్‌ఇ మిడ్ క్యాప్స్ 0.5 శాతం లాభపడింది. అయితే ట్రేడైన మొత్తం షేర్లలో 1,372 నష్టపోగా, 1,227 షేర్లు లాభాలతో ముగిశాయి. బుధవారం విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పిఐలు) రూ. 276 కోట్లు, దేశీ ఫండ్స్(డిఐఐలు) రూ.440 కోట్లు చొప్పున ఇన్వెస్ట్ చేశాయి.

బ్రిటన్‌లో 5000 ఉద్యోగాల కోత

లండన్: బ్రిటన్‌లో 5 వేల ఉద్యోగాల కోత విధించేందుకు జాగ్వార్ ల్యాండ్ రోవర్ సిద్ధమైందని బిబిసి నివేదిక పేర్కొంది. చైనాలో విక్రయాలు మందగించడం, బ్రెగ్జిట్ ఆందోళనల వల్ల సిబ్బందిని తొలగించనున్నట్టు వెల్లడించింది. భారత్ వాహన దిగ్గజం టాటా మోటార్స్ సంస్థకు చెందిన జాగ్వార్ ల్యాండ్ రోవర్‌కు బ్రిటన్‌లో రూ.40 వేల మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. అయితే జాగ్వార్‌ను ఎఎఫ్‌పి ప్రశ్నించగా, ఉద్యోగాల కోతపై కంపెనీ నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. మార్కెటింగ్, మేనేజ్‌మెంట్, అడ్మినిస్ట్రేషన్‌లలో ఎక్కువగా కోతలు ఉండనున్నాయని బిబిసి నివేదిక పేర్కొంది.



కొన్ని మారుతీ కార్ల ధరలు పెరిగాయ్..

న్యూఢిల్లీ: మారుతీ సుజుకీ కార్ల ధరలు మరింత ప్రియం అయ్యాయి. గురువారం నుంచి కార్ల ధరల పెంపు అమల్లోకి వస్తుందని కంపెనీ ప్రకటించింది. కొన్ని మోడల్ కార్ల ధరలు రూ.10 వేల వరకు పెరగనున్నాయని వెల్లడించింది. ముడి సరుకు, విదేశీ మారకం రేట్లు పెరిగిన కారణంగా ధరలు పెంచాల్సి వచ్చిందని, జనవరి 10 నుంచి పెరిగిన ధరలు అమల్లోకి వస్తాయని సంస్థ స్పష్టంచేసింది. ఏ మోడల్ కార్లపై ధరలు పెరుగుతాయనేది విషయం కంపెనీ వెల్లడించలేదు. ప్రస్తుతం మారుతీ సుజుకీ కార్ల మోడళ్లు ఆల్టో 800 నుంచి ప్రీమియం క్రాసోవర్ ఎస్–క్రాస్ ధరలు రూ.2.53 లక్షల నుంచి రూ.11.45 లక్షల (ఢిల్లీ ఎక్స్‌షోరూం) మధ్య ఉన్నాయి.



"నేను ఇప్పటికీ చెబుతున్నా మోడీ పాత్రకు నేను తప్ప ఇంకెవరూ న్యాయం చేయలేరు. నాకంటే బాగా ఎవరూ నటించలేరు. ఏదేమైనా ఇది ప్రజాస్వామ్య దేశం. ఇక్కడ అందరికీ సమన్యాయం ఉంటుంది. కాబట్టి వివేక్ ఒబెరాయ్ కూడా మోడీ పాత్రను చేయగలరు. 'పిఎం నరేంద్రమోడీ' బయోపిక్‌లో మోడీ పాత్రలో నటిస్తున్న అతనికి అభినందనలు.

– బాలీవుడ్ నటుడు పరేశ్ రావల్



అప్పుడే గ్రీన్ సిగ్నల్


బ్లాక్‌బస్టర్ హిట్ మూవీ 'భరత్ అనే నేను' తర్వాత సూపర్‌స్టార్ మహేష్‌బాబు చేస్తున్న చిత్రం 'మహర్షి'. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఉగాది పండుగ కానుకగా విడుదల కానుంది. అయితే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాకముందే మహేష్ తన నెక్స్ట్ సినిమాల కోసం చర్చలు జరుపుతున్నారు. ఇటీవల 'రంగస్థలం'తో పెద్ద హిట్‌ను అందుకున్న దర్శకుడు సుకుమార్ చాలా రోజుల నుండి మహేష్‌తో సినిమా కోసం స్క్రిప్ట్‌ను సిద్ధం చేస్తున్నారు. అయితే ఇంతవరకు ఈ స్క్రిప్ట్ వర్క్ పూర్తి కాలేదు. గతంలో మహేష్‌బాబు బౌండ్ స్క్రిప్ట్ లేకున్నా సినిమా చేయడానికి ముందుకు వచ్చే వారు కానీ ఇప్పుడు ఈ విషయంలో ఏమాత్రం రిస్క్ తీసుకునేందుకు సిద్ధంగా లేరట. బౌండ్ స్క్రిప్ట్‌తో మహేష్‌ను మెప్పిస్తే కానీ సుకుమార్ సినిమా పట్టాలెక్కే అవకాశం లేదని అంటున్నారు. ఇక సుకుమార్‌తో పాటు మరో యువ దర్శకుడితో సినిమా చేసేందుకు ఈ సూపర్‌స్టార్ ప్లాన్ చేస్తున్నారట. ఇందుకోసం ఇప్పటికే కథలు వింటున్నారట. ఎవరితో సినిమా అయినా కంటెంట్‌తో మెప్పించి... బౌండ్ స్క్రిప్ట్ సిద్ధం చేస్తేనే మహేష్ గ్రీన్ సిగ్నల్ ఇస్తారట. బ్రహ్మోత్సవం, స్పైడర్ చిత్రాలు నిరాశపరచడంతో కొత్త సినిమాల విషయంలో ఈ సూపర్ స్టార్ ఎంతో జాగ్రత్తగా ఉంటున్నారట.



హామీని నిలబెట్టుకుంది!

మెగాస్టార్ చిరంజీవి చిత్రం 'ఖైదీ నంబర్ 150'లోని ఐటమ్ సాంగ్‌లో రత్తాలుగా మైమరపించిన హాట్ బ్యూటీ లక్ష్మీ రాయ్. పవన్‌కళ్యాణ్ చిత్రం 'సర్దార్ గబ్బర్ సింగ్'లోనూ 'తోబా తోబా...' ఐటమ్‌సాంగ్‌తో మురిపించిన ఈ భామ రెగ్యులర్‌గా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తూ ఉంటుంది. తరచుగా తన హాట్ ఫొటోలను అప్‌లోడ్ చేస్తూ కుర్రకారును టీజ్ చేస్తూ ఉంటుంది. ఈ ట్రెండ్‌ను కొనసాగిస్తూ డిసెంబర్ 31న ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా తన హాఫ్ ఫొటో ఒకటి పోస్ట్ చేసింది. ''నేను ఇలా 2018కి బై బై చెబుతున్నాను. ఈ ఏడాదికి ఇది నా లాస్ట్ పోస్ట్. 2019లో నేను ఫుల్ ఫొటోను పోస్ట్ చేస్తాను'' అంటూ నెటిజన్లకు హామీ ఇచ్చింది. ఆ హామీని తాజాగా నిలబెట్టుకుంది ఈ భామ. అదే బ్లూ కలర్ బికినీ ఫొటోను పోస్ట్ చేస్తూ... 'ఇప్పుడు నన్ను నేను ప్రేమిస్తున్నాను. ఎందుకంటే ఇలా కనిపించేందుకు చాలా కష్టపడ్డాను''అని పేర్కొంది. బ్లూ కలర్ బికినీలో పాలరాతి శిల్పంలాంటి మేని రంగుతో స్లిమ్‌గా కనిపించిన లక్ష్మీ రాయ్ ఫొటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇక సినిమాల విషయానికి వస్తే త్వరలో 'వేర్ ఈజ్ ది వెంకటలక్ష్మి' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది ఈ భామ.

ప్రతి హీరోకు అదే చేస్తా


బోయపాటి శ్రీను

రామ్‌చరణ్, కియారా అద్వానీ హీరోహీరోయిన్లుగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వినయ విధేయ రామ'. డి.వి.వి. దానయ్య నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు బోయపాటి శ్రీనుతో ఇంటర్వ్యూ విశేషాలు...

కుటుంబం పట్ల విధేయుడు..

వినయం, విధేయత ఉంది కాబట్టే రాముడు దేవుడయ్యాడు. ఇక మా సినిమాలో రాముడు కుటుంబం పట్ల విధేయుడు. ఈ విధేయత ఏ స్థాయిలో ఉంటుందనేది సినిమాలో చూస్తారు.

భావోద్వేగాలకే ప్రాధాన్యత..

నేను చేసిన 'భద్ర' నుండి మొదలుపెట్టి 'వినయ విధేయ రామ' వరకు కుటుంబ భావోద్వేగాలకే తొలి ప్రాధాన్యత ఉంటుంది. ఆతర్వాతే సమాజం గురించి. కథలో ఇంకా స్కోప్ ఉందనుకుంటే ఇతర విషయాల గురించి ఆలోచిస్తా.

ఇదే సరైన సమయం..

ఈ సినిమా ట్రైలర్‌లో రామ్‌చరణ్‌ను చూస్తే ఐరన్‌మ్యాన్‌లా కనిపిస్తాడు. ఆ బాడీలో ఈరోజు ఉన్న పర్‌ఫెక్షన్ నాలుగేళ్ల క్రితం లేదు. అందుకే పర్ఫెక్షన్ కోసం సమయం తీసుకోవాల్సి వచ్చింది. ఈ సినిమాకు ఇదే సరైన సమయం. 'వినయ విధేయ రామ' విజన్ నుండి విజువల్ వరకు ఉన్న మెయిన్ కనెక్టివిటీ రామ్‌చరణ్. ఆయన లేకపోతే ఇది సాధ్యపడేది కాదు.

ఎదుగుతూనే ఉంటాడు..

నాకు రామ్‌చరణ్‌లో ఎక్కువగా నచ్చింది ఒక్కటే. ఆయనకు అస్సలు తృప్తి ఉండదు. ఎంత సాధించినా ఇంకా ఏదో చేయాలి అనుకుంటూ ఉంటాడు. సినిమా సినిమాకు ఎదుగుతూనే ఉంటాడు. ఇంకా ఆశగా చూస్తూనే ఉంటాడు.

బాగా ఆలోచించి తీసుకున్నాం

మాస్, ఫ్యామిలీ ఎలిమెంట్స్‌తో పాటు ఒక కొత్త పాయింట్‌ను 'వినయ విధేయ రామ'లో చూపించాం. అది ప్రేక్షకులకు నచ్చుతుంది. సినిమాలోని క్యారెక్టర్స్‌కు సరిగ్గా సరిపోయే నటులను మాత్రమే తీసుకున్నాం. ఒక ఐఏఎస్ ఆఫీసర్, హీరోకు పెద్దన్నయ్య అన్నప్పుడు... ఎవరిని తీసుకున్నా ఆ పాత్రకు పూర్తిగా సరిపోవాలి. అందుకే ఈ పాత్రకు ప్రశాంత్‌ను తీసుకున్నాం. అలా వరుసగా ప్రతి పాత్రకు బాగా ఆలోచించి నటులను తీసుకోవడం జరిగింది.

వెంటనే డేట్స్ ఇచ్చేశాడు..

ఈ సినిమా కోసం వివేక్ ఒబెరాయ్‌ను కలిసినప్పుడు 'రక్త చరిత్ర' స్థాయి సినిమా అయితేనే చేస్తానన్నాడు. అయితే తన క్యారెక్టర్ గురించి చెప్పగానే వెంటనే డేట్స్ ఇచ్చేశాడు. అదే కమిట్‌మెంట్‌తో సినిమా చేశాడు.

ఇది కూడా అలాంటిదే..

ఏ హీరోతో సినిమా చేసినా ఆ హీరోకు అభిమానినై చేస్తా. చరణ్ కోసం సినిమా రాసుకున్నప్పుడు కూడా ఫ్రంట్ సీట్లో కూర్చొని చూస్తున్నట్లుగా ఫీలై కథ రాసుకున్నా. ప్రతి హీరోకు అదే చేస్తా. ఇది కూడా అలాంటి సినిమానే.

కలర్‌ఫుల్‌గా ఉండాలి..

నా దృష్టిలో సినిమా అంటే కలర్‌ఫుల్‌గా ఉండాలి. అందుకే ఎక్కువగా అర్బన్ బ్యాక్‌డ్రాప్‌లో కథలను ఎంచుకుంటాను. అందుకే నా ప్రతి సినిమాలో రిచ్ ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్ కనిపిస్తుంది.

దమ్ము తప్పనిసరిగా..

నేను చిన్న సినిమాలు చేయలేను. నా నుండి ప్రేక్షకులు ఏదైతే ఆశిస్తున్నారో అది వంద శాతం ఇవ్వాలని అనుకుంటాను. అవతల అంచనాలు ఒకలా ఉండి... మన ప్రోడక్ట్ ఇంకోలా ఉంటే మ్యాచ్ అవ్వదు. అందుకే నేను చిన్న సినిమాలు చేయను. ఒకవేళ నేను బయోపిక్ చేసినా అందులో కూడా దమ్ము తప్పనిసరిగా ఉంటుంది.



క్రేజీ స్టార్‌కు జోడీగా..



బ్లాక్‌బస్టర్ హిట్స్ అర్జున్ రెడ్డి, గీత గోవిందం సినిమాలతో టాలీవుడ్‌లో యంగ్‌స్టార్‌గా దూసుకుపోతున్నారు విజయ్ దేవరకొండ. గత ఏడాది తెలుగు బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ యువ కథానాయకుడు ప్రస్తుతం 'డియర్ కామ్రేడ్' చిత్రంలో నటిస్తున్నారు. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న ఈ చిత్రం వేసవి చివరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. 'డియర్ కామ్రేడ్' చిత్రం పూర్తయిన తర్వాత క్రాంతిమాధవ్ దర్శకత్వంలో కె.ఎస్.రామారావు నిర్మాణంలో విజయ్ దేవరకొండ ఓ చిత్రం చేయబోతున్నారు. ఇప్పటికే ఈ సినిమా పూజా కార్యక్రమాలు కూడా జరిగాయి. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కాబోతున్న ఈ సినిమాలో హీరోయిన్‌ను తాజాగా ఫైనల్ చేశారు. విజయ్‌కు ఉన్న క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం ఆయనతో కలిసి నటించడానికి ఏ హీరోయిన్ అయినా నటించేందుకు ఆసక్తి చూపడం ఖాయం. ఈ నేపథ్యంలో దర్శకుడు క్రాంతిమాధవ్ యంగ్ బ్యూటీ కేథరిన్‌ను ఈ సినిమాలో హీరోయిన్‌గా ఎంపిక చేశారని తెలిసింది. అందంతో పాటు మంచి నటనా ప్రతిభ ఉన్న కేథరిన్‌కు తెలుగులో ఇప్పటివరకు మంచి అవకాశం దక్కలేదు. దీంతో ఇంకా ఆమె సెకండ్ గ్రేడ్ హీరోయిన్‌గానే ఉంది. అల్లు అర్జున్‌తో 'సరైనోడు' చిత్రంలో నటించిన ఈ బ్యూటీ ఇప్పుడు విజయ్ దేవరకొండకు జోడీగా ఎంపికైంది. కేథరిన్ తెలుగులో రానా చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి' తర్వాత మరే సినిమా చేయలేదు. తమిళం, హిందీలో అడపా దడపా అవకాశాలైతే వస్తున్నాయి కానీ ఆమెకు స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు మాత్రం దక్కడం లేదు. క్రాంతిమాధవ్ ఇచ్చిన ఈ ఆఫర్‌తో అయినా కేథరిన్ తెలుగులో స్టార్‌డమ్‌ను దక్కించుకుంటుందేమో చూడాలి

కీర్తిసురేష్‌తో మహేష్ కోనేరు చిత్రం ప్రారంభం


కళ్యాణ్ కోడూరి, నరేంద్ర, కీర్తిసురేష్, కల్యాణ్‌రామ్, మహేష్ కోనేరు

'మహానటి' చిత్రంలో సావిత్రి పాత్రలో అద్భుతంగా నటించి ప్రేక్షకులను మెప్పించిన కీర్తిసురేష్ ప్రధాన పాత్రలో ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కే కొత్త చిత్రం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ సెవెన్ ఏకర్స్‌లో ప్రారంభమైంది. నరేంద్ర దర్శకత్వంలో మహేష్ కోనేరు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి నందమూరి కల్యాణ్‌రామ్ క్లాప్ కొట్టగా... దర్శకుడు వెంకీ అట్లూరి, నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. దేవుడి పటాలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు ఎస్.హరీష్ శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా జరిగిన పాత్రికేయుల సమావేశంలో కీర్తిసురేష్ మాట్లాడుతూ ''తెలుగులో 'మహానటి' తర్వాత నటిస్తున్న సినిమా ఇది. మహిళా ప్రధానమైన చిత్రంలో నటిస్తుండడంతో చాలా సంతోషంగా ఉంది. ప్రతి అమ్మాయికి కనెక్ట్ అయ్యే సినిమా ఇది. ఎక్కువ భాగం యుఎస్‌లో చిత్రీకరణ జరుపుకోనుంది ఈ చిత్రం. దర్శకుడు నరేంద్ర మంచి కథను సిద్ధం చేశారు''అని అన్నారు. దర్శకుడు నరేంద్ర మాట్లాడుతూ ''2016 నుండి ఈ కథపై వర్క్ చేస్తున్నాను. అన్ని భావోద్వేగాలు కలగలిసిన కథ ఇది. ఈ కథకు కీర్తిసురేష్ తప్ప మరెవరూ సరిపోరు. 25 శాతం ఇండియాలో 75 శాతం యుఎస్‌లో చిత్రీకరణ జరుగనుంది. ఏప్రిల్‌లో యుఎస్ షెడ్యూల్‌ను ప్లాన్ చేస్తున్నాం. ఫిబ్రవరిలో షూటింగ్ ప్రారంభమవుతుంది''అని తెలిపారు. నిర్మాత మహేష్ కోనేరు మాట్లాడుతూ ''మహిళా ప్రధానమైన చిత్రమిది. ప్రతి అమ్మాయి తన జీవితంలో ఎక్కడో ఒక చోట ఇలాంటి సందర్భాన్ని ఎదుర్కొనే ఉంటుంది. మహిళలకు కనెక్ట్ అవుతుంది ఈ చిత్రం''అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మ్యూజిక్ డైరెక్టర్ కల్యాణ్ కోడూరి పాల్గొన్నారు.

14న పాటల వేడుక



కార్తి, రకుల్‌ప్రీత్ సింగ్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న 'దేవ్' సినిమా విడుదల తేదీ ఖరారైంది. వాలెంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 14న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా సినిమా ఆడియో వేడుక తేదీని కూడా ఖరారు చేశారు దర్శక నిర్మాతలు. ఈనెల 14న 'దేవ్' ఆడియో విడుదల కానుంది. హరీష్ జయరాజ్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. రజత్ రవిశంకర్ దర్శకత్వంలో ఈ యాక్షన్, ఫ్యామిలీ డ్రామా రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి. నిక్కీ గల్రానీ సెకండ్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః ఆర్.వేల్‌రాజ్, ఆర్ట్ః రాజీవన్, ఎడిటర్ః రూబెన్.



పోటీ

సిపాయిల తిరుగుబాటు ఎప్పుడు?

ఎస్ లక్ష్మీనారాయణ
డైరెక్టర్, రామయ్య
కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్
దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్,
8885555202



మహారాజా రంజిత్‌సింగ్ (1762-1839)

- రంజిత్‌సింగ్ రాష్ట్రాలు : లాహోర్, ముల్తాన్, కాశ్మీర్, పెషావర్.
- రాష్ట్రాధికారి – నజీం కాగా పరగణా అధికారి – కాదర్.
- రంజిత్‌సింగ్ రూపొందించిన ప్రత్యేక న్యాయస్థానం – అదాలత్ ఇ ఆలా కాగా న్యాయాధికారులు – అదాలత్‌లు.
- ఖల్సా అభిప్రాయాలను గౌరవించి సిక్కు చరిత్రలో సైనికులకు తొలిసారిగా జీతాలు ఇచ్చిన పాలకుడు.
- 1839లో రంజిత్‌సింగ్ మరణించగా తర్వాత బలహీనులై ఖరక్, షేర్ మొదలగువారు పాలించారు.
- 1843 రంజిత్ సింగ్ చిన్న కుమారుడు దిలీప్‌సింగ్ పాలకుడు అయ్యాడు కానీ తను చిన్నవాడు కావడంతో తల్లి రాణి జిందాన్ సంరక్షకురాలిగా కొనసాగింది. రాణి జిందాన్ బ్రిటీష్ ఆధిపత్యాన్ని తగ్గించాలని వారిపైసైన్యాన్ని ఉసిగొల్పెను. దీంతో హార్టింజ్ –1 సిక్కులపై యుద్ధాన్ని ప్రకటించాడు. దీనిని 1వ ఆంగ్లో – సిక్కు యుద్ధం అంటారు.

మొదటి ఆంగ్లో-సిక్కు యుద్ధం (1845-46)

- గవర్నర్ జనరల్ –1వ హార్టింజ్ సిక్కులసేనాని – లాల్‌సింగ్ కాగా బ్రిటీష్ సైనిక జనరల్ –సర్‌హ్యూజ్‌గాఫ్.
- 1844లో బలహీనమైన పంజాబ్‌ను బ్రిటీష్ వారు ఆక్రమించాలనుకొని సట్లేజ్ నదిని దాటి పంజాబ్‌పై దాడిచేశారు. దీంతో మొదటి ఆంగ్లో –సిక్కు యుద్ధం ప్రారంభమైనది.
- ఈ యుద్ధ సమయంలో 5యుద్ధాలు జరిగాయి.
- ముడ్కి – 1845 డిసెంబర్ 18, ఫిరోజా – 1845 డిసెంబర్ 21, బుద్దేవాల్, ఆలీవాల్ 1846 జనవరి 28, సోబ్రాన్ (తుపాకుల యుద్ధం) – 1846 ఫిబ్రవరి 10జ
- సోబ్రాన్ /తుపాకుల యుద్ధంలో అనేక వేలమంది సిక్కులు వధించబడటంతో తమ ఓటమిని అంగీకరించి 1846 మార్చి 9న 'లాహోర్ ఒప్పందం' చేసుకున్నారు.

లాహోర్ ఒప్పందం (1846 మార్చి9) ముఖ్యాంశాలు

- కోహినూర్ వజ్రం బ్రిటీష్‌వారికి ఇవ్వబడింది.
- కాశ్మీర్ ప్రాంతం బ్రిటీష్ వారికి ఇవ్వబడింది. (కాశ్మీర్‌ను బ్రిటీష్ వారు 50లక్షలకు గులాబ్‌సింగ్‌కు అమ్మేశారు.)
- 1.5కోట్ల నష్టపరిహారం చెల్లించుటకు పంజాబ్ అంగీకరించింది.
- సట్లేజ్ – బియాస్ నదుల మధ్యగల జులందర్ దోఆబ్ ప్రాంతంను బ్రటీష్ వారికి ఇచ్చారు.
- లాహోర్ ఒప్పందానికి కొన్ని మార్పులు చేస్తూ 1846 డిసెంబర్ 26న 'భైరవోల్' అనే ఒడంబడిక కుదిరింది.

భైరవోల్ సంధి (1846 డిసెంబర్ 26)

- పంజాబ్‌ను పాలించుటకు 8 మందితో ఒక కౌన్సిల్ ఆఫ్ రీజెన్సీని ఏర్పాటు చేశారు.
- ఈ కౌన్సిల్‌కు అధ్యక్షుడిని గవర్నర్ జనరల్ నియమిస్తాడు. దీని తొలి అధ్యక్షుడు – హెన్రీ లారెన్స్.

2వ ఆంగ్లో – సిక్కు యుద్ధం (1848 – 49)

- గవర్నర్ జనరల్ – డల్హౌసి.
- సిక్కు నాయకులు – చిత్తూర్ సింగ్ (లాహోర్), మూల్‌రాజ్ (ముల్తాన్)లలో తన పూర్వప్రతిష్టలు తిరిగిపొందుటకు బ్రిటీష్‌పై తిరుగుబాటు చేశారు.
- దీంతో డల్హౌసి పంజాబ్‌పై యుద్ధంను ప్రకటించి సైనిక జనరల్ – శ్యామ్ ఆండ్రూస్ పంపాడు.
- శ్యామ్ ఆండ్రూస్ లాహోర్, ముల్తాన్‌లలో తిరుగుబాటును అణచివేసి సిక్కు మద్ధతుదారులను రామ్‌నగర్ యుద్ధం – 1848 నవంబర్ 22, చిలయన్‌వాలా యుద్ధం – 1949 జనవరి 13, గుజరాత్ యుద్ధం – 1849 ఫిబ్రవరి 21న ఓడించారు.
- పై యుద్ధాలలో చిత్తూర్‌సింగ్, లాహోర్ సేనాపతి షేర్‌సింగ్ అత్తరీవాలాలు బంధీలయ్యారు.
- డల్హౌసి దిలీప్‌సింగ్‌ను తొలగించి సంవత్సరానికి 50 లక్షల భరణం ఇచ్చి పంజాబ్‌ను పూర్తిగా ఆక్రమించాడు.
- 1849లో దిలీప్‌సింగ్ క్రైస్తవమతంను స్వీకరించి లండన్ వెళ్లిపోయాడు.
- పంజాబ్ ఆక్రమణ తర్వాత గ్రాండ్‌ట్రంక్ రోడ్‌ను పెషావర్ వరకు పొడగించినవారు – డల్హౌసి.
- గవర్నర్ జనరల్ – డల్హౌసి. అవద్ రాజ్యస్థాపకుడు – సాదత్‌ఖాన్ బురాన్ ఉల్‌ముల్క్ కాగా చివరి పాలకుడు – వజీద్ అలీషా.

అవద్ ఆక్రమణ

నవాబ్ పేరు	కాలం
1. సాదత్‌ఖాన్ బురాన్ ఉల్‌ముల్క్	1722 – 1739
2. సఫ్దర్ జంగ్	1739 – 1754
3. ఘజా ఉద్దౌలా	1754 – 1775
4. అసవుద్దౌలా	1775 – 1797
5. వజీర్‌అలీ	1797 – 1798
6. సాదత్‌అలీ	1798 – 1814
7. గజీజుద్దీన్ హైదర్	1814 – 1827
8. నాసిరుద్ధీన్ హైదర్	1827 – 1837
9. అలీసా	1837 – 1842
10. అమ్జద్ అలీషా	1842 – 1847
11. వాజీద్ అలీషా	1847 – 1856

- 1856 లో వాజీద్ అలీషా తప్పుడు పాలన చేస్తున్నాడనే నెపంతో డల్హౌసి అవద్‌ను ఆక్రమించాడు.
- డల్హౌసి రాజ్యసంక్రమణ సిద్ధాంతం ద్వారా చివరగా ఆక్రమించిన ప్రాంతం – అవద్.

1857 సిపాయిల తిరుగుబాటు

- 1806లో వెల్లూరు (తమిళనాడులోని గోల్డెన్ టెంపుల్ గల ప్రాంతం) జార్జ్‌బార్లో గవర్నర్ జనరల్‌గా, బెంటింగ్ మద్రాస్ గవర్నర్‌గా ఉన్న కాలంలో తొలిసారిగా సిపాయిల తిరుగుబాటు జరిగింది.
- 1824లో రెండవసారి తిరుగుబాటు మొదటి బర్మాయుద్ధకాలంలో జరిగింది –సముద్రంపై ప్రయాణం వ్యతిరేకించడం.
- 1856లో సముద్ర ప్రయాణాన్ని తప్పనిసరి చేస్తూ గవర్నర్ జనరల్ కానింగ్ 'సామాన్యసేవా నియుక్త చట్టం' చేశాడు.
- 1857 మే 10 మీరట్‌లో 'సిపాయిల తిరుగుబాటు' ప్రారంభమైంది.
- 1857 తిరుగుబాటును సిపాయిల తిరుగుబాటు అని తొలిసారిగా వర్ణించినవారు బ్రిటీష్‌వారు – జాన్ లారెన్స్.
- 1857 సిపాయిల తిరుగుబాటుకు కారకుడు –డల్హౌసి కాగా తిరుగుబాటు నాటి గవర్నర్ జనరల్ – లార్డ్‌కానింగ్.
- 1857 సిపాయిల తిరుగుబాటును 'ప్రథమ స్వాతంత్ర సంగ్రామం' అని వర్ణించిన వారు వి.డి. సావార్కర్ (ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ గ్రంథం)
- 1857 తిరుగుబాటు సమయంలో మొఘల్ చక్రవర్తి –బహదూర్‌షా–II
- 1857 సిపాయిల తిరుగుబాటుకు గల తక్షణ కారణం – 1856లో ప్రవేశపెట్టిన రాయల్ ఎన్‌ఫీల్డ్ తుపాకులు – పంది, ఆవు కొవ్వుపూసిన తూటాలను సైనికులు వాడమనడం.
- ఆధునిక భారతదేశ చరిత్రలో కంపెనీ పాలనలో జరిగిన అతి ప్రధానమైన సంఘటన 1857 తిరుగుబాటు.
- 1857 సిపాయిల తిరుగుబాటుకు గల కారణాలు : రాజకీయ కారణాలు, సాంఘిక, మతకారణాలు, ఆర్థిక కారణాలు, సైనిక కారణాలు.

రాజకీయ కారణాలు

- భారతదేశఃలో ఆంగ్లరాజ్యస్థాపకుడు –రాబర్ట్‌క్లైవ్ కాగా సామ్రాజ్యానికి పునాదివేసిన వాడు – వారన్ హేస్టింగ్స్.
- బ్రిటీష్‌వారి సామ్రాజ్యవాదం రాజకీయపరమైన ప్రధానకారణం.
- లార్డ్‌వెల్లస్లీ – సైన్య సహకార పద్ధతి ద్వారా జరిగిన ఒప్పందాల వలన అనేక రాజ్యాలను స్వాధీనపరుచుకోవడం.
- 1857కు ముందు కంపెనీ అనుసరించిన దురాక్రమణ విధానాలు.
- డల్హౌసి రాజ్య సంక్రమణ సిద్ధాంతం ద్వార అనేక రాజ్యాలను బ్రిటీష్‌రాజ్యంలో విలీనంచేయడం.
- 1) 1848 – సతారా (రాజ్య సంక్రమణ సిద్ధాంతం ద్వారా డల్హౌసి ఆక్రమించిన తొలిప్రాంతం).
- 2) 1849 – జైత్‌పూర్, సంబాల్‌పూర్, పంజాబ్
- 3) 1850 – భగత్, సిక్కిం, భరత్‌పూర్
- 4) 1852 – ఉదయ్‌పూర్, పెగూ(బర్మా)
- 5) 1853 – ఝాన్సీ
- 6) 1854 – నాగ్‌పూర్
- 7) 1856 – అయోధ్య.

సాంఘిక, మత కారణాలు

- భారతీయుల సామాజిక ఆచార, సాంప్రదాయాలలో బ్రిటీష్ వారి జోక్యం.
- 1813 చాప్టర్ చట్టం ప్రకారం క్రైస్తవ మత ప్రచారానికి అవకాశం కల్పించడం.
- విద్య, వైద్యం, ఉద్యోగం పేరుతో అనేక మందిని క్రైస్తవులుగా మార్చడం.
- కరువు సమయంలో కూడా సేవాకార్యక్రమాలు అనే ముసుగులో చాలా మందిని క్రైస్తవులుగా మార్చిరి.
- 1829 – విలియం బెంటింక్ 'సతీసహగమన నిషేధ చట్టం', 1835 ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టడం.
- 1856లో వితంతు పునర్ వివాహాలు చేసుకున్న వారికి ఆస్థిహక్కును డల్హౌసి కల్పించడం.

ఆర్థిక కారణాలు

- బ్రిటీష్ కంపెనీ ఆర్థిక విధానం, భారతీయ రైతాంగాన్ని, చేతివృత్తుల వారిని అనేక కష్టాలకు గురిచేసింది.
- 'బ్రిటీష్ వారు భారతదేశంలో ప్రవేశపెట్టిన జమిందారీ వ్యవస్థ ఐరిష్ భూస్వామ్య వ్యవస్థకు ప్రతీక' – కారల్ మార్క్స్.
- 'రాబర్ట్‌క్లైవ్, వారన్ హేస్టింగ్స్‌లు అనుసరించిన విధానాల వల్ల బెంగాల్‌లోని మూడవ వంతు భాగం అరణ్యంగా మారింది' – కారన్‌వాలీస్.
- చేనేత కార్మికుల ఎముకలతో భారత నేల తెల్లబారింది అని తన నివేధికలో పేర్కొన్న గవర్నర్ జనరల్ – విలియం బెంటింక్.
- రైతులను సైన్యంలో చేర్చుకోవడానికి కంపెనీ పాలకులు భూమి శిస్తును పెంచారు – క్రిష్‌మన్ (రష్యా).
- ఆంగ్లేయులకన్నా ముస్లింలే బాగా పరిపాలించిరి – ఫ్రెడరిక్ షోర్.
- మనం విధించిన భూమి శిస్తులు ఏ విదేశీ రాజు కూడా విధించలేదు – బిషప్ హెబర్.

డెంటల్ ఫ్లాస్‌లో విషరసాయనాలు



లాస్‌ఏంజెల్స్ : దంతాలు శుభ్రం చేసుకోడానికి ఫ్లాస్ ఉపయోగించడం వల్ల శరీరంలో విషరసాయనాల స్థాయిలు పెరగడమే కాక, అనేక ఆరోగ్యసమస్యలకు దారి తీస్తున్నట్టు అధ్యయనంలో వెల్లడైంది. పెర్–అండ్ పోలీఫ్లూరోఆల్కైల్ సబస్టెన్సెస్ (పిఎఫ్ఎఎస్)నీరు గ్రీజు ప్రూఫ్ పదార్థాలు. క్యాన్సర్, థైరాయిడ్‌లతో వీటికి సంబంధం ఉంటుంది,. అలాగే సంతాన వైఫల్యాలు ఏర్పడతాయని అమెరికాలోని యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బెర్కిలీ స్కూలు ఆఫ్ పబ్లిక్ హెల్తు పరిశోధకులు వెల్లడించారు. ఈ పరిశోధన ఈ రసాయనాలు జనం శరీరాల్లోకి ఎలా చివరకు చేరుతాయో స్పష్టం చేయగలిగింది. వినియోగదారులు దీన్ని బట్టి తమ అలవాట్లు ఎలా మార్చుకోవాలో ఏ విధంగా వీటిని పరిమితంగా వినియోగించాలో సూచించింది. వినియోగదారులు ఉపయోగించే అన్ని ఉత్పత్తుల్లో ఈ పిఎఫెఎఎస్ వినియోగిస్తుంటారు. ఫాస్ట్‌ఫుడ్ ప్యాకేజింగ్, నాన్‌స్టిక్ పాన్స్, వాటర్ ప్రూఫ్ క్లాతింగ్, కార్పెట్లు తదితర వస్తువుల్లో వీటిని వాడుతుంటారు. వీటిని వాడడం వల్ల అలాగే ఆహారం తీసుకోవడం ద్వారా నేరుగా ఈ రసాయనాలకు జనం గురవుతుంటారు. ఇంటి లో గాలి ద్వారా, దుమ్ము ద్వారా, శుభ్రత లేని నీటి ద్వారా జనం ఈ రసాయనాల ప్రభావానికి బలవుతుంటారు. జనాబాలో ఎక్కువగా వ్యాప్తి చెందిన పిఎఫ్ఎఎస్ గురించి శాస్త్రవేత్తలు తీవ్రంగా చర్చిస్తున్నారు. ఎందుకంటే ఈ రసాయనాలు ఎక్కువగా ఆరోగ్యంతో ముడిపడి ఉన్నాయి. మూత్రపిండాల, మర్మాయవాల క్యాన్సర్ థైరాయిడ్, అత్యధిక , కొలొస్టరల్, తక్కువ బరువుతో పుట్టడం, సంతాన సామర్థ్యం క్షీణించడం, వ్యాధి నరోధక శక్తిపై తీవ్ర ప్రభావం ఇవన్నీ దాపురిస్తాయి. పబ్లిక్ హెల్తు ఇనిస్టిట్యూట్స్ చైల్డు హెల్తు అండ్ డెవలప్‌మెంట్ స్టడీస్‌లో పేర్లు నమోదు చేయించుకున్న 178 నడి వయస్సు మహిళల రక్తనమూనాలను సేకరించి పరిశోధకులు 11విభిన్న పిఎఫ్ఎఎస్ రసాయనాలను విశ్లేషించారు. పర్యావరణ రసాయనాలు, ఇతర అంశాలు వ్యాధిపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో పరిశీలించారు. ప్రజల ప్రవర్తన పిఎఫ్ఎఎస్ లపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో గమనించడానికి రక్తపరీక్షలుతో ఇంటర్వ్యూల్లో వెల్లడైన అభిప్రాయాలతో పోల్చి చూశారు. ఆయా మహిళల తొమ్మిది రకాల ప్రవర్తనలే పిఎఫ్ఎస్ ప్రభావానికి దారి తీస్తాయని తెలుసుకున్నారు. అధ్యయనం లోకి తీసుకున్న మహిళల్లో సగానికి సగం మంది స్పెయిన్‌కు చెందని వారు కాగా మిగతా వారు ఆఫ్రికన్ అమెరికన్లు. ఎవరైతే ఓరల్ బి గ్లైడ్‌తో దంతాలను శుభ్రం చేసుకుంటారో వారు తమ శరీరంలో పిఎఫ్ఎఎస్ అత్యధిక స్థాయిలు ఉన్న వారిగా గుర్తించ బడ్డారు. ఇంకా ఈ సంబంధాన్ని అర్థం చేసుకోడానికి పరిశోధకులు 18 రకాల డెంటల్ ఫ్లాసెస్‌ను 3 గ్లైడ్ ఉత్పత్తులతో సహా ఫ్లోరైన్ ఎంతవరకు ఉందో పరీక్షించారు. పార్టికల్ ఇండ్యూస్డ్ గామారే ఎమిసన్ (పిఐజిఇ) స్పెక్ట్రోస్కోపీ టెక్నిక్‌తో ఈ పరీక్ష జరిగింది. అన్ని గ్లైడ్ ఉత్పత్తులు మూడూ ఫ్లోరైన్‌కు పాజిటివ్‌గా తేలాయి.





– సైన్స్ విభాగం

దోమల సంతతిని నియంత్రించే కొత్త ఔషధం




లండన్ : దోమల పుట్టుకను నియంత్రించే ఔషధాన్ని అభివృద్ధి చేయడంలో అమెరికా శాస్త్రవేత్తలు ఒక అడుగు ముందుకు వేశారు. దీనివల్ల కొన్నివేల మందిని బలిగొంటున్న మలేరియా వ్యాప్తిని, దోమల వల్ల సంక్రమించే ఇతర వ్యాధులను నివారించడానికి వీలు కలిగింది. మరో ఐదేళ్లలో ఈ డ్రగ్ అందుబాటు లోకి వస్తుంది. ఆరిజోనా యూనివర్శిటీకి చెందిన పరిశోధకులు ఆడదోమలకు సంబంధించిన అసమాన ప్రోటీన్‌ను కనుగొన్నారు. అదే దోమ గుడ్లు పొదగడానికి దోహదం చేస్తుంది. ఆ ప్రొటీన్‌ను శాస్త్రవేత్తలు అడ్డగించేసరికి ఆడదోమలు కవచాలు లేని గుడ్లను కన్నాయి. ఫలితంగా గుడ్ల లోని పిండాలు చనిపోయాయి. ప్రొటీన్‌ను గురిపెట్టి డ్రగ్స్‌ను అభివృద్ధి చేస్తే తేనెటీగల వంటి ప్రయోజనకరమైన కీటకాలకు ఎలాంటి హాని జరగకుండా దోమల సంతతిని నివారించవచ్చని శాస్త్రవేత్తలు చెప్పారు. ఇది ముఖ్యమైన పరిశోధనగా రోజర్ మియస్‌ఫీల్డు అభివర్ణించారు. యూనివర్శిటీ కెమిస్ట్రీ, బయోకెమిస్ట్రీ విభాగం అధిపతిగా రోజర్ పనిచేస్తున్నారు. దోమల నిర్మూలనలో ఇది సరైన ప్రక్రియగా పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) వివరణ ప్రకారం ప్రపంచంలో హానికరమైన ప్రాణుల్లో దోమలు ఒకటి. వీటివల్ల పురోగతి దెబ్బతింటోంది. మలేరియా నిరోధ చర్యలు ప్రపంచ వ్యాప్తంగా స్థంభించాయి. 2016లో దోమల వల్ల 216 మిలియన్ ప్రజలు బాధితులయ్యారు. వారిలో 4,45,000 మంది మృతి చెందారు. సబ్ సహరాన్ ఆఫ్రికాలో పిల్లలు, శిశువులు ఎక్కువగా దోమల బాధితులవుతున్నారు. దోమల నియంత్రణకు ప్రస్తుతం వినియోగిస్తున్న పద్ధతులను సుదీర్ఘకాలంగా వినియోగించడంతో దోమలు వాటిని ప్రతిఘటించే స్థాయికి చేరుకున్నాయి. పరిశోధకులు ఇప్పుడు ఈ ప్రొటీన్‌ను అరికట్టడం వల్ల దోమలు తమ మిగతా రెండు మూడు వారాల జీవన కాలంలో గుడ్లను పెట్టే అవకాశం లేకుండా పోయింది. ఒకసారి ఆ ప్రొటీన్‌ను ఆపడంతో ఆడ దోమ గుడ్లు పెట్టడానికి అవకాశం లేకుండా పోయిందని అందువల్ల పుట్టుకను నియంత్రించడమే గొప్ప మార్గంగా పరిశోధకులు స్పష్టం చేశారు. ఈ పరిశోధన వల్ల మరికొన్ని కొత్త తరం క్రిమిసంహారక మందులను ఐదేళ్లలో కనుగొనడానికి దోహదపడుతోందని చెప్పారు.





– సైన్స్ విభాగం




అంతరిక్ష బ్యాక్టీరియా హానికరం కాదు

అంతర్జాతీయ అంతరిక్ష స్థావరం(ఐఎస్ఎస్)లో కఠినమైన పరిస్థితులు బ్యాక్టీరియాను ప్రమాదకరంగా, అలాగే మందులను ప్రతిఘటించే మొండి బ్యాక్టీరియాగా కూడా మార్చలేవని ఆయా పరిస్థితులకు తగ్గట్టు మనుగడ సాగించడానికే బ్యాక్టీరియా అలవాటు పడుతుందని నార్త్ వెస్టర్న్ యూనివర్శిటీ అధ్యయనం వెల్లడించింది. ఐఎస్ఎస్ నుంచి బ్యాక్టీరియాను వేరు చేసి వాటి జన్యువిశ్లేషణ సమాచారాన్ని నేషనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ ఇన్ఫర్మేషన్ పొందుపర్చింది. ఈ సమాచారం ఆధారం గానే ఎన్‌యు పరిశోధకులు ఐఎస్ఎస్‌లో ఉండే స్టెఫిలోకాకస్ ఎరియస్, బాసిల్లస్ సిరియస్ బ్యాక్టీరియా తెగలను భూమిపై ఉండే అవే రకాల బ్యాక్టీరియా తెగలతో పోల్చి చూశారు. మానవ చర్మంపై ఉండే ఎస్. ఎరియస్ బ్యాక్టీరియా ట్రీట్ చేయడానికి చాలా కఠినంగా ఉండగా, బి.సిరియస్ బ్యాక్టీరియా నేలలో నివసించి మానవ ఆరోగ్యానికి సంబంధించి కొన్ని సమస్యలు తెచ్చిపెడుతుంది. ఉపరితలంపై నివసించే అలవాటు వల్ల ఈ బ్యాక్టీరియా ప్రయోజనాలు కలిగించే జన్యువులను కలిగి ఉండడానికి ఆస్కారం కలిగింది. ఐఎస్ఎస్‌లో జీవించేటప్పుడు ఈ బ్యాక్టీరియా తాలూకు జన్యువులు ఒత్తిడిని తట్టుకునే విధంగా సహకరిస్తాయి. అందువల్ల ఇవి ఆహారాన్ని తీసుకోవడం, పెరగడం, కఠినమైన వాతావరణ పరిస్థితుల్లో కూడా తమ విధిని నిర్వర్తించగలుగుతాయి. జన్య విశ్లేషణ ఆధారంగా బ్యాక్టీరియా నివసించడానికే అలవాటు పడతాయి తప్ప హాని కలిగించే లక్షణాలను కలిగి ఉండవని పరిశోధకులు ర్యాన్‌బ్లాస్టియన్ వెల్లడించారు. అంతరిక్ష స్థావరం లోని బ్యాక్టీరియా మందులకు లొంగని సూపర్‌బగ్‌గా తయారయ్యే పరిస్థితిని తాము చూడలేదని అన్నారు. వ్యోమగాములకు కానీ అంతరిక్ష యాత్రికులకు కానీ ఇదొక శుభవార్తగా పేర్కొన్నారు. అయితే అనారోగ్య వ్యక్తులు అంతరిక్ష స్థావరం లో కానీ అంతరిక్ష నౌకల్లో కానీ వ్యాధులను వ్యాపింప చేస్తారని అన్నారు.




– సైన్స్ విభాగం



ఆర్మీలో 'గే'లకు అనుమతిలేదు

సైనిక బాస్ రావత్ వెల్లడి



న్యూఢిల్లీ : సైన్యంలో స్వలింగ సంపర్కాన్ని అనుమతించేది లేదని సైనిక దళాల ప్రధానాధికారి బిపిన్ రావత్ స్పష్టం చేశారు. గురువారం జనరల్ రావత్ ఇక్కడ వార్షిక స్థాయి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్మీలో గే సెక్స్‌పై నిషేధం స్పష్టంగా ఉందని తేల్చిచెప్పారు. స్వలింగ సంపర్కరం నేరార్హం కాదని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించినప్పటికీ , దీనిని సైన్యంలో అమలు చేసే ప్రశ్న ఉత్పన్నం కాదని తేల్చిచెప్పారు. అయితే సైన్యం చట్టానికి అతీతం కాదని, అయితే గే సెక్స్‌ను సైన్యంలో అనుమతించడం కుదరని పని అని తెలిపారు. అయినా సైన్యానికి రాజ్యాంగం కొంత మేరకు వివిధ విషయాలలో స్వేచ్ఛను కల్పించిందని అన్నారు. సైన్యంలో స్వలింగసంపర్కులకు అనుమతి ఉండదని ఆర్మీ చీఫ్ చెప్పారు. సమానత ప్రాథమిక హక్కును ఉల్లంఘించే విధంగా గే సెక్స్ శిక్షార్హం అనే నిబంధన ఉందని సుప్రీంకోర్టు గత సెప్టెంబర్‌లో పేర్కొంది. 158 ఏండ్ల నాటి వలస చట్టాల పరిధిలోని ఐపిసి 377 సెక్షన్ కింద గే సెక్స్‌ను శిక్షార్హ నేరంగా పరిగణించారు. అయితే ఈ చట్టం చెల్లనేరదని సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. అప్పట్లోనే రావత్ స్పందించి, సైన్యం విషయంలో ఇటువంటి అసహజ లైంగికత క్షమార్హం కాదని , దీని పట్ల జాగ్రత్తగా ఉండాలని సైనిక శ్రేణులనుహెచ్చరించారు. వ్యభిచారం అక్రమం కాదని సుప్రీంకోర్టు గత ఏడాదే వెలువరించిన తీర్పుపై స్పందించాలని విలేకరులు కోరారు. అయితే భారతీయ సైన్యం మరీ ఆధునికం, పాశ్యాత్య పోకడలతో ఉండదని, సాంప్రదాయపు బలగంగా కొనసాగుతోందని, వ్యభిచారాన్ని సైన్యంలో సక్రమం చేయడం వంటి చర్యలకు దిగేది లేదని రావత్ స్పష్టం చేశారు. కట్టుబాట్లతోనే సైన్యంలో సరైన క్రమశిక్షణ నెలకొంటుందని, దీనిని పరిరక్షించే విషయంలో ఎటువంటి అపవృతులకు తావు ఉండదని రావత్ తెలిపారు.

అతి చౌకగా కాలుష్య యంత్రం

ఐఐటి కాన్పూర్ ఘనత

కాన్పూర్ : కాటేసే వాయు కాలుష్యాన్ని అతి చవకగా కనిపెట్టే యంత్రం ఆవిష్కృతం అయింది. ఐఐటి కాన్పూర్ శాస్త్రజ్ఞులు ఈ ఎయిర్ పొల్యూషన్ సెన్సార్‌ను రూపొందించారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకూ ఉన్న పలు కాలుష్య కొలమాన యంత్రాలతో పోలిస్తే ఇది తక్కువ ధరకు లభిస్తుంది. వాతావరణంలోని అనేక రకాల హానికర వాయువుల మోతాదులను ఈ యంత్రం పసిగడుతుంది. ఓజోన్, నత్రజని వాయువు వంటి వాటి స్థాయిలను కూడా దీనితో లెక్కకట్టవచ్చునని ఐఐటి ప్రొఫెసర్ ఎఎన్ త్రిపాఠీ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దాదాపు ఒకటి నుంచి రెండు కోట్ల రూపాయల వరకూ ఈ కాలుష్య లెక్కింపు యంత్రాల ధరలు ఉంటాయి. అయితే వాటితో పోలిస్తే సమాన సామర్థ్యం ఉండే యంత్రాన్ని ఐఐటి విద్యార్థులు కేవలం రూ 50000కు రూపొందించి ఇస్తున్నారు. దీని పనితీరు గురించి జూన్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. ఇందులో అన్ని ప్రమాణాలకు అనుగుణంగా నిలిస్తే ఈ సెన్సార్‌ను దేశంలోని 150 నగరాలలో ఏర్పాటు చేయడం జరుగుతుందని త్రిపాఠీ వెల్లడించారు. పనితీరును పరీక్షించేందుకు వారణాసిలో ప్రయోగాత్మకంగా 60 చోట్ల దీనిని నెలకొల్పుతారు. అమెరికా – ఇండియా సంయుక్త ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన పరిశోధనలలో భాగంగా దీనిని రూపొందించడం జరిగిందని , ఈ ఘనత ఐఐటి విద్యార్థులకు చెందుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వ సైన్స్ సాంకేతిక విభాగం నుంచి రూ 6 కోట్ల సాయం అందిందని త్రిపాఠీ విలేకరులకు తెలిపారు. దేశంలో పెరిగిపోతున్న వాయు కాలుష్యంతో తలెత్తుతున్న సమస్యల నేపథ్యంలో ఈ యంత్రం ఆవిష్కరణకు బలీయమైన కృషి జరిగిందని సంస్థ పరిశోధనా విభాగం డీన్ బివి ఫాదీ చెప్పారు.

ఎంబసీలకు డేంజర్ పార్శిల్స్

మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియాలో విదేశీ దౌత్యకార్యాలయాలకు అనుమానాస్పద పార్శిల్స్ పంపుతున్న వ్యక్తి ఆటకట్టు అయింది. 49 ఏండ్ల సవాస్ ఎవాన్ అనే వ్యక్తి భారతీయ కాన్సులేట్‌తో పాటు పలు దౌత్య కార్యాలయాలకు అస్బెస్టాస్ పొడి ఉన్న కవర్లను పార్శిల్ చేస్తూ వస్తున్నాడు. దీనితో దౌత్య కార్యాలయంలో ఇదేదో ఉగ్రవాద చర్యగా భయంగా పట్టుకుంది. అయితే స్థానిక పోలీసులు సరైన విధంగా వ్యవహరించి ఈ పార్శిల్స్ పంపిణీదారుడిని వలేసి షెఫర్టన్‌లోని ఆయన నివాసంలో పట్టుకున్నారు. సిడ్నీ, మెల్‌బోర్న్, కాన్‌బెర్రాలలోని ఎంబస్సీలకు ఇటువంటి అనుమానాస్పద పార్శిల్స్ అందుతూ వచ్చాయి. ఈ పార్శిల్స్‌లో ఏముందనేది ఇంకా పూర్తి స్థాయిలో నిర్థారణ కాలేదని, అయితే ప్రాధమిక దశలో వీటిని అస్బెటాస్ పదార్థంగా భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యక్తి మొత్తం 38 ఇటువంటి ప్యాక్‌లు పంపినట్లు వెల్లడైన కొద్ది గంటల్లోనే ఆయనను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఇప్పటివరకూ 29 పార్శిల్స్‌ను స్వాధీనపర్చుకున్నట్లు , మిగిలిన వాటిని కూడా కనుగొనేందుకు యత్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యక్తిని కస్టడీలోకి తీసుకున్నారు. విచారణ జరుగుతోంది.

ఆ ముగ్గురు మాజీ సిఎంలకు కీలక పదవులు

బిజెపి ఉపాధ్యక్షులుగా నియామకం



న్యూఢిల్లీ: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన ముగ్గురు మాజీ సిఎంలకు భారతీయ జనతా పార్టీ కీలక పదవులు కట్టబెట్టింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రులైన శివరాజ్ సింగ్ చౌహాన్, వసుంధరా రాజె, రమణ్‌సింగ్‌లను పార్టీ ఉపాధ్యక్షులుగా నియమించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చత్తీస్‌గఢ్‌లో రమణ్ సింగ్ ప్రభుత్వం దారుణంగా ఓడిపోయింది. అయితే మధ్యప్రదేశ్‌లో మాత్రం శివరాజ్ సింగ్ చౌహాన్ గట్టి పోటీయే ఇచ్చారు. కొద్దిపాటి తేడాలో అధికారంలోకి వచ్చే అవకాశం కోల్పోయారు. రాజస్థాన్‌లో సైతం వసుంధరా రాజె గట్టి పోటీయే ఇచ్చారు. త్వరలో పార్లమెంటు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ మూడు రాష్ట్రాల్లో కోల్పోయిన పట్టును తిరిగి సాధించడం కోసం ఈ ముగ్గురు మాజీ సిఎంలకు కీలక పదవులు కట్టబెట్టినట్లు కనిపిస్తోంది. ఈ ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులను పార్టీ ఉపాధ్యక్షులుగా పార్టీ అధ్యక్షుడు అమిత్ షా నియమించినట్లు బిజెపి ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ఒక ట్వీట్‌లో తెలిపారు. దీంతో ఇప్పటివరకు రాష్ట్ర రాజకీయాలకు పరిమితమైన ఈ నేతలు దేశ రాజకీయాల్లోకి వచ్చినట్లయింది.

పేదలందరికీ రిజర్వేషన్లు

మోడీ పాలన రాజ్యాంగ బద్ధంగా సాగుతోంది

బిజెపి జాతీయ నాయకుడు ఇంద్రసేనారెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్ : కులాలతో సంబంధం లేకుండా పేదలందరికి రిజర్వేషన్లు అందే విధంగా కేంద్రం తీసుకొచ్చిన ఈబిసి బిల్లు చరిత్రాత్మకమైనదని బిజెపి జాతీయ నాయకుడు నల్లు ఇంద్రసేనారెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం నాంపల్లి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పేదలు, సంపన్న వర్గాలతో పోటీ పడలేకపోతున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పేదలందరి జీవితంలో వెలుగు నింపాలన్న లక్ష్యంతో అగ్రవర్ణాల్లోని పేదలకు కేంద్రం రిజర్వేషన్లు తీసుకురావడం అభినందనీయమన్నారు. ప్రధాన మోడీ పాలన రాజ్యాంగ బద్దంగా ప్రజలకుఉపయోగపడే రీతిలో కొనసాగుతోందన్నారు. సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ అన్న లక్ష్యంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సామాన్య కుటుంబం నుంచి మోడీ వచ్చారు కనుకే సామాన్యుల సమస్యలను ఆయనకు తెలుసన్నారు. ప్రజలు కష్టాలు తెలుసుకుని వాటిని పరిష్కరించడే మోడీ పని అని ఇంద్రసేనారెడ్డి వ్యాఖ్యానించారు. బిసిలకు ప్రత్యేక కమిషన్ కావాలని అడిగిన వెంటనే వారి కలను సాకారం చేసిన వ్యక్తి మోడీ అని అన్నారు. కుల, మతాలతో సంబంధం లేకుండా ప్రతి పేదవాడికి రిజర్వేషన్లు ఇచ్చిన ఘనతే మోడీదేనని పేర్కొనారు. ఈ ఫలాలు ప్రజలందరికి వర్తిస్తాయన్నారు. ప్రతి పేద వారికి ఆర్థికంగా నిలదొక్కునేందుకు కేంద్రం తోడ్పాటు అందిస్తోందన్నారు.



రాజస్థాన్‌లోని బికనీర్‌లో ఒంటెల ఫెస్టివల్ జరుగుతోంది. ఈ సందర్భంగా ఒంటెలను అందంగా ముస్తాబు చేయడం అక్కడ సర్వసాధారణం. అయితే ఈ సారి అందులో సృజనాత్మకతకు పెద్దపీట వేస్తున్నారు. ఒంటెలపై ఉండే వెంట్రుకలను కత్తిరించడంలోనూ సంస్కృతి, సంప్రదాయాలను చాటుతున్నారు. అలా ఈ చిత్రంలో ఓ జపనీస్ హెయిర్‌డ్రెస్సర్ ఒంటెపై వెంట్రుకలు కట్ చేస్తూ అందరినీ ఆకట్టుకుంటున్న దృశ్యం

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీపై త్వరలోనే నిర్ణయం

తొలి భారతీయ మహిళా సెనేటర్ కమలా హారిస్

వాషింగ్టన్: 2020లో జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడంపై తాను త్వరలోనే నిర్ణయం తీసుకొంటానని భారతీయ సంతతికి చెందిన తొలి మహిళా సెనేటర్ అయిన కమలా హారిస్ చెప్పారు. అంతేకాదు, దేశ అత్యున్నత పదవిని చేపట్టేందుకు నల్లజాతికి చెందిన ఇక మహిళను అంగీకరించేందుకు అమెరికన్లు సిద్ధంగా ఉన్నారని తాను నమ్ముతున్నట్లు కూడా ఆమె చెప్పారు. 2020లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో అమెరికా అధ్యక్ష పదవికి అధ్యక్షుడు దొనాల్డ్ ట్రంప్‌ను డెమోకరటిక్ పార్టీ తరపు అభ్యర్థిగా ఎన్నికయ్యే అవకాశాలు ఉన్న బలమైన అభ్యర్థుల్లో హారిస్ ఒకరని ఇప్పటికే మీడియాలో కథనాలు వచ్చిన విషయం తెలిసిదే. కాలిఫోర్నియానుంచి సెనేటర్‌గా ఎన్నికయిన 54 ఏళ్ల కమలా హారిస్ ఇటీవల మార్కెట్‌లోకి వచ్చిన తన పుస్తకం ప్రచారంలో భాగంగా దేశంలోని పలు నగరాల్లో పర్యటిస్తున్నారు.' ది ట్రూత్స్ వుయ్ హోల్డ్: యాన్ అమెరికన్ జర్నీ' అనే ఆమె పుస్తకం బుధవారం మార్కెట్లోకి వచ్చింది. చిన్న పిల్లలకోసం రాసిన మరో పుస్తకం' సూపర్ హీరోస్ ఎవ్వెరీవేర్' కూడా ఏకకాలంలో మార్కెట్లోకి వచ్చింది. అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేసే విషయంలో త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని సిఎన్ఎన్‌కు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె చెప్పారు. నల్లజాతికి చెందిన ఒక మహిళను అమెరికా అధ్యక్షురాలిగా అంగీకరించడానికి ఈ దేశం సిద్ధంగా ఉందని తాను భావిస్తున్నట్లు కమలా హారిస్ తన పుస్తకంలో పేర్కొన్నారు. 'ఈ విషయంలో అమెరికన్లకు ఎక్కువ క్రెడిట్ ఇవ్వాలి. అమెరికన్లు చాలా తెలివైనవారని, సమర్థుడని, నిజాయితీపరుడు, తమ కష్టాలను పట్టించుకే వ్యక్తని ఎవరికి అనుకుంటారో అలాంటి వ్యక్తినే అధ్యక్షుడిగా వారు ఎన్నుకుంటారు' అని కూడా ఆమె అన్నారు. తన గురించి తాను ఈ విషయం చెప్పడం లేదని, అమెరికా ప్రజల సామర్థ్యం గురించి తాను ఈ విషయం చెబుతున్నాని కూడా ఆమె అన్నారు. కమలా హారిస్ గతంలో కాలిఫోర్నియాకు తొలి మహిళా అటార్నీ జనరల్‌గా కూడా ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు రెడీనా?

సిఇఒలతో నేటి నుంచి సిఇసి కీలక భేటీ

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలకు సంసిద్ధతపై కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా శుక్రవారం (నేటి) నుంచి ప్రధాన ఎన్నికల అధికారుల (సిఇఒ)ల రెండు రోజుల సమావేశం నిర్వహించనుంది. లోక్‌సభ ఎన్నికలు ఈ ఏడాదే జరుగనున్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు, ఏ స్థాయిలో సంసిద్ధత ఉందనేది ఈ సమావేశంలో సమీక్షిస్తారు. ఎన్నికల నిర్వహణపై ఇదే తొలిదఫా కీలక సమావేశంగా భావిస్తున్నారు. ఎన్నికల జాబితాల సవరణల ప్రక్రియ, ఇఆర్ఓ నెట్ పనితీరు, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, ఇవిఎంలు, వివిప్యాట్ల అంశాలపై ఎన్నికల అధికారులతో జాతీయ స్థాయి ఎన్నికల సంఘం చర్చిస్తుంది. వివిధ స్థాయిలలో ఉన్న సాధకబాధకాలను తెలుసుకుంటుందని గురువారం వెలువరించిన ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సన్నద్ధతకు సమీక్షతో పాటు, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో తలెత్తిన సమస్యలు, ఇవిఎంల మొరాయింపులు , పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లలో ఇబ్బందులు వంటి వాటిపై కూడా దృష్టి సారిస్తారు. సిఇఒల నుంచి వ్యక్తం అయ్యే అభిప్రాయాలే కీలకమైనవిగా భావిస్తున్నారు. కీలకమైన అంశాలకు సంబంధించి తమ సన్నద్ధతను సిఇఒలు క్షుణ్ణంగా తెలియచేస్తారు. ఎన్నికలు పూర్తి స్థాయిలో ఓటర్లకు సానుకూలంగా



ఉండేలా, వికలాంగులకు, వయోవృద్ధులకు, గర్భిణులకు, స్త్రీలకు సరైన ఏర్పాట్లు ఉండేలా చేయాల్సి ఉందని ఎన్నికల సంఘం నిర్దేశించింది. దీనికి సంబంధించి సంబంధిత ఎన్నికల అధికారుల నుంచి సరైన విధంగా చర్యలు తీసుకోవల్సి ఉంది. దీనికి అనుగుణంగా ఈ సదస్సులో వారి నుంచి నిర్దిష్ట రీతిలో వివరణలు పొందుతారు. దీని మేరకు వ్యక్తం అయ్యే అభిప్రాయాలతోనే సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సరైన మార్గం ఏర్పడుతుంది. వివిధ వేదికల ద్వారా ఓటర్ల జాబితాలో అర్హులు పేర్లు నమోదు చేసుకునేందుకు ప్రచారం కల్పించాల్సి ఉందని, అదే విధంగా ఓటర్లు ఓటు హక్కు వినియోగానికి ముందుకు రావడానికి ప్రేరేపించేందుకు ప్రోత్సాహం కల్పించాలని , ఓటింగ్ శాతం పెంచేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని ఎన్నికల సంఘం సంకల్పించింది. ఎన్నికల దశలో ఓటర్లు తమ సాధకబాధకాలను తెలియచేసుకునేందుకు ఏర్పాటు చేసిన ఓటరు హెల్ప్‌లైన్ సెంటర్ 1950 పనిచేసేలా అన్ని రాష్ట్రాలు చర్యలూ తీసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశాలు వెలువరించింది. సున్నితమైన సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించడం, భద్రతా ఏర్పాట్లు, పోలీసు బలగాల ఏర్పాట్లు, లోక్‌సభ ఎన్నికలకు ఎంత మేరకు బలగాలు అవసరం? అనేది కూడా ఈ సందర్భంగా సమీక్షించుకుంటారు. ఇఆర్ఓ నెట్ ఎన్నికల సంఘం సమాచారం తెలిపే పోర్టల్‌గా ఉంది. ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా ఉంచేందుకు ఓటర్లు తమ సమస్యలు తెలుసుకునేందుకు ఈ పోర్టల్ సహకరిస్తుంది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు ఇది సరైన విధంగా ఉపయోగపడుతుందని ఎన్నికల సంఘం తెలిపింది.

కాన్పు కాదు.. కరుకుదనం!

- శిశువును బలంగా లాగిన నర్సు
- రెండు ముక్కలయిన శిశువు
- కడుపులోనే ఉండిపోయిన సగభాగం
- రాజస్థాన్ ప్రభుత్వాస్పత్రి సిబ్బంది దారుణం

బర్మేర్: గ్రామాల్లో అనుభవం లేని నాటు మంత్రసానులు కాన్పులు చేయడంవల్ల శిశువులుఽ భూమిపై పడడానికి ముందే చనిపోయిన సంఘటనలు మనం ఎన్నో చూశాం. అయితే రాజస్థాన్‌లోని ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు సమయంలో ఒక నర్సు బలవంతంగా బిడ్డను లాగడంతో ఆ బిడ్డ రెండు ముక్కలయి పోవడమే కాకుండా శిశువు శరీరంలో కొంత భాగం కడుపులోనే ఉండిపోవడంలో ఆ మహిళ వేరే ఆస్పత్రిలో చేరాల్సి వచ్చింది. వళ్లు గగుర్పొడిచే ఈ సంఘటన జైసల్మేర్ జిల్లా రాంఘర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. ఈ ఘోరం గురించి ఆస్పత్రి సిబ్బంది తమకు తెలియజేయలేదని, బయటకు లాగిన శిశువు శరీరంలోని భాగాన్ని దాచిపెట్టారని శిశువు తండ్రి తిలోక్ భాటి అంటున్నాడు. అంతేకాదు, ఆస్పత్రి సిబ్బంది తాగి ఉన్నారని, తమపట్ల దురుసుగా ప్రవర్తించారని కూడా అతను అంటున్నాడు. ఈ సంఘటన తర్వాత ఆస్పత్రి డాక్టర్లు డెలివరీ పూర్తయిందని, మాయమాత్రమే లోపల ఉండిపోయిందని తమతో చెప్పారని ఆ దంపతులు ఆరోపించారు. అయితే వారికి అనుమానం రావడంతో మహిళను జోధ్‌పూర్ ఆస్పత్రికి పంపించారు.

మాయను బైటికి తీయడం కోసం జోధ్‌పూర్ ఉమైద్ ఆస్పత్రి డాక్టర్లు ఆపరేషన్ చేసేటప్పుడు అసలు విషయం వారికి అర్థమయింది. దీంతో వారు రాంఘర్ ఆస్పత్రి సిబ్బంది నిర్వాకం ఆ దంపతులకు చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. రామ్‌ఘర్ ఆస్పత్రి సిబ్బందిపై ఐపిసి 304,336 సెక్షన్ల కేసు నమోదు చేసిన పోలీసులు దాచిపెట్టిన శిశువు శరీర భాగం కోసం ఆస్పత్రిలో సోదాలు జరపగా దొరికింది, ఆస్పత్రి ఉద్యోగులు ఇద్దరిపై కేసు నమోదు చేశామని, వారిని ప్రశ్నిస్తున్నామని సబ్ ఇన్‌స్పెక్టర్ జలమ్ సింగ్ చెప్పారు.

మోడీ పెద్ద చేపను పట్టారు



న్యూఢిల్లీ : వచ్చే లోక్‌సభ ఎన్నికలలో బీహార్ నుంచి ఆర్జేడీకి ఒక్క ఎంపీ సీటూ రాదని ఎల్‌జెపి నేత రామ్‌విలాస్ పాశ్వాన్ విశ్లేషించారు. జనరల్ కేటగిరి పేదలకు పది శాతం కోటాను ఆర్జేడీ వ్యతిరేకిస్తూ రావడంతో తగు మూల్యం చెల్లించుకోవల్సి ఉంటుందన్నారు. కేంద్ర మంత్రి అయిన పాశ్వాన్ గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్‌లో కోటా బిల్లును ఆర్జేడీ తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చిందని, దీనితో బీహార్‌లో మహాకూటమిలో చీలికలు ఏర్పడుతాయని పాశ్వాన్ జోస్యం చెప్పారు. పాశ్వాన్ పార్టీ బిజెపి మిత్రపక్షంగా ఉంది. రిజర్వేషన్ల కోటా ఖచ్చితంగా ఎన్‌డిఎకు లాభం చేకూరుస్తుందని , అంతేకాకుండా సమాజంలో తగు విధైన సామరస్యం ఏర్పడుతుందని తెలిపారు. ఈ చర్య వెనుక రాజకీయ ప్రాధాన్యత ఉందని దానిని ఎవరూ కాదనలేరని , ఇది సముద్రంలో చేపలు పట్టే జాలర్ల మధ్య ఉండే పోటీ వంటిదని , మోడీ ఇప్పుడు పెద్ద చేపను ఈ వలతో పట్టేశాడని, దీనితో సహజంగానే ఇతర జాలర్లలో కోపం అసూయ పెరుగుతుందన్నారు. మోడీ రాజకీయ పాచికతో ప్రతిపక్ష పార్టీలు కుళ్లిపోతున్నాయని , కోటాపై ప్రతిపక్షాల వారు నిలదీస్తున్నారు కానీ ఇదే సమయంలో దీనికి మద్దతు పలకక తప్పని స్థితి ఏర్పడిందని, రాజకీయం అంటే ఇదేనని, ఈ కయ్యంలో ఇటువంటి పాచికలు సర్వసాధారణం అని పాశ్వాన్ తేల్చిచెప్పారు.

అయోధ్యకు పరిష్కారంతోనే సామరస్యం

న్యూఢిల్లీ : అయోధ్య వివాదానికి త్వరితగతి పరిష్కారం కుదరాలని మైనార్టీల జాతీయ కమిషన్ అధ్యక్షులు సయ్యద్ గ్యాయోరుల్ హసన్ రజ్వీ చెప్పారు. ఈ రెండు వర్గాలకు ఇది మేలు చేస్తుందని తెలిపారు. రామ జన్మ భూమి –బాబ్రీ మసీదు వ్యాజ్యం విచారణపై ఎటువంటి అడ్డంకులు కల్పించరాదని అభిప్రాయపడ్డారు. రజ్వీ గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. అయోధ్య వివాదం హిందూ ముస్లింల మధ్య అడ్డుగోడగా ఉన్నట్లు అయితే , దీనిని అధిగమించేందుకు అన్ని మార్గాలూ వెతుక్కోవల్సి ఉందని తెలిపారు. సమస్య సాగుతూ ఉండటం వల్ల జటిలం అవుతుందని, సత్వర పరిష్కారమే ఇరు వర్గాల మధ్య సామరస్యానికి దారితీస్తుందని స్పష్టం చేశారు. అగ్రవర్ణాలలోపి వారికి ఆర్థిక ప్రాతిపదికన కోటా కల్పిస్తూ బిల్లు తీసుకురావడం మంచి చర్య అని ఆయన ప్రధాని మోడీకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. పేదరికంలో ఉన్న మైనార్టీలకు ఈ కోటా కల్పనతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. సుప్రీం కోర్టు సమక్షంలో ఇప్పుడు అయోధ్య వివాదం ఉందని, దీనిని సరైన రీతిలో విచారించేందుకు అనువైన వాతావరణం నెలకొనాల్సి ఉందన్నారు.

అయోధ్యపై ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసేందుకు ఇటీవలే నిర్ణయించింది. ఈ నెల 29 నుంచి విచారణను వేగిరపర్చేందుకు దీని వల్ల వీలేర్పడుతుందని రజ్వీ తెలిపారు. పార్లమెంట్ ఆమోదించిన పౌరసత్వ బిల్లు కూడా సరైనదేనని చెప్పారు. పౌరసత్వ బిల్లు నుంచి ముస్లింలను మినహాయించడం సరికాదని చెప్పారు. వేరే దేశాల నుంచి భారతదేశానికి ముస్లింలు కేవలం ఉద్యోగాల కోసం వస్తారని, అక్కడ వారికి వేధింపులు ఉండవని , ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఇతర దేశాల నుంచి వచ్చే ముస్లింలకు కూడా పౌరసత్వం కల్పించే విధంగా బిల్లు ఉండి ఉంటే బాగుండేదని తేల్చిచెప్పారు.

షట్‌డౌన్ చర్చ నుంచి ట్రంప్ వాకౌట్

వాషింగ్టన్ : అమెరికాలో షట్‌డౌన్ నివారణ చర్చల దశలో ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ విసురుగా బయటకు వచ్చారు. మెక్సికో సరిహద్దులను మూసివేస్తూ భారీ స్థాయి కాంక్రిట్ గోడ నిర్మాణానికినిధులు కావాలని ట్రంప్ పట్టుపడుతున్న విషయం తెలిసిందే. అయితే ప్రతిపక్ష డెమొక్రట్లు ట్రంప్ ప్రతిపాదనను తోసిపుచ్చారు. ఈ గోడ నిర్మాణానికి ఏకంగా 5.7 బిలియన్ డాలర్ల నిధులను సమకూర్చడం కుదరని పని అని తాజా చర్చలలోనూ డెమొక్రట్లు స్పష్టం చేశారు. దీనితో ట్రంప్ నిరసనగా తీవ్ర ఆగ్రహంతో సమావేశ స్థలి నుంచి విసురుగా వాకౌట్‌కు దిగినట్లు వెల్లడైంది. దీనితో అమెరికాలో పాక్షిక షట్‌డౌన్ పరిస్థితి మరింతగా ముదిరింది. సంవత్సరాంతంలో క్రిస్మస్‌కు ముందు నెలకొన్న షట్‌డౌన్‌కు ఇప్పటికీ పరిష్కారం దక్కకపోవడంతో పలు రకాలుగా సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఈ క్రమంలోనే తాను అనుకున్నట్లుగా వాల్ నిర్మాణం జరగాల్సి ఉందని, అక్రమ వలసలను అరికట్టాల్సి ఉందని ట్రంప్ స్పష్టం చేస్తున్నారు. వైట్‌హౌస్‌లో సెనెటర్లు, అధికారులతో జరిగిన కీలక భేటీ రసాభాసగా మారింది. భారీ స్థాయి నిధుల మంజూరీకి వీల్లేదని సెనెటర్లు తేల్చిచెప్పారు. దీనితో ట్రంప్ చర్చల సమయంలో అసహనంగా చేతులు బాదాడని, తరువాత లేచి విసురుగా బయటకు వెళ్లారని ప్రతినిధుల సభలో నాయకురాలు నాన్సీ పెలోసీతో పాటు సెనెట్‌లో మైనార్టీ నేత సెనెటర్ ఛుక్ షుమెర్ ట్రంప్ వైఖరి పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిస్థితి దిగజారు



డుకు ఆయన వైఖరే కారణం అని నిందించారు. సరిహద్దు గోడ నిర్మాణం డిమాండ్‌పై చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని, ముందు షట్‌డౌన్ ఎత్తివేతకు సరైన విధంగా మాట్లాడుకోవల్సి ఉందని చెపుతున్న దశలోనే ట్రంప్ లేచి విసవిస వెళ్లిపోవడం ఆయన దూకుడు ధోరణికి తార్కాణం అని విమర్శించారు. దేశంలో 19 రోజులుగా షట్‌డౌన్ సాగుతోంది. వాల్ నిర్మాణానికి తాము అడిగిన నిధులు ఇవ్వాల్సిందేనని ట్రంప్ డిమాండ్ చేస్తున్నారు. అయితే ఇంత భారీ మొత్తం ఇవ్వడానికి తమ సమ్మతి లేదని ప్రతిపక్షం స్పష్టం చేస్తోంది. అవసరం అయితే దేశంలో ఎమర్జెన్సీని అయినా విధించి మెక్సికో వాల్ నిర్మాణానికి దిగితీరుతామని ట్రంప్ ఇటీవల హెచ్చరించడం పరిస్థితిని మరింతగా చిక్కులలోకి నెట్టిందని ప్రతిపక్షాలు విమర్శించాయి. అయితే దేశ భద్రతకు ఈ వాల్ అత్యవసరం అని, అక్రమ వలసల నిరోధానికి తీసుకునే చర్యలకు నిధుల సమస్య ఉండనే రాదని అధికార పక్షం స్పష్టం చేస్తోంది. తాజా చర్చల దశలో ట్రంప్ వాకౌట్ దేశంలో రాజకీయ అనిశ్చితికి దారితీస్తోందని విశ్లేషణలు వెలువడ్డాయి. తాను వాకౌట్ జరిపిన విషయాన్ని ట్రంప్ తమ ట్వీట్‌లో నిర్థారించారు. నాన్సీ, ఛుక్‌తో భేటీ నుంచి ఇప్పుడే బయటకు వచ్చేసినట్లు, ఇటువంటి వాటితో ఏం ప్రయోజనం లేదని, ఇది ఉత్త వేస్ట్ అని ట్రంప్ మండిపడ్డారు. నిధులకు 30 రోజుల గడువు కావాలని వారు అడుగుతున్నారు. ఈ నెలరోజులలో ఏమవుతుంది? వారు కాంక్రిట్ వాల్‌కు సమ్మతిస్తారా? లేక స్టీల్ వాల్‌కు ఓకె అంటారా? ఏదీ సరిగ్గా చెప్పడం లేదని ట్రంప్ ప్రతిపక్షాలుపై విరుచుకుపడ్డారు.



మేరీకోమ్‌కు టాప్ ర్యాంక్

న్యూఢిల్లీ: భారత మహిళా బాక్సింగ్ దిగ్గజం మేరీ కోమ్ మరో అరుదైన ఘనత సాధించింది. తాజాగా ప్రపంచ బాక్సింగ్ సమాఖ్య ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో మేరీ మొదటి స్థానంలో నిలిచింది. కిందటి ఏడాది భారత్‌లో జరిగిన మహిళల బాక్సింగ్ ప్రపంచకప్‌లో మేరీ కోమ్ 48 కిలోల విభాగంలో స్వర్ణం సాధించిన విషయం తెలిసిందే. మహిళల ప్రపంచ బాక్సింగ్‌లో ఆరు స్వర్ణాలు గెలిచిన తొలి బాక్సర్‌గా మేరీ కోమ్ చరిత్ర సృష్టించింది. తాజాగా 48 కిలోల విభాగంలో 1700 పాయింట్లతో నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. కాగా, 51 కిలోల విభాగంలో భారత్‌కే చెందిన పింకి జంగ్రా 8వ స్థానంలో నిలిచింది. 57 కిలోల విభాగంలో సోనియా లాథర్ రెండో ర్యాంక్‌ను దక్కించుకుంది. 64 కిలోల విభాగంలో సిమ్రన్‌జీత్ సింగ్ నాలుగో ర్యాంక్‌ను సాధించింది. మాజీ ప్రపంచ చాంపియన్ సరితాదేవి 16వ ర్యాంక్‌ను దక్కించుకుంది. కాగా, కిందటి ఏడాది భారత దిగ్గజం మేరీ కోమ్ చిరస్మరణీయ విజయాలు సాధించింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణంతో పాటు కామన్వెల్త్ క్రీడల్లో కూడా పసిడి పతకం సొంతం చేసుకుంది. అంతేగాక ప్రతిష్టాత్మకమైన స్ట్రాంజ్జా స్మారక బాక్సింగ్ పోటీల్లో మేరీకోమ్ రజతం సాధించింది. కాగా, వచ్చే ఒలింపిక్స్‌లో దేశానికి స్వర్ణం అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. టోక్యో వేదికగా జరిగే ఒలింపిక్స్‌లో మేరీకోమ్ 51 కిలోల విభాగంలో పోటీ పడుతుంది.

భారత్‌కు చాలా కీలకం

ఆసీస్‌తో వన్డే సిరీస్



మన తెలంగాణ/క్రీడా విభాగం: ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్ టీమిండియాకు చాలా కీలకంగా మారింది. ఇంగ్లండ్‌లో ఈ ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్‌కు ముందు భారత్ కేవలం 11 మ్యాచ్‌లే ఆడనుంది. ఇందులో మూడు వన్డేలు ఆస్ట్రేలియాలో జరుగుతున్నాయి. మరో ఐదు వన్డేలు న్యూజిలాండ్ వేదికగా జరుగుతాయి. ప్రపంచకప్ ట్రోఫీపై గురిపెట్టిన టీమిండియాకు ఈ సిరీస్‌లు చాలా కీలకంగా మారాయి. ఇప్పటికే ఆస్ట్రేలియా గడ్డపై ట్వంటీ–20, టెస్టు సిరీస్‌లను సొంతం చేసుకున్న టీమిండియా వన్డేలకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమైంది. ఆస్ట్రేలియాతో జరిగే మూడు వన్డేల సిరీస్‌ను గెలిచి రానున్న ప్రపంచకప్‌కు ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలనే పట్టుదలతో భారత్ కనిపిస్తోంది. అయితే సొంత గడ్డపై ఆస్ట్రేలియాను ఓడించడం అంత సులువుకాదు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే ఆటగాళ్లకు ఆసీస్ జట్టులో కొదవలేదు. ఈ పరిస్థితుల్లో భారత్ విజయం కోసం సర్వం ఒడ్డి పోరాడక తప్పదు. టెస్టు సిరీస్‌లో ఆడిన చాలా మంది ఆటగాళ్లు వన్డే సిరీస్‌కు దూరమయ్యారు. పుజారా, రహానె, పంత్ తదితరులు వన్డే సిరీస్‌కు అందుబాటులో లేరు. దీంతో జట్టు బ్యాటింగ్ భారమంతా కెప్టెన్ విరాట్ కోహ్లి, వైస్ కెప్టెన్ రోహిత్ శర్మపై పడింది. వీరిద్దరూ వన్డేల్లో అసాధారణ ఆటతో చెలరేగుతున్న విషయం తెలిసిందే. ఆస్ట్రేలియా సిరీస్‌లోనూ ప్రకంపనలు సృష్టించాలనే పట్టుదలతో ఉన్నారు. ఇక, ఓపెనర్ శిఖర్ ధావన్ కూడా జట్టుకు కీలకంగా మారాడు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన ధావన్ విజృంభిస్తే భారత్‌కు విజయం నల్లేరుపై నడకే. అయితే నిలకడలేమి ధావన్ ప్రధాన బలహీనత. ఒక మ్యాచ్‌లో సెంచరీతో కదం తొక్కితే మరో మ్యాచ్‌లో ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరుతాడు. ఇలాంటి పరిస్థితుల్లో ధావన్ తన ఆటను మెరుగు పరుచుకునేందుకు ఈ సిరీస్ మంచి అవకాశంగా చెప్పొచ్చు. ఇక, తెలుగు తేజం అంబటి రాయుడుకు కూడా సిరీస్ కీలకంగా మారింది. నాలుగో నంబర్‌లో బరిలోకి దిగుతున్న రాయుడు కొంత కాలంగా నిలకడగా ఆడుతున్నాడు. రానున్న ప్రపంచకప్ నేపథ్యంలో ఆస్ట్రేలియా సిరీస్‌ను సద్వినియోగం చేసుకోవాలనే పట్టుదలతో ఉన్నాడు.


ధోనికి కీలకం

మాజీ కెప్టెన్, సీనియర్ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనికి ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సిరీస్‌లు చాలా కీలకంగా మారాయని చెప్పాలి. రానున్న ప్రపంచకప్ నేపథ్యంలో ధోని తన బ్యాటింగ్‌ను మెరుగు పరుచుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది. కొంతకాలంగా ధోని బ్యాటింగ్‌లో విఫలమవుతున్నాడు. రిషబ్ పంత్ రూపంలో ధోనికి పెద్ద ప్రమాదం పొంచి ఉంది. ఏమాత్రం విఫలమైనా పంత్‌ను జట్టులోకి తీసుకోవడం ఖాయం. ఇటీవల ఆస్ట్రేలియాతో ముగిసిన టెస్టు సిరీస్‌లో పంత్ అసాధారణ ఆటతో ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. ఇలాంటి పరిస్థితుల్లో ధోని స్థానానికి గట్టి పోటీ నెలకొంది. ధోని జట్టులో స్థానాన్ని కాపాడుకోవాలంటే నిలకడగా ఆడక తప్పదు. ఏ మాత్రం విఫలమైనా జట్టులో చోటు కోల్పోవడం తథ్యం. ఇక, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య కూడా చాలా రోజుల తర్వాత మళ్లీ బరిలోకి దిగుతున్నాడు. రానున్న ప్రపంచకప్ నేపథ్యంలో పాండ్య తన ఆటను మెరుగు పరుచుకునేందుకు ఈ సిరీస్ ఓ వరంగా చెప్పొచ్చు.
బంతితో బ్యాట్‌తో అత ను రాణించాల్సిన అవసరం ఉంది. కేదార్ జాదవ్, దినేశ్ కార్తీక్, లోకేశ్ రాహుల్ తదితరులకు కూడా ఈ సిరీస్ పరీక్షగా మారింది. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జట్టును స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలని వారు భావిస్తున్నారు. ఇక, ఖలీల్ అహ్మద్, సిరాజ్, భువనేశ్వర్, షమిలకు కూడా ఆస్ట్రేలియా సిరీస్ కీలకంగా మారింది. ఇందులో రాణించి ప్రపంచకప్ బెర్త్‌ను సొంతం చేసుకోవాలని భావిస్తున్నారు.

భారత పర్యటనకు ఆస్ట్రేలియా

టీమిండియాతో ఐదు వన్డేలు

ముంబయి: ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు వచ్చే నెలలో భారత్‌లో పర్యటించనుంది. ఈ సిరీస్‌లో ఆస్ట్రేలియా ఐదు వన్డేలు, మరో ట్వంటీ–20 మ్యాచుల్లో భారత్‌తో తలపడుతుంది. ఫిబ్రవరి 24 బెంగళూరులతో తొలి టి–20, 27న విశాఖపట్నంలో రెండో టి–20 జరుగుతుంది. అంతేగాక మార్చి రెండు నుంచి 13 వరకు ఐదు వన్డేలు జరుగుతాయి. మార్చి రెండున హైదరాబాద్‌లో తొలి వన్డే, 5న నాగ్‌పూర్‌లో రెండో వన్డే, మార్చి 8న రాంచీలో మూడో వన్డే, 10న మొహాలీలో నాలుగో వన్డే జరుగుతుంది. ఇక, చివరి వన్డే మార్చి 13 ఢిల్లీలో నిర్వహిస్తారు. కాగా, సిరీస్ వివరాలను బిసిసిఐ గురువారం అధికారికంగా ప్రకటించింది. రానున్న ప్రపంచకప్ నేపథ్యంలో ఈ సిరీస్ ఇరు జట్లకు చాలా కీలకంగా మారనుంది.





రాహుల్, పాండ్యలపై కఠిన చర్యలు

రెండు వన్డేల నిషేధం?

ముంబయి: ఓ టివి షోలో పాల్గొని మహిళలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన భారత క్రికెటర్లు లోకేశ్ రాహుల్, హార్దిక్ పాండ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని బిసిసిఐ పాలక మండలి భావిస్తున్నట్టు తెలిసింది. బాలీవుడ్ నిర్మాత కరణ్ జోహార్ వ్యాఖ్యాతగా వ్యవహరించే ఓ షోలో పాల్గొన్న పాండ్య, రాహుల్‌లు మహిళలనుద్దేశించి చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారం లేపాయి. వీరి వ్యాఖ్యలపై మహిళల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. దీంతో రంగంలోకి దిగిన భారత క్రికెట్ బోర్డు (బిసిసిఐ) పాండ్య, రాహుల్‌లకు నోటీసులు జారీ చేసింది. దీనికి స్పందించిన పాండ్య, రాహుల్‌లు సోషల్ మీడియా వేదికగా క్షమాపణ కోరారు. అయితే బిసిసిఐ పాలకుల కమిటీ (సిఓఎ) చైర్మన్ వినోద్ రాయ్ ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన హార్దిక్, రాహుల్‌లపై రెండు వన్డేల నిషేధం విధించాలని వినోద్ రాయ్ సూచించారు. గురువారం బిసిసిఐ సిఇఓ రాహుల్ జోహ్రికి పంపిన మెయిల్‌లో రాయ్ ఈ ప్రతిపాదన చేశారు. షో సందర్భంగా వారిద్దరూ చేసిన వ్యాఖ్యలను ఈ రోజు పరిశీలించాను, అవి ఏమాత్రం ఆమోద యోగ్యంగా లేవు, క్షమాపణలు ఆ తప్పును సరిచేయలేవు, వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో పాలక కమిటీ సభ్యురాలు డయానాను అడిగాను, రెండు మ్యాచ్‌ల నిషేధం సరైందని భావిస్తున్నాన్నట్టు డయానా తెలిపారు. దీంతో ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాయ్ బిసిసిఐకి మెయిల్ పంపించారు. దీంతో హార్దిక్ పాండ్య, రాహుల్‌లపై రెండు వన్డేల నిషేధం విధించడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా, నిషేధం విధించే ముందు పాలకుల కమిటీ న్యాయ పరమైన సలహాలు తీసుకోవాలని నిర్ణయించింది. ఈ తర్వాతే దీనిపై తుది నిర్ణయం తీసుకుంటారని రాయ్ స్పష్టం చేశారు.

వ్యాఖ్యలపై దుమారం

కాఫీ విత్ కరణ్ షోలో పాల్గొన్న హార్దిక్, రాహుల్ మహిళల గురించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాండ్య మాట్లాడుతూ అమ్మాయిల విషయంలో తాను బుద్ధిమంతుడ్ని కానని, వాళ్లను అదో టైపుగా చూస్తా, క్లబ్‌లలో వారి ఒంపుసొంపులపై కన్నేస్తా, ఎవరైనా అమ్మాయితో కలిస్తే ఆ విషయాన్ని తల్లిదండ్రులతో చెప్పేస్తా అని చెప్పాడు. మరోవైపు రాహుల్ మాట్లాడుతూ ఓ సారి తన పాయింట్ జేబులో కాండోమ్ పాకెట్ దొరికింది. దీంతో నా తల్లి ఈ విషయాన్ని తండ్రి దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై తండ్రి స్పందిస్తూ కండోమ్ ఉంది కదా పర్లేదు అని వ్యాఖ్యానించాడు అని పేర్కొన్నాడు.

కాగా, రాహుల్, హార్దిక్‌లు చేసిన ఈ వ్యాఖ్యలు పెద్ద దుమారమే లేపాయి. దేశ వ్యాప్తంగా మహిళా సంఘాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై బిసిసిఐ పాలకుల కమిటీ తీవ్రంగా స్పందించింది. క్రికెటర్లు రాహుల్, పాండ్యలకు షోకజ్ నోటీసులు కూడా జారీ చేసింది. దీనిపై ఇప్పటికే పాండ్య సంజాయిషి ఇచ్చుకున్నాడు. రాహుల్ మాత్రం ఇప్పటి వరకు స్పందించలేదు. కాగా, పాండ్య వివరణపై పాలకుల కమిటీ సంతృప్తి చెందలేదు. వీరిద్దరిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ బిసిసిఐకి సిఫార్సు చేసింది.



విరాట్ ఆట అద్భుతం

ఆసీస్ దిగ్గజం మెక్‌గ్రాత్

మెల్‌బోర్న్: భారత కెప్టెన్ విరాట్ కోహ్లిపై ఆస్ట్రేలియా మాజీ దిగ్గజం గ్లెన్ మెక్‌గ్రాత్ ప్రశంసల వర్షం కురిపించాడు. విరాట్ బ్యాటింగ్ అంటే తనకు ఎంతో ఇష్టమన్నాడు. ప్రపంచంలో తాను చూసిన అత్యుత్తమ బ్యాట్స్‌మన్‌లలో కోహ్లి ఒకడన్నాడు. ఫార్మాట్ ఏదైనా అతను ఆడే విధానానికి తాను ఫిదా అయ్యానన్నాడు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న మెక్‌గ్రాత్ ఈ విషయాలు వెల్లడించాడు. ఆస్ట్రేలియా గడ్డపై భారత జట్టు టెస్టు సిరీస్ గెలవడం ఎంతో ఆనందం కలిగించిందన్నాడు. సారథిగా కోహ్లి వ్యవహరించిన తీరే టీమిండియా గెలుపులో కీలక పాత్ర పోషించిందన్నాడు. సారథిగా జట్టును ముందుండి నడిపిస్తున్న కోహ్లిపై పొగడ్తలు కురిపించాడు. కోహ్లిలోని దూకుడు తనను కట్టి పడేస్తుందన్నాడు. ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా చివరి వరకు పోరాడడం కోహ్లికి ఉన్న మంచి అలవాటన్నాడు. ప్రపంచ క్రికెట్‌లో భారత్ బలమైన జట్టుగా ఎదుగుతుందన్నాడు. బుమ్రా, షమి, భువనేశ్వర్ వంటి అగ్రశ్రేణి ఫాస్ట్ బౌలర్లు భారత్‌కు అందుబాటులో ఉన్నారన్నాడు. కాగా, ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్‌లో భారత్‌కే ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నాడు. అయితే సొంత గడ్డపై ఆస్ట్రేలియాను ఓడించడం అంత సులువు కాదన్నాడు. దీంతో పోరు హోరాహోరీగా సాగడం ఖాయమని మెక్‌గ్రాత్ జోస్యం చెప్పాడు.



ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పిబిఎల్) టోర్నమెంట్‌లో ఆడేందుకు బెంగళూరుకు వచ్చిన స్టార్ షట్లర్లు పి.వి. సింధు, అశ్విని పొన్నప్ప తదితరులు



బెంగళూరులో జరుగుతున్న ఓ ఎగ్జిబిషన్‌ను సోదరి ఆనమ్ మీర్జాతో కలిసి తిలకిస్తున్న భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా

క్రికెట్‌లో అరుదైన వింత



ముంబయి: క్రికెట్ అంటే అంతుబట్టని ఆట అనడంలో సందేహం లేదు. ఏ నిమిషానికి ఫలితం ఎలా మారుతుందో ఊహించడం చాలా కష్టం. అనిశ్చితి క్రీడ ఏదైనా ఉందని అంటే అది క్రికెట్ మాత్రమే అంటే అతిశయోక్తి కాదు. ఇలాంటి అరుదైన వింత క్రికెట్ మ్యాచ్ ఒకటి ముంబయి వేదికగా జరిగింది. వివరాల్లోకి వెళితే ఆదర్శ్ క్రికెట్ కల్బ్ (మహారాష్ట్ర) నిర్వహించిన ఓ క్రికెట్ మ్యాచ్‌లో స్థానిక జట్లు దేశాయ్, జునిడోంబ్లివి తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో గెలిచేందుకు దేశాయ్ జట్టుకు చివరి బంతికి ఆరు పరుగులు అవసరమయ్యాయి. అయితే ఒకే బంతి మిగిలివుండడంతో అందరిలోనూ ఆసక్తి నెలకొంది. మ్యాచ్‌లోనూ తీవ్ర ఉత్కంఠ ఏర్పడింది. తీరా మొదటి బంతి పడింది. అది కాస్త వైడ్, రెండో బంతి అది కూడా వైడ్..ఇలా ఆరు బంతులు వరుసగా వైడ్‌లు మారాయి. దీంతో దేశాయి జట్టు అనూహ్యంగా ఒక బంతి మిగిలివుండగానే క్రికెట్‌లోనే అరుదైన విజయాన్ని అందుకుంది. ఇప్పటి వరకు చివరి బంతికి ఫోర్ లేదా సిక్స్ కొట్టి విజయం సాధించడం చూశాం. కానీ ఈ మ్యాచ్‌లో మాత్రం అనూహ్య ఫలితం వెలువడడం విశేషం.

సాహాకు చోటు కష్టమే

అనిల్ కుంబ్లే



ముంబయి: రానున్న రోజుల్లో టీమిండియాలో చోటు సంపాదించడం సీనియర్ వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహాకు చాలా కష్టమని భారత మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే జోస్యం చెప్పాడు. ప్రస్తుత పరిస్థితుల్లో యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్ టెస్టు జట్టులో స్థానాన్ని శాశ్వతం చేసుకున్నాడన్నాడు. సాహా గాయపడడంతో జట్టుకు ఆడే అవకాశం దక్కించుకున్న పంత్ వెనుదిరిగి చూడలేదన్నాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో ముగిసిన టెస్టు సిరీస్‌లో రిషబ్ అసాధారణ రీతిలో చెలరేగి పోయాడని కుంబ్లే ప్రశంసించాడు. వికెట్ల వెనుక అద్భుతంగా రాణించిన పంత్ బ్యాట్‌తోనూ చెలరేగాడన్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో పంత్‌ను కాదని సాహాను టెస్టు జట్టులో ఆడించే అవకాశం ఏమాత్రం కనిపించడం లేదని కుంబ్లే అభిప్రాయపడ్డాడు. సాహా కూడా అద్భుత ఆటగాడు అనడంలో సందేహం లేదని, అయితే వరుస గాయాలు అతని కెరీర్‌ను దెబ్బ తీశాయన్నాడు. ఇక, పంత్ తనకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జట్టులో స్థానాన్ని పదిలం చేసుకున్నాడన్నాడు. పంత్‌ను తప్పించి వేరే ఆటగాడికి వికెట్ కీపింగ్ బాధ్యతలు అప్పగించే పరిస్థితి కనుచూపు మెరలో కనిపించడం లేదన్నాడు. దీంతో వికెట్ కీపర్‌గా భారత్‌కు ప్రాతినిధ్యం వహించాలనే సాహా కలను నెరవేరడం చాలా కష్టమని భారత మాజీ ప్రధాన కోచ్ కుంబ్లే పేర్కొన్నాడు.

యెమెన్‌లోని ఎడెన్ నగర శివారులో గురువారం మిలటరీ పరేడ్‌పై హౌతి తిరుగుబాటుదారులు డ్రోన్ బాంబులతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో సౌదీ నాయకత్వంలోని సంకీర్ణ బలగాలు, మిత్ర రాజ్యాల కూటమికి చెందిన ఆరుగురు సైనికులు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. గతంలో అమెరికా బలగాలు యెమెన్ అల్‌ఖైదా శాఖను మట్టుబెట్టిన అల్ ఆనంద్ ఎయిర్ బేస్ వద్ద తిరుగుబాటుదారులు దాడికి పాల్పడ్డారు.

విశాల



ప్రధానిని కలిసిన బాలీవుడ్ నటులు

న్యూఢిల్లీ / ముంబయి : ప్రధాని నరేంద్ర మోడీని బాలీవుడ్ అగ్ర నటులు రణ్‌వీర్ సింగ్, రణ్‌బీర్ కపూర్, అలియాభట్, వరుణ్ దావన్‌లు ఢిల్లీలో గురువారం కలుసుకున్నారు. ఇదివరకు బాలీవుడు నిర్మాతలు ప్రధానితో కలుసుకొని, సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించగా, సినిమా టిక్కెట్లపై జిఎస్‌టి తగ్గించడానికి దారితీసిన విషయం తెలిసిందే. అయితే, బాలీవుడ్ నటులు ప్రధానితో ఏ విషయంపై కలిశారనే విషయం బహిర్గతం కాలేదు. ప్రధానితో భేటీ అయిన దర్శకులు, నటుల బృందానికి కరణ్ జోహార్ సారథ్యం వహించారు. ప్రధానిని కలిసిన వారిలో ఇంకా డైరెక్టర్ రోహిత్ శెట్టి, రాజ్‌కుమ్మర్ రావు, విక్కీ కౌశల్, అయుష్‌మణ్ణ్ ఖురన్నా, భుమి పెడెన్కర్, సిద్ధార్థ మల్హోత్రలు ఉన్నారు.

పారికర్ సిఎంగా కొనసాగడం సిగ్గుచేటు

గోవా ఆర్‌ఎస్‌ఎస్ మాజీ చీఫ్ సుభాష్ వెలింగ్‌కర్



పనాజి: తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్నప్పటికీ మనోహర్ పారికర్ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగడం సిగ్గుచేటని గోవా ఆర్‌ఎస్‌ఎస్ మాజీ అధ్యక్షుడు సుభాష్ వెలింగ్‌కర్ తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. గోవా సురక్షా మంచ్ అనే రాజకీయ పార్టీకి నాయకత్వం వహిస్తున్న వెలింగ్‌కర్ పనాజీలో కొంతమంది మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గోవాలాంటి రాష్ట్రాన్ని తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఒక వ్యక్తి పాలించడం సిగ్గపడాల్సిన విషయమని, ముఖ్యమంత్రి విశ్రాంతి తీసుకుంటే బాగుంటుందని, ఆయన ఇంకా పదవి పట్టుకుని వేలాడడం సిగ్గుచేటని అన్నారు.

రాహుల్, పవార్‌ల చర్చలు అసంపూర్తి



ముంబయి: మహారాష్ట్రలోని ఎనిమిది లోక్‌సభ స్థానాల్లో ఏకాభిప్రాయం కుదరక పోవడంతో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ఎన్‌సిపి అధినేత శరద్ పవార్ మధ్య జరిగిన సీట్ల పంపిణీ చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. బుధవారం 6 జనపథ్ లో ఇరువురి మధ్య చర్చలు జరిగినట్లు ఎన్‌సిపి సీనియర్ నేత ఒకరు తెలిపారు. మిగతా సీట్ల పంపిణీపై మరో విడత చర్చలు కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖార్గే, సీనియర్ ఎన్‌సిపి నేత ప్రఫుల్ పటేల్ మధ్య జరగనున్నట్లు పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఎన్‌సిపి నాలుగు స్థానాలు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం రెండు స్థానాలను మాత్రమే దక్కించుకుంది. దీంతో కూటమిగా ఏర్పడేందుకు ఇరు పార్టీలు ఆసక్తి చూపుతున్నాయి.

సిక్కింలో పులి జాడలు

గాంగ్‌టక్ : సిక్కిం అభయారణ్యంలో ఉన్న రాయల్ బెంగాల్ టైగర్ పర్యావరణ అధికారుల కెమెరా కంటపడింది. ఈ టైగర్ పర్యావరణ శాఖ కెమెరాకు చిక్కడం ఇదే తొలిసారి. '' తూర్పు సిక్కింలో ఉన్న పంగోలక్క వన్యప్రాణుల అభయారణ్యంలో టైగర్ కదలికలు, కెమెరాకు చిక్కడం వాస్తవం'' అని తూర్పు వన్యప్రాణుల డివిజన్ అటవీ అధికారి డెకెన్ లచుంగ్పా తెలిపారు. డిసెంబర్ 6వ తేదీన సాయంత్రం 6.23 నుంచి 7 గంటల వరకు సమయంలో ఈ టైగర్ కెమెరాకు చిక్కిన రెండు ఫోటోలు ఉన్నాయన్నారు. ఈ పులి 9,583 అడుగుల ఎత్తులో కెమెరా కంటపడినట్టు ఆయన తెలిపారు. 1980 నుంచి సిక్కిం అభయారణ్యంలో పులులు తిరుగుతున్నట్లు లచుంగ్పా వివరించారు.

ఎస్‌పికి తిరిగి వెళ్లే ప్రసక్తే లేదు: శివపాల్



లక్నో: సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి)కి తిరిగి వెళ్లే ప్రసక్తే లేదని అయితే కూటమిగా ఏర్పడే అవకాశం ఉందని ప్రగతి శీల సమాజ్‌వాదీ పార్టీ(లోహియా) వ్యవస్థాపక అధ్యక్షుడు శివపాల్ యాదవ్ పేర్కొన్నారు. అఖిలేష్, శివపాల్‌లు కలవబోతున్నట్లు ఇటీవల ఎస్‌పి సీనియర్ నేత ఆజం ఖాన్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. మతతత్వ బిజెపినిఅడ్డుకునేందుకు ఎస్‌పి, బిఎస్‌పి, కాంగ్రెస్ సహా ఏ పార్టీతోనైనా పొత్తుకు ఆహ్వానిస్తున్నట్లు శివల్‌పాల్ పేర్కొన్నారు. తమ పార్టీ మద్దతు లేకుండా కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. తన అన్న ములాయం సింగ్ ఎక్కడి నుంచి పోటీ చేసినా మద్దతిస్తానన్నారు.

అసోంలో కొనసాగుతున్న ఆందోళనలు

గువహటి: అసోంలో వివాదాస్పద పౌరసత్వ (సవరణ) బిల్లుకు నిరసనగా గురువారం విద్యార్థులు, న్యాయవాదులు, డాక్టర్లు ఆందోళన నిర్వహించారు. బిల్లుకు నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గౌరవ సూచకంగా ప్రజలు అసోం స్కార్ఫ్‌ను చేత పట్టుకొని సచివాలయం ముందు 'సంకల్ప దివస్'ను పాటించారు. ఈ బిల్లు అసోం ప్రజల ఉనికికే ప్రమాదమని పేర్కొన్నారు. గౌహతి మెడికల్ కాలేజ్, ఆస్పత్రి జూనియర్ డాక్టర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. విద్యార్థులు తరగతులు బహిష్కరించి,రోడ్లపై ఆందోళనలు చేపట్టారు. తమ ప్రయోజనాలకు భంగం కలిగితే ప్రధాని నరేంద్ర మోడీ, కేబినెట్ మంత్రులను అసోంలో ప్రవేశించకుండా అడ్డుకుంటామని ఆందోళన కారులు హెచ్చరించారు.

జుట్టుకు తెల్ల రంగేసుకుని అయ్యప్పదర్శనం చేసుకున్నా

ఫేస్‌బుక్‌లో వెల్లడించిన 36 ఏళ్ల దళిత మహిళ



తిరువనంతపురం: శబరిమలలోని అయ్యప్ప ఆలయంలోకి 50 ఏళ్ల లోపు వయసు ఉన్న ఇద్దరు మహిళలు గత వారం ప్రవేశించడంపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నిరసనలు పెల్లుబికిన నేపథ్యంలో 36 ఏళ్ల దళిత మహిళా కార్యకర్త ఒకరు తాను మంగళవారం తెల్లవారుజామున అయ్యప్ప దర్శనం చేసుకున్నానని వెల్లడించారు. ఎస్.పి. మంజు అనే ఆ మహిళ తన ఫేస్‌బుక్ పేజీలో ఈ విషయాన్ని పోస్ట్ చేస్తూ 50 ఏళ్లు దాటిన మహిళ మాదిరిగా జుట్టుకు తెల్లరంగేసుకుని తాను అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించానని ఆమె తెలిపారు. ఆలయంలో తాను ప్రార్థనలు చేస్తున్న ఫోటోలను కూడా ఆమె పోస్ట్ చేశారు. అయితే, పోలీసులు మాత్రం నిరసనకారుల కళ్లు గప్పి ఆమె గుడిలోకి వెళ్లి ఉండవచ్చని చెబుతున్నారు. తాను పోలీసు భద్రతను కోరలేదని, ఇతర పురుష భక్తులతో కలిసే కొండ ఎక్కానని మంజు చెబుతున్నారు.

'అయోధ్య' విచారణ ఆలస్యం!

ధర్మాసనం నుంచి తప్పకున్న జస్టిస్ లలిత్ • విచారణ 29కి వాయిదా • కొత్త ధర్మాసనం ఏర్పాటు చేస్తామన్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: అయోధ్యలోని రామజన్మభూమి– బాబ్రీ మసీదు స్థల వివాదంపై విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. ఈ కేసులో వాదనలు వినేందుకు సుప్రీంకోర్టు అయిదుగురు న్యాయమూర్తులతో రాజ్యాంగ ధర్మాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.ఈ ధర్మాసనం గురువారం విచారణ ప్రారంభించింది. అయితే బెంచ్‌లో ఒకరైన జస్టిస్ యుయు లలిత్ బెంచ్‌నుంచి తప్పుకోవడంతో తదుపరి విచారణను ఈ నెల 29కి వా యిదా వేసింది. అయోధ్య కేసు విచారణ కోసం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ నేతృత్వంలో న్యాయమూర్తులు జస్టిస్ ఎస్‌ఎ బోబ్డే, జస్టిస్ యుయు లలిత్, జస్టిస్ ఎన్‌వి రమణ, జస్టిస్ డివై చంద్రచూడ్‌లతో రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటయిన విషయం తెలిసిందే. ఈ ధర్మాసనం గురువారం విచారణ ప్రారంభించింది. అయితే బెంచ్‌లో జస్టిస్ లలిత్ ఉండడంపై సీనియర్ న్యాయవాది రాజీవ్ ధవన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. జస్టిస్ లలిత్ గతంలో ఇదే కేసులో యుపి మాజీ ముఖ్యమంత్రి కళ్యాణ్ సింగ్ తరపున వాదించారు. దీంతో రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ లలిత్ ఉండడంపై ధవన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో జస్టిస్ లలిత్ విచారణనుంచి తప్పుకొన్నారు.ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు విచారణను వాయిదా వేసింది. జనవరి 29నుంచి కొత్త బెంచ్ అయోధ్య కేసులో వాదనలు వింటుందని ప్రకటించింది. అయోధ్యలోని



2.77 ఎకరాల వివాదాస్పద భూమిని సున్నీ వక్ఫ్ బోర్డు, నిర్మోహి అఖాడా, రామ్‌లల్లాల మధ్య సమానంగా పంపిణీ చేయాలని అలహాబాద్ హైకోర్టు గతంలో తీర్పు చెప్పింది. ఈ తీర్పుపై అసంతృప్తి చెందిన పలువురు దీన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వ్యక్తులు, ధార్మిక సంస్థల తరపున 14 వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ వ్యాజ్యాలను పరిశీలించిన సుప్రీంకోర్టు 2019 జనవరి మొదటివారంలో ధర్మాసనానికి నివేదిస్తామని గత ఏడాది అక్టోబర్ 29న పేర్కొంది. విచారణ నిమిత్తం గత మంగళవారం అయిదుగురు న్యాయమూర్తులతో ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది.

వాదనలు ప్రత్యక్ష ప్రసారం చేయండి

ఇదిలా ఉండగా అత్యంత సున్నితమైన రామజన్మభూమి–బాబ్రీమసీదు భూమి వివాదం కేసుపై సుప్రీంకోర్టులో జరిగే వాదనలను ప్రత్యక్ష ప్రసారం చేయాలని కోరుతూ ఆర్‌ఎస్‌ఎస్ మాజీ సిద్ధాంతకర్త కెఎన్ గోవిందాచార్య గురువారం కేంద్రానికి లేఖ రాశారు. బోలెడంత గందరగోళం, ప్రత్యేకతలు కలిగిన దశాబ్దాల నాటి ఈ వివాదంలో వాదనలు జరిగే తీరును ఈ దేశ ప్రజలు వీక్షించేందుకు అవకాశం కల్పిస్తూ విచారణ ప్రారంభమయ్యే ఈ నెల 29లోగా ఏర్పాట్లు చేయాలని గోవిందాచార్యతో పాటుగా 'సెంటర్ ఫర్ అకౌంటబిలిటీ అండ్ సిస్టమేటిక్ చేంజ్'అనే స్వచ్ఛంద సంస్థ తరపు న్యాయవాది కెజి గుప్త కేబినెట్ సెక్రటరీ పికె సిన్హాకు రాసిన లేఖలో కోరారు.

కోటా బిల్లుపై సుప్రీంకోర్టులో పిటిషన్



కోటా బిల్లు ఆమోదం పొందడంతో ఢిల్లీలో సంబరాలు చేసుకుంటున్న బిజెపి శ్రేణులు

న్యూఢిల్లీ: అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటు ఉభయసభలు ఆమోదించాయి. ఇక రాష్ట్రపతి సంతకం పెడితే చాలు ఈ బిల్లు చట్టరూపం దాలుస్తుంది. అయితే ఈ బిల్లును సవాలు చేస్తూ 'యూత్ ఫర్ ఈక్వాలిటీ' అనే సంస్థ, కౌశల్‌కాంత్ మిశ్రా అనే వ్యక్తి గురువారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ బిల్లు వల్ల దేశంలో రిజర్వేషన్లు 50 శాతానికి మించుతాయని, ఇది రాజ్యాంగ విరుద్ధమని వారు ఆ పిటిషన్లలో పేర్కొన్నారు. విద్య, నద్యోగాల్లో అగ్రవర్ణాల పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన 124వ రాజ్యాంగ సవరణ బిల్లును కేవలం రెండు రోజుల్లోనే పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించిన విషయం తెలిసిదే. బిల్లును మంగళవారం లోక్‌సభ ఆమోదించగా, బుధవారం రాజ్యసభలోను సభ్యులు ఆమోదం తెలిపారు. బిల్లును సెలెక్ట్ కమిటీకి నివేదించాలని కొంత మంది సభ్యులు కోరినప్పటికీ చివరికి అందరూ బిల్లుకు మద్దతు తెలిపారు. ఈ రిజర్వేషన్ల వల్ల బ్రాహ్మణులు, మరాఠాలు, భూమిహార్లు. వైశ్యులు, కమ్మ, రెడ్డి, కాపు, క్షత్రియ వంటి సామాజిక వర్గాలు లబ్ది పొందుతాయి. ప్రస్తుతం ఎస్‌సి, ఎస్‌టి, వెనుకబడిన వర్గాలకున్న49 శాతం రిజర్వేషన్లకు ఇవి అదనం. అంటే దేశంలో రిజర్వేషన్లు 59.5 శాతానికి చేరుకుంటాయి. అయితే రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు గతంలో తీర్పు ఇచ్చింది. ఈ బిల్లు ఆ తీర్పుకు వ్యతిరేకంగా ఉండడంతో దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలయింది.

8వ తరగతి వరకు హిందీ తప్పనిసరి

కస్తూరీ రంగన్ కమిటీ ముసాయిదా నివేదిక



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో 8వ తరగతి వరకు హిందీ భాషను కచ్చితంగా అమలు చేయాలని నూతన విద్యా విధానంపై(ఎన్‌ఇపి) కె కస్తూరి రంగన్ సారథ్యంలోని తొమ్మిది మంది సభ్యుల కమిటీ రూపొందించిన ముసాయిదా నివేదిక సిఫార్సు చేసింది. ఎనిమిదవ తరగతి వరకు హిందీ భాషను తప్పనిసరి చేసిన కమిటీ త్రిభాషా సూత్రానికి కట్టుబడుతూ తన నివేదికను కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ(హెచ్‌ఆర్‌డి)కు గత నెలలో సమర్పించింది. ప్రధాన మంత్రి కార్యాలయం(పిఎంఓ) నుంచి అందుకున్న సూచనలను ఈ ముసాయిదా నివేదికలో కమిటీ పొందుపరిచినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం హిందీయేతర రాష్ట్రాలైన కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, గోవా, పశ్చిమ బెంగాల్, అస్సాం తదితర రాష్ట్రాలలోని పాఠశాలల్లో హిందీ తప్పనిసరి బోధన భాష కాదు. హిందీని 8వ తరగతి వరకు తప్పనిసరిగా అమలు చేయడం వల్ల సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులకు దేశవ్యాప్తంగా ఒకే సిలబస్‌ను రూపొందించడం వీలవుతుందని ముసాయిదా నివేదికలో కమిటీ అభిప్రాయపడింది. గిరిజన మాండలికాల కోసం దేవనాగరిలో పాఠ్యాంశాలు తయారుచేయాలని, నైపుణ్యం ఆధారంగా విద్యావ్యాప్తి జరగాలని కూడా కమిటీ సిఫార్సు చేసింది. అవధి, భోజ్‌పురి, మైథిలి తదితర స్థానిక భాషలలో ఐదవ తరగతి వరకు సిలబస్ రూపొందించాలని కమిటీ సూచించింది.

రాహుల్‌కు మహిళా కమిషన్ నోటీసు

నిర్మలా సీతారామన్‌పై వ్యాఖ్యల ఫలితం

అంతా రాజకీయ ప్రేరేపితం : కాంగ్రెస్

న్యూఢిల్లీ: జాతీయ మహిళా కమిషన్ గురువారం కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి నోటీసులు జారీచేసింది. జైపూర్‌లో జరిగిన ఒక ర్యాలీలో రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉద్దేశించి అనైతిక వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ రాహుల్ గాంధీకి మహిళా కమిషన్ నోటీసులు జారీచేసింది. జనవరి 9న వివిధ పత్రికలలో, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన వార్తలను తనకు తానుగా పరిగణనలోకి తీసుకున్న మహిళా కమిషన్ ఒక మహిళా మంత్రిని అవమానిస్తూ వ్యాఖ్యలు చేశారని పేర్కొంది. "తన పురుషాహంకార ప్రకటనతో రాహుల్ గాంధీ ఏం చెప్పదలచుకున్నారు..నన్ను కాపాడండి అని ఒక ప్రధాని నరేంద్ర మోడీ ఒక మహిళతో అన్నారట. మహిళను అడ్డం పెట్టుకుని రాఫెల్ నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించారట? మహిళలు బలహీనులని రాహుల్ భావిస్తున్నారా? ఒక సమర్థవంతమైన రక్షణ మంత్రిని బలహీనమైన వ్యక్తిగా సంబోధించడం బాధాకరం" అంటూ జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ ట్వీట్ చేశారు. బుధవారం జైపూర్‌లో నిర్వహించిన రైతుల ర్యాలీలో రాహుల్ ప్రసంగిస్తూ, "56 అంగుళాల ఛాతీగల కాపలాదారుడు పరుగెత్తుకుంటూ ఒక మహిళ వద్దకు వెళ్లి.. సీతారాంజీ నన్ను రక్షించండి..నన్ను నేను కాపాడుకోలేను అని చెప్పుకున్నారు" అంటూ వ్యాఖ్యానించారు. మరోవైపు ఎన్‌సిడబ్ల్యు నోటీసుపై కాంగ్రెస్ స్పందించింది. రాహుల్‌కు నోటీసు పంపడం రాజకీయ ప్రేరేపితం అని ఆ పార్టీ అధికార ప్రతినిధి ఆనంద్ శర్మ అన్నారు. జాతీయ మహిళా కమిషన్ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో సోనియా గాంధీని ఉద్దేశించి మోడీ తీవ్ర విమర్శలు చేసినప్పుడు మహిళా కమిషన్ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు.

మోడీకి అలోక్ వణుకు

రాహుల్ విమర్శ

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీకి రాఫెల్ భయం పట్టుకుందని, అందుకే సిబిఐ చీఫ్ అలోక్‌వర్మపై వేటు వేసేందుకు తొందరపడుతున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. నిజాలు చెప్పేవారు, నిజాయితీగల వారు అంటే మోడీకి ముచ్చెమటలు పడుతాయని వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు తీర్పుతో సిబిఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మ తిరిగి నియమితులు అయ్యారు. అయితే ఆయన భవితవ్యాన్ని తేల్చేందుకు ప్రధాని మోడీ సారథ్యపు ఎంపిక కమిటీ బుధవారం సమావేశం అయింది. సిబిఐ డైరెక్టర్‌ను ఈ కమిటీ ఎంపిక చేస్తుంది. గత అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వం అసాధారణ రీతిలో సిబిఐ డైరెక్టర్ వర్మను బాధ్యతల నుంచి తప్పించింది. ఆయనపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని పేర్కొంటూ సెలవుపై ఇంటికి పంపించింది. అయితే దీనికి వ్యతిరేకంగా వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనితో ఆయనను తిరిగి బాధ్యతల్లోకి



తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇటీవలే పేర్కొంది. ఇది ప్రభుత్వానికి మందలింపుగా మారింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీపై గురువారం రాహుల్ రెండు ప్రశ్నలను సంధించారు. సిబిఐ చీఫ్‌ను బర్తరఫ్ చేసేందుకు ప్రధాని ఎందుకింతగా తొందరపడుతున్నారు? సెలెక్షన్ కమిటీ ముందు ఆయన తన వాదన విన్పించుకునేందుకు ఎందుకు అవకాశం ఇవ్వడం లేదు? ఈ రెండు ప్రశ్నలకు ఉమ్మడి సమాధానం ఒక్కటే అని అది రాఫెల్ అని, రాఫెల్ డీల్‌పై ప్రధాని భయపడుతున్నందుననే , దీనిపై సిబిఐ డైరెక్టర్ చర్యలకు పాల్పడుతారనే అనుమానంతోనే ఆయనను తప్పించేందుకు యత్నిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఈ నెల 31వ తేదీతోనే ప్రస్తుత సిబిఐ డైరెక్టర్ పదవీకాలం ముగుస్తుంది. లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసంలో బుధవారం జరిగిన సెలెక్ట్ కమిటీ భేటీలో ఎటువంటి నిర్ణయం తీసుకున్నారనేది వెల్లడికాలేదు. అలోక్ వర్మను తిరిగి సిబిఐ డైరెక్టర్‌గా నియమిస్తూ సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశాలు వెలువరించిందని రాహుల్ గుర్తు చేశారు. దీనితో రాఫెల్ దర్యాప్తు నుంచి ఇక మోడీని ఎవరూ రక్షించజాలరని స్పష్టం చేశారు. రాఫెల్ లోగుట్టు వ్యవహారంలో ప్రధాని మోడీ ఏకంగా రూ 30000 కోట్ల ప్రజా ధనాన్ని కొట్టేశారని, దీనిని అప్పుడు అనిల్ అంబానీకి కట్టబెట్టారని రాహుల్ విమర్శించారు. రాఫెల్ డీల్‌కు సంబంధించి చాలా రోజులుగా కాంగ్రెస్ నేత రాహుల్ ప్రధాని మోడీని, అనిల్ అంబానీనీ లక్ష్యంగా చేసుకుని దాడికి దిగుతున్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు ఈ విమర్శల తాకిడి వెల్లువెత్తింది.

పొత్తులకు రెడీ.. మిత్రులను వదులుకోం

ప్రాంతీయ పార్టీలకు మోడీ ఆహ్వానం

చెన్నై : కూటమి స్నేహాలకు బిజెపి అనుకూలమని, పాత మిత్రులను చేరదీస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని వ్యాఖ్యలకు రాజకీయ ప్రాధాన్యత ఏర్పడింది. అంతేకాకుండా తమిళనాడులో ఎన్‌డిఎ పటిష్టతకు బిజెపి యత్నిస్తోందనే విషయాన్ని కూడా ఆయన మాటలు స్పష్టం చేశాయి. గురువారం మోడీ తమ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమిళనాడులోని ఐదు జిల్లాల పార్టీ బూతు స్థాయి కార్యకర్తలతో మాట్లాడారు. వారి సాధక బాధకాలను విన్నారు. వారికి తగు సూచనలు వెలువరించారు. సంకీర్ణ రాజకీయాలంటే బిజెపికి ఎప్పుడూ ఏవగింపు లేనేలేదని ప్రధాని స్పష్టం చేశారు. నిజానికి అటల్ బిహారీ వాజ్‌పేయి ఆధ్వర్యంలోనే సంకీర్ణ రాజకీయాలు విజయవంతం అయ్యాయని తెలిపారు. రాజకీయ పొత్తులు, కూటమి ఏర్పాటుకు బిజెపి ఎప్పుడూ ద్వారాలు తెరి చి ఉంచుతుందని తేల్చిచెప్పారు. దివంగత ప్రధాని వాజ్‌పేయి 1990లో సంకీర్ణ రాజకీయాలకు సార్థకత కూర్చారని గుర్తు చేశారు. 20 ఏళ్ల క్రితం దార్శనిక నేత వాజ్‌పేయి అప్పటివరకూ భారతీయ రాజకీయ రంగంలో లేని సరికొత్త అధ్యాయాన్ని సృష్టించారని తెలిపారు. అప్పట్లో వివిధ పార్టీల మిశ్రితంగా అధికారం నిర్వహించారని చెప్పారు. అంతేకాకుండా ప్రాంతీయ పార్టీలకు ,ప్రాంతీయ రాజకీయాలకు వాజ్‌పేయి సముచిత ప్రాధాన్యతను ఇచ్చారని వివరించారు. అటల్‌జీ చూపిన బాటను బిజెపి ఎప్పుడూ అనుసరిస్తూనే ఉంటుందని తేల్చిచెప్పారు. ఈ విధంగా తమిళనాడులో ప్రాంతీయ పార్టీలతో సరికొత్త స్నేహాలకు, పాత మిత్రత్వాల పునరుద్ధరణకు మోడీ సంకేతాలు వెలువరించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మోడీ వరుసగా తమిళనాడులోని బిజెపి కార్యకర్తలు, నేతలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అనుసంధానం కావడం ఇది నాలుగోసారి.

తమిళనాడులో ఎవరివైపు ?

తమిళనాడుకు సంబంధించి బిజెపి ఏ విధమైన రాజకీయ పొత్తును కుదుర్చుకుంటుంది? డిఎంకెతో ఉంటారా? అన్నాడిఎంకెతో సాగుతారా? లేక ఇంకా పార్టీని



ప్రారంభించకుండా ఉన్న సూపర్‌స్టార్ రజనీకాంత్ వైపు మొగ్గు చూపుతారా? అంటూ వెలువడ్డ ప్రశ్నలకు మోడీ సమాధానాలు ఇచ్చారు. గడిచిన లోక్‌సభ ఎన్నికలలో బిజెపి తమిళనాడులో చిన్నాచితక ఆరు పార్టీలతో ఏర్పడ్డ కూటమికి నాయకత్వం వహించింది. ఇందులో డిఎండికె, పిఎంకె, వైగో నాయకత్వపు ఎండిఎంకె వంటి పార్టీలు ఉన్నాయి. అప్పట్లో ఈ కూటమి రెండు స్థానాలనే గెల్చుకుంది. మిత్రులను పోగొట్టుకుండా ఉండటం, కొత్తవారిని ఆహ్వానించడం ఎన్‌డిఎకున్న విశ్వసనీయతా లక్షణం అని తేల్చిచెప్పారు. అనివార్యతతో తాము పొత్తులకు దిగలేదని, సొంతంగా బిజెపి ఆధిక్యత దక్కించుకున్నా తాము మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వ నిర్వహణకు దిగామని దీనిని తమిళనాడు ప్రజలు గుర్తించాలని కోరారు. ప్రాంతీయ పార్టీలను గౌరవించే తత్వం బిజెపిదని, అయితే కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రాంతీయ పార్టీల పట్ల అనుచితంగానే వ్యవహరించిందని విమర్శించారు. కాంగ్రెస్ వారికి ఆది నుంచి కూడా వారే అధికారం చలాయించగలమనే తత్వం ఉందని, అధికారం వారి ఏకైక హక్కు అనే ధోరణితో వ్యవహరించడం జరుగుతోందని విమర్శించారు.

నేటి నుంచి బిజెపి జాతీయ మండలి

న్యూఢిల్లీ : బిజెపి జాతీయ మండలి రెండు రోజుల సమావేశం శుక్రవారం (నేటి నుంచి) దేశ రాజధానిలో జరుగుతుంది. సమాజంలోని వివిధ వర్గాల వారివద్దకు చేరుకునే కోణంలో ఈ భేటీలో విస్తృత చర్చలు జరుగుతాయి. శీతాకాల పార్లమెంట్ ముగిసిన దశలో లోక్‌సభ ఎన్నికలకు వ్యూహరచనల నేపథ్యంలో బిజెపి భేటీకి విశేష ప్రాధాన్యత ఏర్పడింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలోని మారుమూల ప్రాంతాల నుంచి వేలాది మంది పార్టీ ప్రతినిధులు ఈ భేటీకి ఇప్పటికే తరలివచ్చారు. పార్టీపరంగా బిజెపికి ఇది ఎన్నికల వేడిని రగిలించే శీతాకాలపు సదస్సు అవుతుంది. శుక్రవారం జాతీయ మండలి సమావేశాలను బిజెపి అధ్యక్షులు అమిత్ షా ప్రారంభిస్తారు. కాటా శనివారం ప్రతినిధులను ఉద్దేశించి ప్రధాని మోడీ కీలకోపన్యాసం చేస్తారు. ఈ ముగింపు ప్రసంగం ద్వారా పార్టీ శ్రేణులకు తగు విధమైన కర్తవ్య సందేశం వెలువరిస్తారని భావిస్తున్నారు. ప్రధాని ప్రసంగం ప్రాతిపదికగానే సార్వత్రిక ఎన్నికలకు పార్టీపరంగా కార్యాచరణను రూపొందించుకునేందుకు, అజెండా ఖరారుకు వీలేర్పడుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల మూడు రాష్ట్రాల్లో బిజెపి అధికారం కోల్పోవడంతో నెలకొనన నైరాశ్యంతో పార్టీ వర్గాలు కంగుతిని ఉన్నాయి. అయితే పార్లమెంట్ శీతాకాల సమావేశాల చివరి దశలో ఇబిసిలకు పది శాతం కోటా బిల్లు ఆమోదం పొందడంతో పార్టీ శ్రేణులలో తిరిగి ఉత్తేజం నెలకొందని కొందరు నేతలు తెలిపారు.

Printed and Published by Tumu Mohan Rao on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : Anjaiah Polisetty, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666